www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 2-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 334
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ. 7.55 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ మ. 2.43 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా.6.55-8.36; దుర్ముహూర్తం: ఉ.6.37-8.10; అమృతఘడియలు: శేషం ఉ.6.56, తె.5.00; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గృహజ్యోతి జీరో బిల్లు జారీ

జిల్లాల్లో మంత్రుల చేతుల మీదుగా అందజేత

ఖమ్మంలో భట్టి, వరంగల్‌లో సీతక్క, సురేఖ

దక్షిణ డిస్కమ్‌లో ప్రత్యేక దుస్తులు ధరించి బిల్లుల అందజేత

ఒక్క పిల్లర్ కుంగితేే ఇంత రాద్ధాంతమా?

మాపై పగ తీర్చుకోండి.. రైతులకు నీళ్లివ్వండి

కాళేశ్వరం వంద అంకాల్లో మేడిగడ్డ ఒకటి

చిన్న సమస్యను పెద్దదిగా చూపుతున్నారు

ప్రాజెక్టే నిష్ఫలమైనట్లు ప్రచారం చేస్తున్నారు

మరమ్మతులు చేసి నీళ్లివ్వొచ్చని ఇంజనీర్లు చెప్తున్నా సర్కార్ పట్టించుకోవట్లే: కేటీఆర్

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని రేవంత్ కుట్ర: హరీశ్‌రావు

బీఆర్ఎస్ 'చలో మేడిగడ్డ'లో ఉద్రిక్తత

గేటును తోసి దూసుకొచ్చిన కార్యకర్తలు

కేటీఆర్ బృందానికి కాంగ్రెస్ నిరసన సెగ

వరంగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "కాళేశ్వరం అంటే మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదు. వంద అంకాలతో కూడుకున్న మహోన్నత ప్రాజెక్టు. ఒక్క పిల్లర్ కుంగితేనే కాంగ్రెసోళ్లు రాద్ధాంతం చేస్తున్నారు. చిన్న సమస్యను భూతద్దంలో చూపుతూ మొత్తం ప్రాజెక్టే నిష్ఫలమైనట్లు ప్రచారం చేస్తున్నారు. రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయంటూ చిల్లర మాటలు మాట్లాడుతున్నారు. మాపై పగ ఉంటే తీర్చుకోండి. కానీ, రైతులకు మాత్రం సాగునీరు ఇవ్వండి" అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. "చలో మేడిగడ్డ"లో భాగంగా శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బస్సుల్లో బయలుదేరిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలు.. సాయంత్రం 4.40 గంటలకు బ్యారేజీ

మిగతా 12వ పేజీలో...



మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ మెడకు మేడిగడ్డ ఉచ్చు!

కేంద్ర నిపుణుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి చక్రవ్యూహం

కేంద్ర జలశక్తి అధికారులతో చర్చలు

ఈ వారమే ఆరుగురు సభ్యులతో రంగంలోకి ఎన్డీఎస్ఏ

మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల సందర్శన

లోపాలపై అధ్యయనం..

అనంతరం ప్రభుత్వానికి సూచనలు

వారి సమక్షంలోనే అధికారులను నిలదీయనున్న రేవంత్

న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు అదే కారణమని ఆరోపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. దీనినే అస్త్రంగా చేసుకొని మాజీ సీఎం కేసీఆర్‌ను రాజకీయంగా మరింత దెబ్బకొట్టాలని భావిస్తున్నారు. కేంద్రంలోని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ)కి చెందిన నిపుణుల సహకారంతో తన లక్ష్యాన్ని నెరవేర్చుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కాళేశ్వరానికి సంబంధించి ఫైళ్లన్నింటిపైనా ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్

మిగతా 13వ పేజీలో...



పౌరసమాజం ప్రతినిధులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రైతులకో కమిషన్

విద్యా కమిషన్‌నూ ఏర్పాటు చేస్తాం

కౌలు రైతుల రక్షణకు చట్టం.. అఖిలపక్ష భేటీ పెట్టి నిర్ణయం

నియోజకవర్గాల్లో 25 ఎకరాల్లో గురుకుల ప్రాంగణాలు

పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఏర్పాటు చేస్తాం

పౌరసమాజం ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి

ఫసల్ బీమా యోజనలో మళ్లీ చేరాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ రంగం, విద్యా విధానంలో సంస్కరణలు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రైతు కమిషన్, విద్యా కమిషన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ సామాజిక సంస్థలు, పౌరసమాజ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, వారి సంక్షేమంతోపాటు వ్యవసాయ రంగంలో ప్రవేశపెట్టాల్సిన సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ సలహాలు, సూచనలు ఇస్తుందన్నారు. విద్యా విధానం ఎలా ఉండాలనేది ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుందని తెలిపారు. కౌలు రైతుల రక్షణకుగాను చట్టాన్ని తీసుకురావాలనే యోచన ఉందని, ఇందుకోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందరి సలహాలు, సూచనలు తీసుకుంటామని అన్నారు. రైతు భరోసా అనేది రైతులకు

మిగతా 13వ పేజీలో...

కాళేశ్వరం అప్పులు కేసీఆర్ కేటీఆరే కట్టాలి!

నీళ్ల కోసం కాదు.. పైసల కోసమే ప్రాజెక్టులు 13

ఆ రుణాలను తండ్రీకొడుకుల నుంచి రాబట్టాలి

కేంద్రం పాపమూ ఉంది.. లక్ష కోట్ల రుణాలిచ్చింది

డ్యామేజీలు చూసైనా బీఆర్ఎస్ క్షమాపణలు చెప్పాలి

ఎన్డీఎస్ఏ నివేదిక తర్వాతే బ్యారేజీల మరమ్మతులు

త్వరగా పరిశీలించాలని నేడు ఢిల్లీ వెళ్లి కోరతాం

విలేకర్లతో ఇష్టాగోష్ఠిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కేసీఆర్‌ను మేడిగడ్డకు తీసుకెళ్లలేదే?

కేటీఆర్ గిమ్మిక్కులను ప్రజలు నమ్మరు: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

ఓడినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు: మల్లు రవి 12

'పాలమూరు' 50% కూడా పూర్తికాలేదు: వంశీచంద్‌రెడ్డి

కేటీఆర్ మేడిగడ్డకు కాదు.. ఎర్రగడ్డకు వెళ్లాలి: శంకర్

ప్రాజెక్టును సందర్శించిన 'ఉమ్మడి పాలమూరు' ఎమ్మెల్యేలు

హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్!

హెచ్ఎండీఏ పరిధిలోని 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల విలీనం!

ఒకే సంస్థగా ఆవిర్భావం లేదా నాలుగు కార్పొరేషన్లుగా విభజన 13

సమాన జనాభా ఉండేలా డివిజన్ల విభజన.. సమ అభివృద్ధే లక్ష్యం

పాలకవర్గాల పదవీకాలం ముగియగానే విలీన ప్రక్రియ ప్రారంభం

అధ్యయనం చేయాలని పురపాలక శాఖను ఆదేశించిన రేవంత్‌రెడ్డి

మార్చి నుంచే వడగాడ్పులు!

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక

మే వరకు దేశంలో తీవ్ర ఎండలు 2

జూన్ చివరి నాటికి ఎల్‌నినో బలహీనం

నైరుతి ద్వితీయార్థంలో మంచి వర్షాలు



ఆ ఫ్లైఓవర్లకు కేంద్రం ఆమోదం

భూములు అప్పగించేందుకు రక్షణ శాఖ అంగీకారం.. హెచ్ఎండీఏకు లేఖ

జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు.. ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు రెండు ఫ్లైఓవర్లకు 169 ఎకరాల్లో పనులకు పచ్చజెండా 13

బేగంపేట, హకీంపేట వద్ద సొరంగాలు ఉండాల్సిందే

సరి సమాన విలువైన భూమి లేదా రూ.1,702 కోట్లు చెల్లించాలని షరతు

ఫ్లైఓవర్లతో నిరాటంకంగా రాజీవ్ రహదారి, నాగ్‌పూర్ హైవేపైకి..

ఉత్తర దిశగా గ్రేటర్ అభివృద్ధి మరింత వేగవంతం.. ప్రధాని మోదీకి సీఎం కృతజ్ఞతలు

గత ప్రభుత్వ అహంకారపూరిత వైఖరి వల్లనే ఇన్నేళ్ల జాప్యమని విమర్శ

వైసీపీకి ఓటేయొద్దు

ప్రజా తీర్పుతోనే నాకు న్యాయం.. వివేకా హంతకులను రక్షిస్తున్న జగన్

నా అక్కా, చెల్లి అంటారే.. నేను చెల్లిని కాదా?

'విశ్వసనీయత, విలువలు' ఉత్తి మాటలేనా?

వివేకా హత్య విషయంలో గుర్తుకు రావా?

న్యాయం కోసం మొదట అడిగింది అన్ననే..

ఆయన చెప్పిన సమాధానాలతో ఆశ్చర్యపోయా!

ఈ కేసులో జగన్ పాత్రపైనా విచారణ జరగాలి

అవినాశ్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలి

వివేకా కుమార్తె సునీతా రెడ్డి డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): "మా నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఐదేళ్లు అవుతోంది. న్యాయం కోసం ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నాను. నాకు జరుగుతున్న అన్యాయానికి ప్రజాతీర్పుతోనే తెరపడాలి" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాబాయ్ కుమార్తె నర్రెడ్డి సునీతా రెడ్డి పేర్కొన్నారు. తాను తొలుత జగనన్న సహాయమే కోరానని.. కానీ, వంచనే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వంలో హత్యా రాజకీయాలు ఉండకూడదు. ఇంత వంచన చేసిన పార్టీకి, మోసం చేసిన

మిగతా 3వ పేజీలో...



అన్న గల్లీలో పులి, ఢిల్లీలో పిల్లి

తల్లిలాంటి ఏపీని హత్యచేశారు

ప్రత్యేక హోదా, రాజధాని డీఎస్సీ.. అంతా దగా

ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తాం

ప్రతి ఇంటికీ రూ.5వేలు అభయహస్తం 3

తిరుపతి సభలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ విడుదల



డ్రగ్స్ తీసుకోలేదు.. ఏ పరీక్షకైనా సిద్ధం

రాడిసన్ హోటల్ డ్రగ్స్ కేసులో డీసీపీ ఎదుట హాజరైన దర్శకుడు క్రిష్

గంటసేపు మాట్లాడిన డీసీపీ వినీత్

ఫ్రెండ్ పిలిస్తే వెళ్లాను..

అక్కడ అరగంటే ఉన్నానన్న దర్శకుడు

అందుబాటులో లేనే సకాలంలో రాలేకపోయానని వెల్లడి 12

మూత్ర, రక్త పరీక్షలకు డీసీపీ ఆదేశం

ధరణి బూచితో భూమి స్వాహా

రూ.500 కోట్ల భూమి.. బోయినపల్లి వినోద్ సోదరుడికి రిజిస్ట్రేషన్

వట్టినాగులపల్లిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొనుక్కున్న భూముల్ని కారుచౌకగా కొట్టేసిన వైనం

ధరణిలో భూదాన్ భూమిగా చూపి తక్కువ రేటుకు కొనుగోలు

2002లో 8 ఎకరాల భూమి కొన్న 63 మంది విప్రో ఉద్యోగులు

వారు పెట్టుకున్న సొసైటీ పేరిట 2009లో ఆ భూముల రిజిస్ట్రేషన్

111 జీవో ఎత్తివేతతో వాటి ధర పెరగడంతో బోయినపల్లి కన్ను!

సొసైటీ అధ్యక్షుడితో పాటు దాసోహం అన్న రెవెన్యూ అధికార్లు

అప్పటిదాకా నిషేధిత జాబితాలో ఉన్న భూమికి పాస్‌బుక్ జారీ

భూమిని రిజిస్ట్రేషన్ చేయొద్దన్న డీసీవో ఆదేశాలూ బేఖాతర్

ధరణి దారుణాలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు బలయ్యారు. 2002లో కొన్న భూముల ధరలు.. 111 జీవో ఎత్తివేతతో భారీగా పెరగడంతో వారు ఆనందించారు. కానీ.. ఖరీదైన ఆ భూములపై గత ప్రభుత్వ పెద్దలకు బాగా దగ్గరైన ఓ బడాబాబు సోదరుడి కన్ను పడింది! అంతే.. 2009లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట రిజిస్ట్రేషన్ కూడా పూర్తయిన ఆ భూములు ధరణిలో భూదాన్ భూములుగా నమోదయ్యాయి. దాన్ని చూపి 'మీ భూములు మీకు రావు' అని వారిని భయపెట్టి, ఆందోళనకు గురి చేసి.. సొసైటీ అధ్యక్షుడితో పాటు మరికొందర్ని తమ వైపు తిప్పుకొని ఆ భూమిని కొనుగోలు చేయడానికి రంగం సిద్ధం చేశాడు. అంతే.. రికార్డులు తారుమారైపోయాయి. ధరణిలో అవి పట్టా భూములుగా మారిపోయాయి. ఆగమేఘాలపై రిజిస్ట్రేషన్ పూర్తయింది. 'ధరణి' అనే భూతాన్ని తెరపైకి తెచ్చి నగరం నడిబొడ్డున రూ.500 కోట్ల భూమిని చౌకగా కొట్టేసిన దందా ఇది!!



వట్టినాగులపల్లిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొనుగోలు చేసిన భూమి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

సొంతింటి కలతో దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఓ సొసైటీగా ఏర్పడి ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కొందరు దారుణంగా మోసపోయారు. సొసైటీ అధ్యక్షుడు, మరికొందరు ముఖ్యుల చేతిలోనే నమ్మకద్రోహానికి గురై లబోదిబోమంటున్నారు. దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థ విప్రోలో పనిచేస్తున్న ఉద్యోగులు 63 మంది కలిసి 2002లో 'సాఫ్ట్‌వేర్ అసోసియేట్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అందరూ కలిసి వట్టినాగులపల్లిలో 8.07 ఎకరాల భూమి కొనుగోలు

మిగతా 14వ పేజీలో...

ఇంటర్ పరీక్షలకు 5 నిమిషాల గ్రేస్ టైమ్

9.05 వరకు కేంద్రంలోకి అనుమతి

ప్రకటించిన బోర్డు అధికారులు 3

4 నుంచి స్పాట్ వాల్యుయేషన్

మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న ఇద్దరు లెక్చరర్ల అరెస్టు

కామారెడ్డి జిల్లాలోని ఓ ప్రభుత్వ కళాశాలలో ఘటన 3

అమిత్ షా కారు నంబర్లో సీఏఏ

సోషల్ మీడియాలో వైరల్



న్యూఢిల్లీ, మార్చి 1: కేంద్ర హోం మంత్రి అమిత్ షా కారు నంబరు వైరల్ అయింది. 'బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి షా పార్టీ కేంద్ర కార్యాలయానికి కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో పాల్గొనడానికి హాజరయ్యారు' అంటూ ఓ వీడియోను మీడియా సంస్థ ఒకటి తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఫిబ్రవరి 29న పోస్టు చేసిన ఆ వీడియోలో షా కారు నంబరు డీఎల్1సీఏఏ4421. దానిలో సీఏఏ (సిటిజెన్స్ అమెండ్‌మెంట్ యాక్ట్) అని ఉండడాన్ని గమనించిన ఎక్స్ ఖాతాదారు ఒకరు దానిని హైలైట్ చేస్తూ రీపోస్టు చేయడంతో అది వైరల్ అయింది. పోస్టు చేసి 24 గంటలు గడవక ముందే దానిని లక్ష మందికిపైగా వీక్షించారు. 2,300 మంది ఇష్టపడ్డారు. అనేక మంది తమ వ్యాఖ్యానాలను జోడించారు. 'దీని అర్థం సీఏఏని వారు తప్పనిసరిగా అమలు చేస్తారని' అని ఒక ఎక్స్ యూజర్ వ్యాఖ్యానించగా.. మరొకరు 'సీఏఏ వాళ్ల దృష్టిలో ఎప్పుడూ ఉంది' అని పేర్కొన్నారు. కాగా, మోడల్ కోడ్ అమలులోకి రాకముందే సీఏఏ విధివిధానాలను నోటిఫై చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేయనున్నదని సమాచారం.

ప్లే స్టోర్ నుంచి మ్యాట్రిమోనీ యాప్స్ తొలగింపు

» 10 సంస్థల యాప్‌లపై చర్య.. వీటిలో భారత్ మ్యాట్రిమోనీ

న్యూఢిల్లీ, మార్చి 1: సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ చార్జీల చెల్లింపు వివాదంతో భారత్‌కు చెందిన పలు మ్యాట్రిమోనీ యాప్స్‌ను ప్లే స్టోర్ నుంచి తొలగించింది. బిల్లింగ్ నిబంధనలపై యాప్ డెవలపర్లతో విభేదాలు నెలకొన్న సమయంలో గూగుల్ తీసుకున్న చర్య స్టార్టప్ మార్కెట్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. శుక్రవారం ప్లే స్టోర్ నుంచి పది సంస్థల యాప్‌లను గూగుల్ తీసివేసింది. వీటిలో మ్యాట్రిమోనీ.కామ్‌కు చెందిన భారత్ మ్యాట్రిమోనీ, క్రిస్టియన్ మ్యాట్రిమోనీ, ముస్లిం మ్యాట్రిమోనీ, జోడీతో పాటు ఇన్ఫో ఎడ్జ్‌కు చెందిన జీవన్ సాథీ ఉన్నాయి. గతంలో గూగుల్ 15 నుంచి 30 శాతం చార్జీలను వసూలు చేసేది. అయితే, నియంత్రణ సంస్థల (యాంటీ ట్రస్ట్) ఆదేశాల అనంతరం 11 నుంచి 26 శాతం రుసుములు విధిస్తోంది. కానీ, ఈ చార్జీలను కూడా అడ్డుకునేందుకు కొన్ని స్టార్టప్ సంస్థలు ప్రయత్నించడం వివాదానికి కేంద్రమైంది. చార్జీల విధింపు, యాప్‌ల తొలగింపు విషయంలో గూగుల్‌కు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. అనంతరం ప్లే స్టోర్ నిబంధనల ఉల్లంఘనపై భారత్ మ్యాట్రిమోనీ.కామ్, ఇన్ఫో ఎడ్జ్‌లకు గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ నోటీసులు పంపింది. వీటిని తాము పరిశీలిస్తున్నామని.. తదుపరి చర్యలపై ఆలోచిస్తున్నామని ఆయా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈలోగానే గూగుల్ చర్యలు తీసుకుంది. ఈ పరిణామాన్ని భారత ఇంటర్నెట్ చరిత్రలో చీకటి రోజుగా మ్యాట్రిమోనీ.కామ్ ఫౌండర్ మురుగవేల్ జానకీరామన్ అభివర్ణించారు.

లోకం తీరు



ఇప్పుడవన్నీ ఎందుకులే సార్..
అటు తిరిగి ఇటు తిరిగి మన మీదికే వస్తే కష్టం!

భారత్ నేతృత్వంలో బిగ్ క్యాట్ కూటమి

న్యూఢిల్లీ, మార్చి 1: భారత్ నేతృత్వంలో కొత్తగా అంతర్జాతీయ బిగ్ క్యాట్ కూటమి (ఐబీసీఏ) ఏర్పాటైంది. బ్రెజిల్, నేపాల్, బంగ్లాదేశ్, మలేసియాతోపాటు మొత్తం 16 దేశాలు ఈ కూటమిలో అధికారికంగా చేరినట్టు కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. అలాగే అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంస్థ (ఐయూసీఎన్), వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సహా తొమ్మిది అంతర్జాతీయ సంస్థలు ఐబీసీఏలో చేరేందుకు అంగీకారం తెలిపాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో గురువారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం భారత్‌లో ప్రధాన కార్యాలయం ఉండేలా ఐబీసీఏ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పులులు, సింహాలు, చిరుతలు, జాగ్వార్లు వంటి ఏడు రకాల బిగ్ క్యాట్ జాతులను సంరక్షించే బాధ్యతను ఐబీసీఏ చూసుకుంటుంది.

దేశవ్యాప్తంగా 7 కోట్ల మందికి ఊబకాయం

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రపంచాన్ని వేధిస్తున్న అతిపెద్ద సమస్యల్లో ఊబకాయం ఒకటి. భారీకాయం సమస్య భారత్‌లోనూ తీవ్రంగానే ఉందని.. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ఎక్కువ మంది యువత, చిన్నారులు దీని బారిన పడుతున్నారని 'ది లాన్సెట్' తాజా గ్లోబల్ విశ్లేషణలో వెల్లడైంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఊబకాయంతో బాధపడుతున్న వారి సంఖ్య 100 కోట్లు దాటిందని ఈ అధ్యయనం గుర్తించింది. ఈ నివేదిక ప్రకారం.. 2022లో భారత్‌లో 20 ఏళ్లు పైబడిన వారిలో ఏడు కోట్ల మంది, 5 నుంచి 19 ఏళ్లలోపు వయసున్న చిన్నారుల్లో 1.25 కోట్ల మంది అధిక బరువుతో ఉన్నట్టు తేలింది. 20 ఏళ్లు పైబడిన వారిలో 4.4 కోట్ల మంది మహిళలు, 2.6 కోట్ల మంది పురుషులు, చిన్నారుల్లో 73 లక్షల మంది బాలురు, 52 లక్షల మంది బాలికలు ఊబకాయంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. 1990లో భారత్‌లో కేవలం 4 లక్షలుగా ఉన్న ఊబకాయుల సంఖ్య నేడు గణనీయంగా పెరిగింది. ఓవరాల్‌గా భారత్‌లో 3 శాతానికిపైగా పిల్లలు, టీనేజర్లు ఊబకాయంతో బాధపడుతున్నట్టు అధ్యయనంలో గుర్తించారు.

కేంద్రప్రభుత్వంలోకి 25మంది ప్రైవేటు నిపుణులు

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రైవేటురంగంలోని 25మంది నిపుణులను ప్రభుత్వ నిర్వహణలోకి తీసుకోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. పరిపాలనను మెరుగుపరిచే లక్ష్యంతో బయటినుంచి ప్రతిభావంతులను కేంద్ర శాఖలు, విభాగాల్లో మోదీ ప్రభుత్వం నియమిస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రధాని నేతృత్వంలోని కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ తాజాగా 25 మందిని వేర్వేరు హోదాల్లో నియమించింది. వీరిలో ముగ్గురు సంయుక్త కార్యదర్శులుగా, 22 మంది డైరెక్టర్లు/ఉప కార్యదర్శులుగా సేవలందించనున్నారు. వీళ్ల పదవీకాలం రెండేళ్లు (లేటరల్ ఎంట్రీ). సాధారణంగా ఈ పోస్టులకు అఖిల భారత సర్వీసులు, గ్రూపు-ఏ అధికారులను తీసుకుంటారు. అయితే, మోదీ తొలి విడత పాలనాకాలంలో, 2018లో ఈ విధానంలో మార్పు తెచ్చారు. అప్పట్లో 10 జాయింట్ సెక్రటరీ హోదా పోస్టులకు నియామకాలు జరిపారు.

ఇంట్లో గ్యాస్ లీక్..ముగ్గురు చిన్నారులు ఆహుతి

చెన్నై, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ లీకవడంతో సంభవించిన ప్రమాదంలో ఓ బాలిక, ఇద్దరు బాలురు అగ్నికి ఆహుతయ్యారు. వీరితో పాటు తీవ్రంగా గాయపడిన తల్లి ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. తమిళనాడులోని చెంగల్పట్టు పట్టణంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. చెంగల్పట్టు మణియక్కార వీధిలో సద్దాం, రోసీగుత్తమ్ (25) అనే బీహారీ దంపతులు నివసిస్తున్నారు. వీరికి రజియా పర్వీన్ (7) అనే కుమార్తె, సాయ్‌అలీ (4), అల్తాఫ్ (2) ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం రాత్రి వీరి వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీకై నలువైపులా మంటలు చెలరేగాయి. రోసీగుత్తమ్, ఆమె పిల్లలు మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతుండగా రజియా, సాయ్ అలీ, అల్తాఫ్ మృతిచెందారు. రోసీగుత్తం ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వర్కర్, ఇద్దరు విద్యార్థులపై వేటు

» ఇద్దరు విద్యార్థులకు గంజాయి అందించింది వర్కరే

» అతడు పనిలోంచి తొలగింపు..

ఆ విద్యార్థులపై ఒక సెమిస్టర్ పాటు సస్పెన్షన్ వేటు

బాసర, మార్చి 1 : నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో గంజాయి ఘటనపై నార్కో బృందం శుక్రవారం విచారణ చేపట్టింది. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన అధికారుల బృందం.. గంజాయితో గుర్తించిన విద్యార్థులను, మరికొంత మంది ప్రమేయం ఉందని భావిస్తున్న విద్యార్థులను నార్కో బృందం విచారించింది. వారి వద్ద లభించిన సిగరెట్లలో ఉన్న ఆకులను యూనివర్సిటీ అధికారులు నార్కో బృందానికి అప్పగించారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఇటీవల విద్యార్థులు గంజాయి పీల్చుతూ పట్టుబడ్డ విషయం తెలిసిందే. ఫలితంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఇందులో భాగంగానే అధికారులు శుక్రవారం యూనివర్సిటీకి వచ్చి విచారణ చేపట్టారు. విద్యార్థులకు గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని.. యూనివర్సిటీలోని శక్తి మెస్‌లో పనిచేసే జార్ఖండ్‌కు చెందిన వర్కర్‌గా గుర్తించారు. ఆ వర్కర్‌తో పాటు ఇందులో మరో ఇద్దరు వర్కర్‌లకు ప్రమేయం ఉన్నట్లు అధికారుల విచారణలో తేలింది. నార్కో బృందం విచారణ చేపడుతుందని.. త్వరలోనే అన్ని విషయాలు వెల్లడవుతాయని వైస్ చాన్స్‌లర్ వెంకటరమణ చెప్పారు. ప్రాథమిక విచారణ ఆధారంగా ఇద్దరు విద్యార్థులను ఒక సెమిస్టర్ పాటు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. గంజాయి సరఫరా చేసిన మెస్ వర్కర్‌ను కూడా పనిలో నుంచి తొలగించినట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీలో నోడల్ ఆఫీసర్‌ల పాలనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హాస్టల్, వైద్య సేవలు, భోజన శాలలు, సెక్యూరిటీ, అకడమిక్, పరీక్షలు ఇలా ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. ప్రభుత్వం కూడా వర్సిటీపై ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు.

గురుకుల టీజీటీ ఫలితాల విడుదల

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ గురుకులాల్లోని ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ) తుది ఫలితాలు వెల్లడయ్యాయి. గురుకుల బోర్డు తుది జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. టీజీటీ సబ్జెక్టులవారీగా మొత్తం 4,006 పోస్టులకుగాను శుక్రవారం 2500 వరకు పోస్టులకు సంబంధించిన తుది జాబితాను వెలువరించింది. మిగిలిన పోస్టులకు సంబంధించిన ఫలితాలను త్వరలోనే బోర్డు వెల్లడించనుంది.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి 41 ఏ నోటీసు

అఫ్జల్‌గంజ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి బేగంబజార్ పోలీసులు 41(ఏ) నోటీసు జారీచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను ఎండగడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి 2023, నవంబర్ 4న గాంధీభవన్‌లో (సారు-కారు-420.. అంటూ) వినూత్నంగా నిరసన తెలిపారు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు.

మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఒబేదుల్లా కొత్వాల్

మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నేత ఒబేదుల్లా కొత్వాల్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండేళ్లు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఇంతకుముందు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంతియాజ్ ఇసాక్‌కు ఈ పదవి ఇవ్వగా.. మళ్లీ మహబూబ్‌నగర్‌కే ఈ పదవి దక్కడం విశేషం. తనకు పదవి ఇచ్చినందుకు సీఎం రేవంత్‌కు ఒబేదుల్లా కృతజ్ఞతలు తెలిపారు.


ఈ సారి వడగాడ్పుల జోరు

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక.. మే వరకు దేశంలో తీవ్ర ఎండలు

» జూన్ చివరి నాటికి ఎల్‌నినో బలహీనం

» నైరుతి ద్వితీయార్ధంలో మంచి వర్షాలు





విశాఖపట్నం/హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భూమధ్య రేఖకు ఆనుకుని పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం తీవ్రంగా ఉన్న ఎల్‌నినో పరిస్థితులు వేసవి చివరి వరకూ కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో పసిఫిక్‌లో ఉపరితల ఉష్ణోగ్రతలు వేడిగా ఉండనున్నందున ఆ దిశగా వచ్చే గాలులతో దేశంలో మార్చి నుంచి మే నెల వరకూ మూడు నెలలు ఎండలు తీవ్రంగా ఉంటాయి. అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ప్రత్యేకించి మార్చిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాలో వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. వేసవి మూడు నెలలకు(మార్చి నుంచి మే వరకు) సంబంధించి బులెటిన్ విడుదల చేసింది. మార్చి నుంచి మే వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. అదే సమయంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. దీంతోపాటు వడగాడ్పులు వీచే రోజుల సంఖ్యా ఎక్కువ కానున్నాయి. మార్చిలో దక్షిణాది రాష్ట్రాలు, మధ్యభారతంలోని పశ్చిమ ప్రాంతాలు, ఈశాన్య, వాయువ్య భారతంలో పగటి ఉష్ణోగ్రతలు, హిమాలయ ప్రాంతాలు తప్ప దేశంలోని మిగిలినచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఏపీ, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాలో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే ఎక్కువగా నమోదుకావడంతోపాటు వేడి వాతావరణం నెలకొన్న విషయాన్ని వాతావరణ నిపుణులు గుర్తుచేస్తున్నారు. మార్చిలో దేశంలో వాయవ్య భారతం, కేరళ, కర్ణాటకతోపాటు ఈశాన్య రాష్ట్రాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. దీర్ఘకాలిక సగటులో 117% అంటే 29.9 మి.మీ. వర్షపాతం కురుస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాగా, వాయవ్య భారతంలో పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉండడంతో గోధుమ దిగుబడి తగ్గుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆగస్టు, సెప్టెంబరుల్లో మంచి వర్షాలు

పసిఫిక్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో వేసవి చివరి వరకు కొనసాగి తరువాత జూన్ నుంచి బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయి. జూన్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమై ఆగస్టు నాటికి లానినా మొదలవుతుందని అంతర్జాతీయ వాతావరణ మోడళ్లతోపాటు ఐఎండీ అంచనా వేస్తున్నాయి. దీంతో నాలుగు నెలల నైరుతి రుతుపవనాల సీజన్ రెండో భాగం అంటే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు మైక్రోచిప్‌లు పెట్టాలా?

న్యూఢిల్లీ, మార్చి 1: ఎంపీలు, ఎమ్మెల్యేల కార్యకలాపాలను నిరంతరం డిజిటల్ మార్గాల ద్వారా పర్యవేక్షిస్తుండాలని కోరిన పిటిషనర్‌పై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేల భుజాలకు ఏమైనా మైక్రోచిప్స్ పెట్టాలా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజుల్లా వ్యవహరిస్తున్నారని, అందువల్ల వారి రోజువారీ కార్యక్రమాలన్నింటినీ సీసీటీవీ కెమేరాల్లో రికార్డు చేయించి పర్యవేక్షించాలని కోరుతూ సురేందర్ కుంద్రా అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఫుటేజీని ప్రజల మొబైల్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇదేం పిటిషన్ అంటూ ప్రశ్నించిన జస్టిస్ చంద్రచూడ్.. ప్రజాప్రతినిధులకు ప్రైవసీ హక్కు ఉండదా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇలాంటి పిటిషన్లు వేయకూడదని హెచ్చరించారు.

ఆశారాం బాపు శిక్ష రద్దుకు సుప్రీంకోర్టు తిరస్కరణ

న్యూఢిల్లీ, మార్చి 1: వృద్ధాప్యం, అనారోగ్య కారణాల దృష్ట్యా జైలు శిక్షను రద్దు చేయాలని కోరుతూ తనను తాను దేవునిగా చెప్పుకొనే ఆశారాం బాపు చేసిన వినతిని శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. రేప్ కేసులో దోషిగా తేలిన ఆయన ప్రస్తుతం యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. పోలీసు కస్టడీలో ఉంటూ మహారాష్ట్రలోని మాధవ్‌బాగ్ హార్ట్ హస్పటల్‌లో చికిత్స పొందేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫున న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టును కోరారు. దీన్ని కోర్టు తిరస్కరించింది.

కాంగ్రెస్‌కు గడ్కరీ లీగల్ నోటీసు

న్యూఢిల్లీ, మార్చి 1: తన వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపిస్తూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కాంగ్రెస్ పార్టీకి లీగల్ నోటీసులు పంపించారు. తాను ఇటీవల ఒక చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని 19 సెకండ్ల వీడియో క్లిప్‌ను తప్పుడు అర్థం వచ్చేలా ప్రచారం చేశారని ఆరోపించారు. "గ్రామాల్లో ప్రజలు, పేదలు, రైతులు, కూలీలు అసంతృప్తితో ఉన్నారు. మంచి రోడ్లు, తాగునీరు, ఆస్పత్రులు, పాఠశాలలు లేకపోవడమే ఇందుకు కారణం"అని ఆ వీడియోలో ఉంది. వేరే సందర్భంలో తాను అన్న మాటలను పార్టీలో గందరగోళం నెలకొనేలా కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

లక్షదీవుల్లో నౌకాదళం కొత్త స్థావరం

ఐఎన్ఎస్ జటాయు పేరుతో వచ్చే వారం ప్రారంభం

» హిందూ మహాసముద్రంలో శత్రువుల కదలికపై నిఘా కోసం ఏర్పాటు

» ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై జరిగే కమాండర్ల సదస్సులో స్థావరానికి పచ్చజెండా



న్యూఢిల్లీ, మార్చి 1: హిందూ మహాసముద్రంలో శత్రువుల సైనిక, వాణిజ్య పరమైన కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచటానికి వీలుగా భారత నౌకాదళం.. ఐఎన్ఎస్ జటాయు పేరుతో లక్షదీవుల్లో ఒక కొత్త స్థావరాన్ని వచ్చే వారం ప్రారంభించనుంది. తొలుత కొద్దిమంది అధికారులు, సిబ్బందితో మొదలుపెట్టి ఆ తర్వాత దీనిని పూర్తిస్థాయిలో విస్తరించనుంది. లక్షదీవుల్లోని మినికాయ్ ద్వీపంలో ఈ స్థావరం ఉంటుందని రక్షణశాఖకు చెందిన ఒక అధికారి తెలిపినట్లుగా ఏఎన్ఐ వార్తాసంస్థ శుక్రవారం వెల్లడించింది. మాల్దీవులకు దాదాపు 80 కి.మీ.ల దూరంలో ఉండే ఈ స్థావరంతో నిఘాపై మరింత పట్టు పెరుగుతుందని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో ఉన్న ఐఎన్ఎస్ బాజ్‌లాగే ఇది పని చేస్తుందని తెలిపారు. యుద్ధవిమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై వచ్చే వారం సంయుక్తంగా నిర్వహించే కమాండర్ల సదస్సులో ఈ కొత్త స్థావరాన్ని ప్రారంభించాలని నౌకాదళం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సదస్సు సందర్భంగా ఉన్నతస్థాయి విన్యాసాలు చేపట్టనున్నారు. మరోవైపు, నాలుగు కొత్త ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు నౌకాదళంలో తమ సేవలను వచ్చే వారం కొచి నుంచి మొదలుపెట్టనున్నాయి. బహుళ ప్రయోజనార్థకంగా ఉండే ఈ హెలికాప్టర్లను అమెరికా నుంచి కొనుగోలు చేశారు. ఈ నెల 4వ తేదీన గోవాలో నౌకదళ యుద్ధ కళాశాలను కూడా ప్రారంభించనున్నారు.

మహిళల కన్నీళ్లకన్నా

ఓట్లే ముఖ్యమా?

పశ్చిమ బెంగాల్‌లో మోదీ



కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో ప్రధాని మోదీతో మమత భేటీ

న్యూఢిల్లీ, మార్చి 1: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సందేశ్ ఖాలీలో బాధిత మహిళల కన్నీళ్లు తుడవడం కన్నా కొందరి ఓట్లే ముఖ్యమనుకొంటున్నారా.. అని ఆ రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని ప్రధాని మోదీ చెప్పారు. మహిళల్ని లైంగికంగా వేధించిన కేసు, భూ ఆక్రమణల కేసులో అరెస్టయిన తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ అన్ని హద్దుల్ని దాటారని అయినా ఆయన్ను అరెస్టు చేయకుండా రెండు నెలలు కాపాడారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఆరాంబాగ్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సందేశ్ ఖాలీ ఉదంతంపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. మా... మాటి.. మానుష్(తృణమూల్ కాంగ్రెస్ నినాదం) అనేవారు... సందేశ్ ఖాలీలో మహిళలకు చేసిన అన్యాయం చూసి దేశం యావత్తూ విస్తు పోయిందని చెప్పారు. తృణమూల్ నేత షాజహాన్ వేధింపుల్ని తట్టుకోలేక సందేశ్ ఖాలీ మహిళలు సాయం కోరితే... మమత, బెంగాల్ ప్రభుత్వం అతడిని కాపాడడానికి తమ అధికారాన్నంతా ఉపయోగించారని ఆరోపించారు. చివరికి బీజేపీ నేతల ఒత్తిడి వల్ల బెంగాల్ పోలీసులు గురువారం నిందితుల్ని అరెస్టు చేయక తప్పలేదని చెప్పారు. ప్రజలు తమకు తగిలిన ప్రతీ దెబ్బకు ఓటుతో జవాబు చెప్పాలన్నారు. ఇంత జరుగుతున్నా... ఇండియా కూటమి నేతలు మహాత్ముడి మూడు కోతుల్లా తమ కళ్లు, చెవులు, నోరు మూసుకున్నారని ఎద్దేవా చేశారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో ప్రధాని మోదీని శుక్రవారం సాయంత్రం కలుసుకొన్నారు. మర్యాదపూర్వకంగానే ప్రధానిని కలిసినట్లు ఆమె విలేకరులకు చెప్పారు. కాగా జార్ఖండ్‌లో జేఎంఎం పార్టీ అవినీతికి పర్యాయపదంగా మారిందని ప్రధాని మోదీ ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని బార్వాడలో నిర్వహించిన విజయ్ సంకల్ప్ మహా ర్యాలీలో మాట్లాడుతూ పాలకపక్షంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ రాష్ట్రంలో ప్రధాని శుక్రవారం రూ.35,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.

బెంగళూరులో పేలుడు

పది మందికి గాయాలు

» కుందలహళ్లిలోని రామేశ్వరం కేఫ్‌లో ఘటన

» వాష్‌బేసిన్ వద్ద బ్యాగ్ వదిలిన వ్యక్తులు

» బాధ్యులపై కఠిన చర్యలు: సిద్దరామయ్య



పేలుడుతో ధ్వంసమైన రామేశ్వరం కేఫ్

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని కుందలహళ్లి సమీపంలో ఉన్న రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మొత్తం పది మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... హోటల్ రద్దీగా ఉన్న సమయంలోనే మధ్యాహ్నం ఒంటిగంటకు రెండుసార్లు పేలుడు సంభవించింది. దీంతో కస్టమర్లతో పాటు హోటల్ సిబ్బంది బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కేఫ్‌కు రెండు బ్యాగులతో వచ్చినవారు వాష్‌బేసిన్ వద్ద ఓ బ్యాగును వదిలి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడే పేలుడు సంభవించింది. ఘటన జరిగిన ప్రాంతంలో బ్యాటరీ, వైర్లు, మేకులు, ఐడీ కార్డుకు సంబంధించిన ట్యాగ్ తదితర వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి సమీపంలోనే మరో బ్యాగును కూడా గుర్తించారు. ఎన్ఐఏ, సీసీబీ, ఇంటెలిజెన్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి. కేఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేఫ్‌లో పేలుడు జరిగినట్లు గుర్తించామని, మరిన్ని వివరాల కోసం సోదాలు చేస్తున్నామని డీజీపీ అలోక్ మోహన్ తెలిపారు. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి కొంత విషమంగా ఉందని వివరించారు. కాగా, రామేశ్వరం కేఫ్‌లో పేలుడును తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం సిద్దరామయ్య అన్నారు. అయితే దీన్ని ఉగ్రవాద చర్యగా ప్రకటించలేమన్నారు. పథకం ప్రకారమే పేలుళ్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామని పేర్కొన్నారు. కాగా, కేఫ్‌లో బ్యాగ్ పెట్టిన వ్యక్తిని సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు.

పది సెకన్ల వ్యవధిలో పేలుళ్లు: కేఫ్ ఎండీ

పది సెకన్ల వ్యవధిలో రెండుసార్లు పేలుడు జరిగిందని రామేశ్వరం కేఫ్ మేనేజింగ్ డైరెక్టర్ దివ్య తెలిపారు. బయట నుంచి వచ్చిన వ్యక్తి బ్యాగు తీసుకొచ్చి లోపల పెట్టారని తెలిపారు. కస్టమర్లు వాష్‌బేసిన్‌కు వెళ్లేచోట 12.55గంటలకు పేలుడు జరిగిందని, ఆ బ్యాగు విషయంలో తమకు అనుమానం ఉందన్నారు. గతంలోనూ రెండుసార్లు తమ కేఫ్‌లో అనుమానాస్పద బ్యాగులను గుర్తించామని, ఒక బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని దివ్య వివరించారు.

39,125 కోట్లతో రక్షణ కొనుగోళ్లు

న్యూఢిల్లీ, మార్చి 1: త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు రూ.39,125 కోట్లతో ఐదు భారీ రక్షణ సాధన కొనుగోలు ఒప్పందాలపై భారత్ శుక్రవారం సంతకాలు చేసింది. దీనిలో భాగంగా బ్రహ్మోస్ క్షిపణులు, రాడార్లు, ఆయుధ వ్యవస్థలు, ఏరో ఇంజన్లను సేకరించనున్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్) నుంచి రూ.19,519 కోట్లతో బ్రహ్మోస్ క్షిపణులు కొనుగోలు చేస్తారు. అదేవిధంగా మరో రూ.988 కోట్లతో నౌకల్లో ఉపయోగించే బ్రహ్మోస్ వ్యవస్థను కొనుగోలు చేయనున్నారు. ఇక, మిగ్-29 విమానాల కోసం ఆర్‌డీ-33 ఏరో ఇంజన్ల కొనుగోలుకు ప్రభుత్వ రంగ ఏరోస్పేస్ దిగ్గజం హెచ్ఏఎల్‌తో రక్షణశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.5,249.72 కోట్లు. అలాగే రూ.7,668.82 కోట్లతో క్లోజ్ ఇన్ వెపన్ సిస్టమ్(సీఐడబ్ల్యూఎస్), రూ.5,700 కోట్ల వ్యయంతో హైపవర్ రాడార్‌లను కొనుగోలు చేయడానికి ఎల్అండ్‌టీ సంస్థతో ఒప్పందం కుదిరిందని రక్షణ శాఖ వెల్లడించింది.

మే 1 నుంచి సమ్మె తప్పదు

పాత పింఛను కోసం డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి రైల్వే సంఘాల హెచ్చరిక

న్యూఢిల్లీ, మార్చి 1: కేంద్ర ప్రభుత్వానికి మరో తలనొప్పి తప్పదా? కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలంటూ ఇప్పటికే ఢిల్లీ శివార్లలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న దశలో రైల్వే యూనియన్లు కూడా ఆందోళన బాట పడతామని కేంద్రాన్ని హెచ్చరించాయి. కొత్త పెన్షన్ విధానాన్ని ఎత్తివేసి.. పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, లేదంటే మే నెల 1వ తేదీ నుంచి సమ్మెబాట పడతామని, ఇదే జరిగితే అన్ని రైళ్ల సేవలు నిలిచిపోయే అవకాశాలున్నాయని పలు సంఘాలు హెచ్చరించాయి. ఈ మేరకు రైల్వే శాఖకు మార్చి 19న రైల్వే సంఘాల ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు సమ్మె నోటీసు ఇవ్వనున్నారు. సమ్మె కోసం ప్రకటించిన మే నెల ఒకటో తారీఖు 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం' కావడం విశేషం. సమ్మె అనివార్యమైతే గనక దాన్ని "పాత పెన్షన్ విధాన పునరుద్ధరణ సంయుక్త సమాఖ్య (జేఎఫ్ఆర్ఓపీఎస్) అన్నీతానై నిర్వహించే అవకాశాలున్నాయి. కొత్త పెన్షన్ విధానాన్ని ఎత్తివేసి, పాత పెన్షన్ విధానాన్ని తేవాలనే డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితంగా 'ప్రత్యక్ష కార్యాచరణ'కు దిగడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. జేఎఫ్ఆర్ఓపీఎస్‌లో ఇతర విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారని, రైల్వే ఉద్యోగులతో కలిసి వారంతా సమ్మెకు కదులుతారని హెచ్చరించారు. సాధారణంగా వేసవి సెలవుల్లో చాలామంది తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విహార, ఆధ్యాత్మిక యాత్రల కోసం ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇది మే నెలలో ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ.. రైల్వే సంఘాల ప్రతిపాదిత సమ్మె మే 1 నుంచి అమలైతే గనక రైలు సేవలకు తీవ్ర విఘాతం కలిగి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇంటర్ పరీక్షలకు.. 5 నిమిషాల గ్రేస్ టైమ్

» 9.05 వరకు కేంద్రాల్లోకి అనుమతి

» ప్రకటించిన బోర్డు అధికారులు

» 4 నుంచి స్పాట్ వాల్యుయేషన్

హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష రాసేందుకు నిరాకరిస్తూ.. విమర్శలు ఎదుర్కొంటున్న ఇంటర్ బోర్డు దిద్దుబాటు చర్య చేపట్టింది. ఎగ్జామ్ సెంటర్‌లోకి వచ్చేందుకు ఐదు నిమిషాల అదనపు సమయం (గ్రేస్ టైమ్) ఇచ్చింది. ఇకమీదట ఉదయం 9.05 వరకు విద్యార్థులను అనుమతించనున్నారు. ఈ మేరకు శుక్రవారం బోర్డు అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, 'నిమిషం ఆలస్యం' నిబంధన కారణంగా

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఇంటర్ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. కాంపిటీటివ్ పరీక్షలకు ఆలస్యంగా వస్తే అనుమతి నిరాకరించడం సబబేనని.. అయితే, అకడమిక్ పరీక్ష అయిన ఇంటర్‌కూ కఠినంగా అమలు చేయడం తగదన్న విద్యావేత్తల అభిప్రాయాన్ని కథనంలో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం బోర్డు నిర్ణయం వెలువరించింది. కాగా, ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ఈ నెల 4 నుంచి ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది.

కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న ఇద్దరు లెక్చరర్ల అరెస్టు

సదాశివనగర్, హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్న కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు లెక్చరర్లను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్ష జరుగుతున్న సమయంలో కళాశాల హిందీ లెక్చరర్ ఇస్రత్, కెమిస్ట్రీ లెక్చరర్ రంజిత్ విద్యార్థులకు చిట్టీలు అందిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఆ విద్యార్థి పరీక్ష కేంద్రానికే రాలేదు

» ఇంటర్ విద్యార్థి శివ ఆత్మహత్య కేసులో ట్విస్ట్

ఆదిలాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య కేసులో మిస్టరీ వీడింది. జిల్లాలోని జైనథ్ మండలం మంగూర్ల గ్రామానికి చెందిన టేకం శివకుమార్ 'నిమిషం నిబంధన' కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు వచ్చిన వార్తలను పోలీసులు ఖండించారు. వారి వివరాల ప్రకారం.. శివకుమార్ గురువారం ఉదయం ఇంటి నుంచి ఆటోలో బయలుదేరాడు. పరీక్షకు సమయం మించి పోతోందన్న కారణంతో.. కొంత దూరం వెళ్లాక అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి బైక్‌పై ఆదిలాబాద్ చేరుకున్నాడు. అప్పటికే 9:25 కావడంతో పరీక్ష కేంద్రానికి వెళ్లినా, ఫలితం ఉండదని ఆందోళనకు గురయ్యాడు. కొద్దిసేపటికి తన గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆటోలో ఇంటికి పయనమయ్యాడు. ఆటో దిగిన తర్వాత గ్రామానికి సమీపంలో ఉన్న సాత్నాల ప్రాజెక్టు వద్దకు వెళ్లి.. తండ్రికి సూసైడ్ నోట్ రాసి ప్రాజెక్టులోకి దూకాడని పోలీసులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 9:30దాకా పరీక్ష కేంద్రం వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించామని, శివ కుమార్ పరీక్ష కేంద్రానికే రాలేదని తెలిపారు.

వైసీపీకి ఓటు వేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీకి.. తన అనుకునే వాళ్లకి మాత్రమే సాయం చేసి... మిగిలిన వారికి అన్యాయం చేసే వాళ్లకు దయ చేసి ఓటేయకండి! హత్యలు చేసేవారు మనల్ని పాలించకూడదు. మా అన్న పార్టీ వైఎస్సార్‌సీపీకి ఓటు వేయొద్దు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీలో సునీతా రెడ్డి విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య కేసులో సీఎం జగన్ పాత్రపైనా విచారణ జరగాలన్నారు. సీబీఐ దర్యాప్తు తీరుపై సందేహాలు వ్యక్తం చేశారు. "జగనన్న నోట విలువలు.. విశ్వసనీయత అనే మాటలు పదేపదే వింటుంటాం! మాట తప్పను మడమ తిప్పను.. నా అక్క, నా చెల్లెమ్మ అని పదేపదే అంటుంటారు. మా నాన్న విషయంలో ఇవన్నీ గుర్తుకు రావా? నేను ఆయన చెల్లెలినే కదా? ఈ చెల్లెలి విషయంలో ఏమయ్యాయి విలువలు? ఈ చెల్లెమ్మకిచ్చిన మాట ఏమైంది?" అని సునీత ప్రశ్నించారు. ఆయా అంశాలపై సునీతా రెడ్డి ఏమన్నారంటే...

ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడే...

మార్చి 15కి మా నాన్నను చంపేసి ఐదేళ్లయినా హంతకులెవరో ఇంకా ఎందుకు తెలియడం లేదు? దీని మూలాలు 2017లోనే ఉన్నాయి. ఆ రోజు ఎమ్మెల్సీ

జగన్ పాత్రపైనా విచారణ జరగాలి

సీబీఐ విచారణలో తేలిన నిందితుల జాబితాలో అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు. వారిని జగనన్న రక్షిస్తున్నారు. హత్యలో ప్రమేయమున్న వారిని జగన్ రక్షించడం, వారితో దగ్గరగా మెలగడం, సొంత చిన్నాన్న చనిపోతే ఐదేళ్లుగా ఏ మాత్రం పట్టించుకోకపోవడం చూస్తుంటే నాకూ సందేహం కలుగుతోంది. జగన్ పాత్రపైనా విచారణ జరగాలి. హత్య జరిగిన తర్వాత గొడ్డలితో చంపారని జగన్ చెప్పారు. ఆయన ఆ విషయాన్ని ఎలా చెప్పగలిగారు. దీనికి కూడా దర్యాప్తులో జవాబు రావాలి!



ఎన్నికల్లో వివేకానంద రెడ్డి పోటీ చేశారు. ఓడిపోయాక రెట్టింపు బలంతో జనంలోకి వెళ్లారు. ఎంత ప్రయత్నించినా ఈయన్ని అణచివేయలేక పోతున్నామని వారిలో భయం మొదలైంది. అదే హత్యకు దారి తీసింది. ఈ కేసు సీబీఐకి అప్పగించాలని మా అమ్మ పిటిషన్ వేశారు. జగనన్న కూడా కేసు సీబీఐకి ఇవ్వాలని పిటిషన్ వేశారు. దాంతో అంతా సక్రమంగానే జరుగుతోందని భావించా! ఎన్నికలు ముగిసిన తర్వాత జగనన్న సీఎం అయ్యారు. అప్పుడు ఆయన్ను కలిస్తే.. 'చిన్నాన్నను చంపిన వారిని నేను పట్టుకోకుంటే ఎవరు పట్టుకుంటారు? నేను దీనిని పరిష్కరిస్తాను. నిందితులను పట్టుకుంటాం" అని హామీ ఇచ్చారు. నేనూ నమ్మాను!

ఆ రోజే అన్న నైజం అర్థమైంది!

కొద్ది రోజుల తర్వాత వివేకా కేసు చూస్తున్న విచారణాధికారులు, పోలీసు అధికారులు మారిపోయారు. ఒక రోజు కుటుంబ సమావేశంలో సీఎంగా, నా అన్నగా సహకరించాలని, సీబీఐ విచారణ కోసం ఒత్తిడి తేవాలని జగన్‌ను అడిగాను. 'సీబీఐకి వెళ్తే అవినాశ్ బీజేపీలోకి వెళ్తాడు' అని ఆయన బదులిచ్చారు. అంతేకాదు, 'సీబీఐకి ఇస్తే నాపై 11 కేసులున్నాయి.. అలాగే ఇది 12వ కేసు అవుతుంది' అన్నారు. ఇలా సంబంధం లేకుండా సమాధానం చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఆ తర్వాత నాపైనా, నా భర్తపైనా అనుమానం వచ్చేలా మాట్లాడడం మొదలుపెట్టారు. వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలతో చాలాసార్లు మాట్లాడా. సీబీఐ దర్యాప్తు కోరతానని అన్నప్పుడు.. వైవీ, సజ్జలతో పాటు మరికొందరు వద్దని చెప్పారు. నా మనసు మార్చే ప్రయత్నం చేశారు. మరోవైపు.. అంతకుముందు సీబీఐ విచారణ కోరుతూ జగన్ వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోవడం మరింత విస్మయం కలిగించింది.

కర్నూలులో అవినాశ్ డ్రామాలు..

వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న డి.శివశంకర్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేయగానే సీన్ మొత్తం మారిపోయింది. 'నెక్స్ట్ ఎవరు?' అనే ప్రశ్న వస్తే.. ఆ తర్వాత ఉన్నది వైఎస్ భాస్కర్ రెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి. దీంతో సీబీఐ అధికారులపైనే కేసులు పెట్టడం మొదలైంది. సీబీఐ అధికారులు కడప నుంచి వెళ్లిపోయేలా చేశారు. దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని, కేసు విచారణను తెలంగాణ హైకోర్టుకు మార్చాలని సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాతే మళ్లీ దర్యాప్తు మొదలైంది. స్థానిక ఎంపీగా, బాధ్యత కలిగిన వ్యక్తిగా కేసులో తనకు తెలిసిన విషయాలను చెప్పాల్సిన ఎంపీ అవినాశ్ రెడ్డి... విచారణకు రమ్మని సీబీఐ పిలిచినా తనకు వేరే పనులున్నాయని, సమయం కావాలని కోరడమేంటి..? అవినాశ్‌కు బెయిల్ వచ్చిన తర్వాత సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. మళ్లీ దర్యాప్తు ఆగిపోయింది!

అండగా షర్మిల, ప్రజలు...

జగన్‌కు భయపడి కుటుంబంలో ఎవరూ మాకు అండగా ముందుకు రాలేదు. షర్మిల ఒక్కరే తొలినుంచీ అండగా నిలిచారు. ప్రజలూ మద్దతు తెలుపుతున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్, మహాసేన రాజేష్, సీపీఐ నేత నారాయణ, సీపీఎం నేత గఫూర్, బీజేపీ నేతలు ఆదినారాయణ రెడ్డిలతోపాటు తులసిరెడ్డి, కొలికిపూడి శ్రీనివాస్, పట్టాభి, బొండా ఉమా, వర్ల రామయ్య, జడ శ్రవణ్ వంటివారెందరో నాకు మద్దతుగా నిలిచారు. అందరికీ ధన్యవాదాలు.

'అన్న'కు సూటి ప్రశ్నలు...

"జగనన్న దుష్ట చతుష్టయం అంటుంటారు కదా! విపక్షాలకు ఏమైనా పేర్లు పట్టండి. కానీ, వివేకానంద రెడ్డిని చంపిన దుష్టులను వదిలేస్తే ఎలా? వదిలేయడం కాదు.. వారికి వత్తాసు పలికి... అండగా నిలిస్తే తప్పు కాదా? మంచికి చెడుకు యుద్ధం అని అంటున్నారు కదా! ఇక్కడ ఏది మంచి? ఏది చెడు? చంపినవాళ్లను రక్షించడం మంచిదా? రాష్ట్రంలో పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం అంటుంటారు. వివేకా కేసులో ఈ పెత్తందారులందరూ సాక్షులను ప్రభావితం చేస్తుంటే ఏం చేస్తున్నారు? కరోనా టైంలో విశాఖలో డాక్టర్ సుధాకర్ విషయంలో ఆయన కోసం ఎవరు పోరాడారు? ఒక ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేస్తే వారికి అండగా ఎవరు నిలబడ్డారు?

కాల్ లిస్ట్ విడుదల..

వివేకా హత్య రోజు తెల్లవారుజామున 1:37 నుంచి 5:18 గంటల వరకు వైఎస్ అవినాశ్ రెడ్డి, గంగిరెడ్డిల మధ్య జరిగిన కాల్ లిస్టును సునీత విడుదల చేశారు. కేసులో ఏ2గా ఉన్న సునీల్ యాదవ్‌కు అవినాశ్ రెడ్డితో సన్నిహిత సంబంధం ఉందన్నారు. తన తండ్రి హత్య జరిగిన రోజు రాత్రి 1:58 గంటలకు సునీల్ యాదవ్.. అవినాశ్ రెడ్డి ఇంట్లోనే ఉన్నట్టు గూగుల్ లొకేషన్ కూడా చూపించిందని తెలిపారు. మరో నిందితుడు గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి తన తండ్రి హత్యకు ముందు రోజు, హత్య జరిగిన రోజు ఉదయం అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఇంటికి వెళ్లాడని తెలిపారు. కేసులో ఏ5గా ఉన్న శివశంకర్ రెడ్డి కొడుకు జైలుకు వెళ్లి దస్తగిరిని కలిసి ప్రలోభ పెట్టినట్టు తెలిసిందని సునీత తెలిపారు. దర్యాప్తు అధికారి రామ్‌సింగ్ బలవంతంగా వాంగ్మూలం ఇప్పించినట్లు చెబితే రూ.20 కోట్లు ఇస్తామని దస్తగిరికి చెప్పారన్నారు. అనేక విషయాల్లో స్పష్టత రావాల్సి ఉందని...అందుకే అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని ఆమె కోరారు. వివేకా హత్య జరిగిన రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా గంగిరెడ్డితో అవినాశ్ 25సార్లు మాట్లాడారని తెలిపారు.

లాస్య నందిత కారు ఢీకొట్టిన టిప్పర్ గుర్తింపు

» కర్ణాటకలో స్వాధీనం.. పోలీసుల అదుపులో డ్రైవర్



టిప్పర్ డ్రైవర్

పటాన్‌చెరు, మార్చి 1: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాద ఘటనలో కీలకంగా భావిస్తున్న టిప్పర్‌ను పటాన్‌చెరు పోలీసులు గుర్తించారు. సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టి టిప్పర్‌ను గుర్తించి కర్ణాటకలో స్వాధీనం చేసుకున్నారు. గత నెల 23న పటాన్‌చెరు శివారులోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. తొలుత లాస్య నందిత ప్రయాణిస్తున్న కారు మరో వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టిందని, ఆ తర్వాతే ఎడమవైపు దూసుకెళ్లి రెయిలింగ్‌ను ఢీకొట్టినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. అప్పటి నుంచి సదరు వాహనం కోసం పోలీసులు జల్లెడపట్టారు. వందల సంఖ్యలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ క్రమంలో 'రాక్ శాండ్ మినరల్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సంస్థకు చెందిన టిప్పర్ (నంబర్ టీఎస్08, యూజే0025)ను లాస్య నందిత కారు వెనక నుంచి ఢీ కొట్టినట్లు గుర్తించారు. ప్రమాదం అనంతరం టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా, పారిపోయాడు. గురువారం రాత్రి కర్ణాటకలో టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌ను కర్ణాటకలో వదిలిన డ్రైవర్ హైదరాబాద్‌లో తలదాచుకోగా ఆచూకీ కనిపెట్టి అదుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు వారికి పాదాక్రాంతం!

» నాలుగు కొలువులు సాధించిన ఆరుగురు మహిళలు

» మరి కొందరికి మూడు, రెండు చొప్పున ఉద్యోగాలు

కేసముద్రం, కందుకూరు, పాపన్నపేట, బోనకల్/ ఏన్కూర్/ కరకగూడెం/ ఇల్లెందు, పెన్‌పహాడ్, మార్చి 1: ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటేనే రోజూ గంటల తరబడి కష్టపడి చదవాలి. కానీ కొందరు మాత్రం ఒకటికిపైగా ప్రభుత్వ ఉద్యోగాలు సునాయాసంగా సాధించి తమ సత్తా చాటారు. ఆరుగురు మహిళలు అయితే నాలుగేసి కొలువులు సాధించి ఔరా అనిపించుకున్నారు. వీరిలో ఇద్దరు.. పెళ్లైన తర్వాత వైవాహిక, కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడం విశేషం. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కు చెందిన గట్ల పుష్పలత, రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం నేదునూరు గ్రామానికి చెందిన సయ్యద్ అర్హా.. తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామక బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక పరీక్షల్లో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టులకు ఎంపికయ్యారు. అలాగే భద్రాద్రి కొత్తంగూడెం జిల్లా కరకగూడెం మండలం గొళ్లగూడెం అనే మారుమూల గ్రామానికి చెందిన ఆదివాసీ యువతి మలకం రమాదేవి.. జూనియర్ లెక్చరర్, టీజీటీ(ఇంగ్లిష), టీజీటీ(గణితం), పీజీటీ(ఇంగ్లిష) నౌకరీలు, ఇలెందు పట్టణానికి చెందిన వీరయోధుల భవాని.. పీజీటీ(బయోలజీ), టీజీటీ(సైన్స్), టీజీటీ(బయోసైన్స్), జేఎల్(బోటనీ) ఉద్యోగాలు సాధించారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం యర్రంశెట్టిగూడెం గ్రామానికి చెందిన రాజుల సరిత.. గురుకుల టీజీటీ(తెలుగు), జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులతో పాటు పీజీటీ ఉద్యోగం దక్కించుకుంది. అయితే యర్రంశెట్టిగూడెంలో సుమారు 60 ఇళ్లు ఉండగా, ప్రతి ఇంట్లోనూ ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉండడం గమనార్హం. ఇక మెదక్ జిల్లా పాపన్నపేట మండలం అన్నారం గ్రామానికి చెందిన బంజ సౌమ్య.. గతేడాది నిర్వహించిన గురుకుల నియామక పరీక్షల్లో టీజీటీ, పీజీటీ ఉద్యోగాలు సాధించడంతో పాటు నాలుగు నెలల క్రితం విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో అర్హత సాధించారు. తాజాగా జూనియర్ లెక్చరర్ (గణితం) పోస్టుకు సౌమ్య ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం జానకీపురం గ్రామానికి చెందిన చిలకా పుష్పలత గురుకుల పరీక్షల్లో పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు.. గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు సాయిరాం.. పీజీటీతో పాటు జేఎల్ ఉద్యోగం సాధించారు. అలాగే ఏన్కూరుకు చెందిన బట్టు రూతుమేరి.. పీసీటీ(ఇంగ్లిష), టీజీటీ (బయోసైన్స్), టీజీటీ(ఇంగ్లిష) ఉద్యోగాలు.. భగవాన్‌నాయక్‌తండాకు చెందిన బానోతు స్పందన.. గురుకుల పీజీటీ, జూనియర్, డిగ్రీ లెక్చరర్ కొలువులు సాధించారు.

మోదీ, జగన్ చేతిలో ఏపీ హత్య

జగనన్న గల్లీలోనే పులి, ఢిల్లీలో పిల్లి.. ప్రత్యేక హోదా, రాజధాని, డీఎస్సీ అంతా దగా

» తిరుపతి సభలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

తిరుపతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): "జగనన్న మూడు రాజధానుల నాటకాలాడారు. ఒక్క రాజధానినైనా అభివృద్ధి చేశాడా? మనకు సిగ్గుచేటు కాదా? పక్క రాష్ట్రాలన్నీ వేగంగా అభివృద్ధి పథంలో నడుస్తుంటే మనం వెనుకబడిపోతున్నాం. దక్షిణాదిన మెట్రోలేని ఏకైక రాష్ట్రం మనదే. తల్లిలాంటి ఏపీని ప్రధాని మోదీ, జగన్ హత్య చేశారు. ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక హోదా రావడంతో 2 వేలు, హిమాచల ప్రదేశ్‌లో 10 వేల పరిశ్రమలు వచ్చాయి. ఏపీకి పట్టుమని పది పరిశ్రమలు కూడా రాలేదు" అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శుక్రవారం కాంగ్రెస్ బహిరంగ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్, కాంగ్రెస్ ప్రముఖులతో కలిసి ఆమె పాల్గొన్నారు. పదేళ్ల పాటు ప్రత్యేక హోదా డిక్లరేషన్‌ను ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం ఏపీకి ప్రత్యేక హోదాపై తీర్మానం చేసిందని..



వైసీపీ, టీడీపీ అధినేతలు రాష్ట్రాన్ని నాశనం చేయడానికే ఉన్నారని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు హోదా కోసం మూకుమ్మడి రాజీనామాలు చేస్తానన్న జగన్.. సీఎం అయ్యాక మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఢిల్లీలో పంజా విప్పుతామన్నారు.. ఏమైంది? అని ప్రశ్నించారు. ఏపీలో జగనన్న పులి, ఢిల్లీకి వెళితే పిల్లిగా మారిపోతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ గెలిస్తే రాజన్న సంక్షేమ పాలనలో రైతు రాజు అవుతాడని.. 'ఇందిరమ్మ అభయహస్తం' పేరిట ప్రతి పేద ఇంటికీ నెలకు రూ.5 వేలు మహిళ అకౌంట్‌లోకి వచ్చేలా చేస్తామని తెలిపారు. ఎన్నికల ముందు జగన్ దగా డీఎస్సీని విడుదల చేశారని ధ్వజమెత్తారు. మద్య నిషేధం అని చెప్పి ప్రభుత్వమే మద్యం అమ్ముతోందని. మండిపడ్డారు.

మోదీ అంటేనే మోసం

2014 ఎన్నికల సభలో ఇదే వేదికగా పదేళ్ల పాటు హోదా ఇస్తామంటూ మోదీ వాగ్దానం చేశారని షర్మిల గుర్తు చేశారు. రామభక్తుడినని చెప్పుకొనే ఆయన మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారని.. మోదీ అంటేనే మోసం అని షర్మిల ధ్వజమెత్తారు. సంపన్నుల కోసమే బీజేపీ పనిచేస్తోందని పైలట్ విమర్శించారు. ప్రతిపక్షాలపై ఈడీ, సీబీఐలను కేంద్రం ఉసిగొలుపుతోందన్నారు. వైఎస్ బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్ ఆయన ఫొటోనే దూరం చేశాడని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక కేసు నుంచి బయటపడేందుకు 12మందిని హత్య చేయించారని ఆరోపించారు. ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరి బయట పడేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీలో చేరిన బీబీ పాటిల్

» బీఆర్ఎస్‌కు షాకిచ్చిన జహీరాబాద్ ఎంపీ

» నియోజకవర్గ అభివృద్ధి కోసమే బీజేపీలోకి: పాటిల్

» బాప్, బేటా, బేటీ పార్టీగా బీఆర్ఎస్: తరుణ్ ఛుగ్

న్యూఢిల్లీ, సంగారెడ్డి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్ఎస్‌కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సన్నిహితుల్లో ఒకరైన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పి బీజేపీలో చేరారు. న్యూఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ కె.లక్ష్మణ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరానని ఎంపీ బీబీ పాటిల్ ఈ సందర్భంగా తెలిపారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి జరిగినప్పటికీ మోదీ నాయకత్వంలో మరింత ప్రగతి ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం, తరుణ్ ఛుగ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న పడవ అన్నారు. బీఆర్ఎస్ ఇప్పుడు బాప్, బేటా, బేటీ(బీబీబీ).. కుటుంబ పార్టీగా మారిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ బయటికి కత్తులు దూసుకుంటున్నా అంతర్గతంగా కలిసి పనిచేస్తున్నాయని ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో ఇరు పార్టీలు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. కేసీఆర్ అవినీతిపై దర్యాప్తును సీబీఐకి అప్పగించకుండా కాంగ్రెస్ కాలయాపన చేస్తోందన్నారు. లోక్‌సభ అభ్యర్థుల జాబితాపై కసరత్తు జరుగుతోందని, వారం రోజుల తర్వాత ప్రకటన ఉంటుందన్నారు.

బీఆర్ఎస్ టికెట్ వద్దనుకుని..?

2014 ఎన్నికలలో తొలిసారి బీఆర్ఎస్ టికెట్‌పై జహీరాబాద్ ఎంపీ.గా గెలుపొందిన పాటిల్ 2019 ఎన్నికల్లోనూ ఆ పార్టీ గుర్తుపైన విజయం



ఢిల్లీలో బీజేపీలో చేరిన జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

సాధించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కూడా జహీరాబాద్ టికెట్‌ను సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్‌కే ఇవ్వాలనే బీఆర్ఎస్ ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ టికెట్ దక్కే అవకాశాలున్నా, ఆ పార్టీ తరఫున ఈ సారి గెలవలేమన్న భావనతో పాటిల్ 'కారు' దిగేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగింటిలో కాంగ్రెస్ గెలవడంతోనే పాటిల్ ఈ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. కానీ, జహీరాబాద్ బీజేపీ టికెట్ పాటిల్‌కు దక్కడంపై అనేక సందేహాలున్నాయి. అయితే, జహీరాబాద్‌తోపాటు బీదర్, నాందేడ్ నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేసేందుకు తాను సిద్ధమని బీజేపీ అగ్రనేతలతో పాటిల్ చెప్పినట్టు సమాచారం.

సినీ నిర్మాతకు జహీరాబాద్ టికెట్?

జహీరాబాద్ పార్లమెంట్ టికెట్‌ను ఓ బడా సినీ నిర్మాతకు ఇవ్వాలని బీజేపీ నాయకత్వం నిర్ణయించినట్టు తెలిసింది. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన ఆ సినీ నిర్మాతతో బీజేపీ ముఖ్యనేతలు ఇప్పటికే చర్చించినట్టు సమాచారం. కేంద్ర మాజీ మంత్రి ఎ.నరేంద్ర కుమారుడు ఆలే భాస్కర్, బీజేపీ నాయకులు ఎం.జైపాల్‌రెడ్డి, పైడి ఎల్లారెడ్డి, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి తదితరులు జహీరాబాద్ టికెట్ ఆశిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గాజాలో ఘోరం!

గాజాలో ఇంతకంటే పెద్దపెద్ద ఘోరాలే జరిగాయి కానీ, ఆకలితో ఉన్నవారిని కాల్చిపారేసిన ఆ ఘటనమీద ఓ మాటన్నా అనక పోతే అంతబాగోదని కాబోలు, అగ్రదేశాలు గట్టిగానే ఖండిస్తున్నాయి. ఈజిప్ట్‌నుంచి రఫా సరిహద్దుమీదుగా రొట్టెలపిండిని తీసుకొచ్చిన వాహనాలను వేలాదిమంది చుట్టుముట్టిన దృశ్యాలు మీడియాలో చూస్తున్నాం. ఆకలితో ఉన్నారు కనుక, కలుపుమొక్కల్ని తినిబతుకు తున్నారు కనుక, ఆ ట్రక్కులు రాగానే వాటివెంట పరుగులుతీశారు, వాటికిందపడి మరణించారు, పరస్పరం కలయబడ్డారు. అన్నం కోసం జరిగిన ఆ తొక్కిసలాటలో గాయపడినవారు, ప్రాణాలు కోల్పోయిన వారు పోను మిగతావారిమీద ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపారు. వాతావరణం తమకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నదని గ్రహించి ఇజ్రాయెల్ సైనికులు ఈ పనిచేశారట. అధికారికలెక్కలకేమి కానీ, విచక్షణారహితంగా జరిగిన ఈ కాల్పుల్లో మరణాలు వంద దాటాయి, వెయ్యిమందికిపైనే తీవ్రంగా గాయపడ్డారు.

మానవత్వం మీద దాడి, నేరం, ఘోరం అంటూ ఖండించడానికి ప్రపంచాధినేతలకు చాలా పడికట్టు పదాలు అమ్ములపొదిలో సిద్ధంగా ఉంటాయి. ఐక్యరాజ్యసమితి పెద్దాయన ఎప్పటిలాగానే ఆవేదన వెలిబుచ్చారు. అన్యాయం, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు అంటూ ఇటలీ, స్పెయిన్ దేశాధినేతలు కాల్పులవిరమణ గురించి ఓ మాటన్నా అన్నందుకు సంతోషించాలి. ఈ ఖండనమండనలను అటుంచితే, దక్షిణాఫ్రికా ప్రకటన ఒకింత భిన్నంగా ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఈ దారుణమైన చర్యతో ఇజ్రాయెల్ పూర్తిగా ఉల్లంఘించిందని అది వ్యాఖ్యానించింది. ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదంటూ ఐసీజెలో దక్షిణాఫ్రికా కేసు వేసినప్పుడు, మానవతాసాయాన్ని అనుమతించడం, తన సైనికుల దమనకాండను నియంత్రించడం ఇత్యాది అంశాల్లో ఐసీజే తన మధ్యంతర తీర్పులో భాగంగా కొన్ని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వాటి అమలు తీరుతెన్నులను తనకు నివేదించాలని కూడా ఆదేశించింది. ఈ ఘటన ఇజ్రాయెల్ వైఖరిలో రవ్వంతైనా మార్పు రాలేదనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించిన దక్షిణాఫ్రికా ఈ ఘోరాన్ని ఐసీజే దృష్టికి తీసుకుపోవడానికి సిద్ధపడుతోంది.

ఈ దారుణాన్ని ఖండించడానికి అమెరికా అధ్యక్షుడికి మనసు రాలేదు. రెండు భిన్నమైన వాదనలు ఉన్నందున నిజం తెలియకుండా ఏం మాట్లాడాలని అమెరికా అడుగుతోంది. అసలు అక్కడ ఏం జరిగిందో వెంటనే ఓ నివేదిక ఇవ్వండి అని హంతకులనే అమెరికా అడిగింది. ఈ ఘటన అత్యంత సున్నితమైన కాల్పుల విరమణ చర్చలను మరింత సంక్లిష్టం చేస్తుందని వ్యాఖ్యానించింది. గాజాపూర్తిగా నేలమట్టమైనా, పాతికవేలమందిని ఇజ్రాయెల్ ఊచకోతకోసినా, వేలాదిమంది అన్నం, నీరు, మందులు లేక అల్లాడిపోతున్నా నిమ్మకునీరెత్తినట్టు ఊరుకున్న అమెరికా ఇప్పుడు ఓ వందమంది మరణించినంత మాత్రాన చలించిపోదు. ఈ ఘటనను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేయాలని గురువారం భద్రతామండలి సమావేశంలో ప్రయత్నం జరిగింది. ఇజ్రాయెల్‌ను ఎలా తప్పుబతారంటూ అమెరికా ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టింది. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అందించే విషయంలో కానీ, అంతర్జాతీయ వేదికలమీద అండగా ఉండటంలోనూ అమెరికా వైఖరిలో ఏ మార్పూ ఉండబోదని దీని అర్థం. ఎటువంటి ఆంక్షలూ నియంత్రణలూ లేని ఆయుధ, ఆర్థిక ప్రవాహంతోనే ఇజ్రాయెల్‌ను ఈ కష్టకాలంలో ఆదుకోగలమని అమెరికా అధ్యక్షుడు నమ్ముతున్నారు. మరింత మానవతా సాయం విషయంలో ఇప్పటికే ఇజ్రాయెల్–హమాస్ మధ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడితే, ఈ ఘటన తరువాత బందీల అప్పగింతకు సంబంధించి ఆయా పక్షాలతో జరుపుతున్న చర్చలను హమాస్ పూర్తిగా ఆపివేసిందని కూడా వార్తలు వస్తున్నాయి. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఈజిప్ట్, ఖతార్ ఇప్పుడు మరింత ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. నలభైరోజుల పాటు ఇరుపక్షాలూ మధ్యా కాల్పులు నిలిచిపోయి, ఆకలితో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్తంత సాయం అందుతున్న ఆశలు ఇప్పుడు అడుగంటిపోతున్నాయి. నెలకుపైగా యుద్ధం ఆగితే ఆహారం అందుతుంది, ఆస్పత్రులు కాస్తంత పనిచేస్తాయి, నిలువనీడకోల్పోయిన వేలాదిమందికి తాత్కాలికంగానైనా ఆశ్రయం కల్పించే ప్రయత్నాలూ జరుగుతాయి. బందీల అప్పగింత వ్యవహారం కొలిక్కివస్తే కాల్పుల విరమణను నిరవధికంగా కొనసాగించే అవకాశాలూ ఉంటాయి. కానీ, అన్నార్తులమీద జరిపిన ఈ భయానకమైన దాడితో ఇజ్రాయెల్ మొత్తం వ్యవహారాన్ని మొదటకు తెచ్చింది.

విప్లవోద్యమంలో కొత్త కెరటం

విప్లవోద్యమ గమనంలో ఒక ముందడుగు. మూడు విప్లవ పార్టీలు కలసి ఒక పార్టీగా ఆవిర్భవిస్తున్నాయి. సిద్ధాంత, రాద్ధాంత దారుల్లో ఎన్నో సంస్థలు ఉన్నా విప్లవోద్యమం మాటకు, చేతకు పొంతన లేక అనేక మంది ఎంతో తండ్లాట పడుతున్నారు. బలమైన విప్లవోద్యమం, ఆచరణాయుత మార్గదర్శకత్వంలో బలమైన పార్టీ కావాలని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా, భాస్కర్ నంది, సంతోష్ రాణా నేతృత్వాన కొనసాగి అస్సాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలో పనిచేస్తున్న పీసీసీ సీపీఐ (ఎం.ఎల్), అలానే 12 రాష్ట్రాలలో కార్మిక, రైతు ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం.ఎల్.) రెవెల్యూషనరీ ఇన్షియేటివ్ అనే మూడు విప్లవ సంస్థలు కలసి ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించుకున్నాయి. ఈ సంస్థలు కలసి ఏర్పడే పార్టీని సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ అని పిలవాలని నిర్ణయించాయి.

ఈ మూడు పార్టీల ఐక్యతా కార్యక్రమం, యూనిటీ కాన్ఫరెన్స్ 2024 మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో జరుగుతున్నాయి. మార్చి మూడున సాయంకాలం 3 గంటలకు ఎస్.ఆర్. అండ్ బి.జి.ఎన్.ఆర్. కళాశాల నుంచి పెవిలియన్ గ్రౌండ్ దాకా వేలాది మందితో భారీ ప్రదర్శన గ్రేట్ మార్చ్ నిర్వహించనున్నాయి. సాయంకాలం 6 గంటలకు అమరులు రవన్న, సంతోష్ రాణా నగర్ పెవిలియన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుంది. అలానే మార్చి 4, 5 తేదీలలో ఎంపిక చేయబడ్డ 300 మంది ప్రతినిధులతో ఆలిండియా యూనిటీ కాన్ఫరెన్స్ డి.వి.కె, భాస్కర్ నందినగర్ (భక్త రామదాసు కళ్యాణ మండపం)లో జరుగుతుంది. ఈ కాన్ఫరెన్స్‌లో విప్లవ కార్యక్రమం, నిబంధనావళి, రాజకీయ తీర్మానం, కేంద్ర కమిటీ ఎన్నిక, ఇతర తీర్మానాలు ఎజెండాగా ఉంటాయి. ఈ కాన్ఫరెన్స్‌కు జర్మనీ ఎం.ఎల్.పి.డి. పార్టీ నాయకులు, నేపాల్ సీపీఐ(ఎం.ఎల్) మషాల్ ప్రతినిధి, శ్రీలంక పార్టీ ప్రతినిధులు సౌహార్ద అతిథులుగా పాల్గొంటారు. మన దేశంలోని సోదర ఎం.ఎల్. పార్టీల ప్రతినిధులు కొందరు సౌహార్ద ప్రతినిధులుగా హాజరవుతున్నారు.



ఫాసిస్టు ప్రమాద బరిలో ఉన్న భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలసికట్టుగా ఫాసిజాన్ని ఎదుర్కోవడం నేటి జరూరు కర్తవ్యమని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ భావిస్తున్నది. చీకట్లో చిరుదీపం లాగా మూడు పార్టీలు ఐక్యం కావడం శుభపరిణామం. ఇది దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులందరూ ఒకటి కావడానికి తోడ్పడాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ ఈ డిసెంబర్ నాటికి ఏర్పడి వందేళ్ళు పూర్తవుతున్నది. రివిజనిజంను ధిక్కరిస్తూ 1969లో సీపీఐ(ఎం.ఎల్) ఏర్పడి 55 ఏళ్లు పూర్తయ్యింది. కానీ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నత దశ నుంచి బలహీన దశలోకి మారింది. ప్రభావశీలత తగ్గిపోయింది. మొత్తం కమ్యూనిస్టు విప్లవోద్యమం దిశా, దశను ఎంచుకోవడంలోనే పొరపాట్లకు లోనయ్యింది. మితవాదానికి కొట్టుకుపోవడమో, దాని మీద కోపంతో అతివాదానికి పరుగు తీయడమో చేసింది. ఫలితంగా తగిన సమయంలో సరైన ఎత్తుగడలు అనుసరించక వైఫల్యాలు, నష్టాలు ఎదుర్కొన్నది. ఆదివాసీలు, దళితులు, పేదలు తదితర అణచివేయబడ్డ వర్గాల పునాదిలో పని చేసినా, ఆ ఉద్యమంలో మమేకమయి ఎన్ని త్యాగాలు చేసినా, కుట్ర కేసులు, కష్టాలు అనుభవించినా – తగిన ఫలితం అంటే బలమైన విప్లవోద్యమ నిర్మాణం జరగలేదు. ఈ వైఫల్యాలను సరిగ్గా, సక్రమంగా సమీక్షించుకోలేదు. సిద్ధాంత వైఖరుల్లో ఖచ్చితత్వం, ఆత్మవిమర్శ లోపించి, పెటీ బూర్జువా అహంభావం ప్రధానంగా పనిచేసి భారత కమ్యూనిస్టుల్లో అంతులేని చీలికలు, పేలికలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల్లో కొందరికి ప్రజా ఉద్యమం కంటే తుపాకి మీద ప్రేమ, నరోద్నిజం మీద మక్కువ ఏర్పడ్డాయి. ఆ ఆలోచన, ఆచరణ అనేక మంది లంపెన్ శక్తులకు కొంత ఆసరాగా కూడా మారింది. విప్లవం పేరిట అరాచకవాదం, లంపెనిజం కొనసాగుతున్నది.

వీర తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం, కరీంనగర్, గోదావరి లోయ పోరాటాలను విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించింది. వేల మంది మట్టి మనుషులు ఆ పోరాటాల్లో మిలిటెంట్‌గా పాల్గొన్నారు. భూములు పంచుకున్నారు. వెట్టిచాకిరీ రద్దు చేశారు. భూస్వామ్య పీడన నడ్డి విరిచారు. వేతనాలు పెంచుకున్నారు. అలా ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర ఆనవాళ్ళు ఉన్నాయి. ఎన్నో వందల మంది ప్రాణ త్యాగాలు చేసి ఎర్రజెండాను ఔన్నత్యంగా నిలిపారు. లక్షలాది మంది నిర్బంధాలను అధిగమించి ఉద్యమంలో నిలబడ్డారు. అయితే, ఈ ఉద్యమాల గాఢత, తీవ్రత కొంత ఉన్నా వాటి ప్రభావశీలత నేడు పరిమితంగా ఉన్నది. కమ్యూనిస్టు ఉద్యమంలోని చీలికలు, సరైన సిద్ధాంత రూపకల్పన జరగకపోవడం, ప్రపంచీకరణ, పెట్టుబడి విశృంఖలతను అర్థం చేసుకుని తగిన రంగాల మీద కేంద్రీకరించకపోవడంతో, మారుమూల అడవులే కార్యక్షేత్రంగా పరిమితమయిన దానిగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది.

సీపీఐ(ఎం.ఎల్.) మాస్‌లైన్ భారతీయ విప్లవపంథాను, భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించాలని యత్నం చేస్తున్నది. చైనా తరహా పోరాటం మన దేశంలో చేయాలని ప్రయత్నించి కమ్యూనిస్టు ఉద్యమం నష్టపోయిందని భావించారు. నాటి చైనా సమాజానికి, నేటి భారతీయ సమాజానికి పొంతన లేదని భావించింది. భారతదేశం అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశమని, భారత వ్యవసాయ రంగం పూర్తి స్థాయిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉన్నదని విశ్లేషించింది. భారతదేశంలో పాలకవర్గం గుత్తపెట్టుబడిదారీ వర్గమని, బడా భూస్వామ్య వర్గం వారిలో భాగమని భావిస్తున్నది. భారత పెట్టుబడిదారీ వర్గం సామ్రాజ్యవాద అంతర్జాతీయ దోపిడీకి జూనియర్ భాగస్వామిగా ఉన్నదని భావిస్తున్నది. భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం పొందినా, ఆర్థికంగా సామ్రాజ్యవాదంపై ఆధారపడుతున్నదని భావించింది. బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థ తన పట్టును నిలుపుకోవడానికి, పార్లమెంటరిజంను, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంగా మార్చి దిగజార్చుతున్నదని భావిస్తున్నది. భారతదేశంలో 40 కోట్ల మంది కార్మికవర్గం, 12 కోట్ల రైతాంగం మీద ప్రధాన ఉద్యమ కేంద్రీకరణ ఉండాలని భావిస్తున్నది.

అలాగే నేడు భారతదేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశాన్ని ఫాసిస్టు మత రాజ్యంగా మార్చాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని విశ్లేషిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ ప్రజాస్వామిక దృక్పథాల ప్రభావం నుంచి ఏర్పడ్డ భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, పరిమిత ప్రజాస్వామిక స్వాతంత్ర్యాలను సైతం కాలరాచే యత్నం చేస్తున్నదని భావిస్తున్నది. ఫాసిస్టు ప్రమాద బరిలో ఉన్న భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలసికట్టుగా ఫాసిజాన్ని ఎదుర్కోవడం నేటి జరూరు కర్తవ్యమని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ భావిస్తున్నది. చీకట్లో చిరుదీపం లాగా మూడు పార్టీలు ఐక్యం కావడం శుభపరిణామం. ఇది దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులందరూ ఒకటి కావడానికి తోడ్పడాలి.

▪ పోటు రంగారావు

(రేపటి నుంచి ఖమ్మంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ ఐక్యతా మహాసభలు)

మోదీ సర్కార్ మిథ్యా వాదం!



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

గుడ్ మార్నింగ్. ఉదయం మీరు కళ్లు తెరిచిన వెంటనే ఎదురుగా ఉన్న దినపత్రికలో పతాక శీర్షిక ఏమి చెప్పుతుందో గమనించారా? 'అన్నార్తులు ఇంకెవ్వరూ లేరు. పేదరికాన్ని భారత్ నిర్మూలించింది' అనే కాదూ? ఆహా! అదొక వాస్తవంగా మీరు విశ్వసించాలని నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) ప్రగాఢంగా అభిలషిస్తోంది. ప్రణాళికా సంఘం లాంటి గౌరవార్హమైన సంస్థనొకదాన్ని, పాలకుల అభిమానాన్ని సంపాదించుకోవడానికి ఆరాటపడే ప్రభుత్వ అధికారిక ప్రతినిధి స్థాయికి తగ్గించి వేశారు. పలు అభివృద్ధి సూచికలలో చాలా దిగువ స్థాయిలో ఉన్న వారి సంఖ్య దేశ జనాభాలో 11.28 శాతమని తొలుత నీతి ఆయోగ్ ప్రకటించింది. ఇప్పుడు ఆ సంస్థ సీఈఓ స్వయంగా భారత్‌లో పేదలు దేశ జనాభాలో 5 శాతానికి మించిలేరని ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఆయన ఈ 'సత్యాన్ని' కనుగొన్నారు? జాతీయ నమూనా సర్వే కార్యాలయం ప్రచురించిన 'కుటుంబ వినియోగ వ్యయం సర్వే' (హెచ్‌సిఇఎస్) నివేదిక ఆధారంగా అని ఆయన ఈ మహాసత్యాన్ని కనుగొన్నారు మరి. హెచ్‌సిఇఎస్ నివేదిక కొన్ని విస్మయకరమైన వాస్తవాలను వెల్లడించింది. అయితే భారత్‌లో పేదల సంఖ్య దేశ జనాభాలో 5 శాతానికి మించి లేదన్న నిర్ణయానికి ఆ వాస్తవాలు ఏ విధంగానూ దారి తీయలేదు.

'కుటుంబ వినియోగ వ్యయం సర్వే'ను ఆగస్టు 2022, జూలై 2023 మధ్య నిర్వహించారు. 8,723 గ్రామాలు, 6,115 పట్టణాలలోను మొత్తం 2,61,745 కుటుంబాల (గ్రామీణ ప్రాంతాలలో 60 శాతం, పట్టణ ప్రాంతాలలో 40 శాతం)ను పరిగణనలోకి తీసుకుని ఈ సర్వేను నిర్వహించారు. నమూనా సముచిత రీతిలో ప్రాతినిధ్యం వహించిందిగాను, సర్వే పద్ధతి గణాంక బద్ధంగా సక్రమంగా ఉందని భావిద్దాం. సర్వే లక్ష్యమేమిటి? ప్రస్తుత/ నామమాత్ర ధరలలో నెలవారీ తలసరి వ్యయం (ఎమ్‌పిసిఇ)ని గణించడం. సగటున ఒక వ్యక్తి నెలవారీ వ్యయం ఈ విధంగా ఉన్నది: ఎగువ 5 శాతం మందిలో గ్రామీణ ప్రాంతంలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.10,501; పట్టణాలలో రూ. 20,824; మధ్య స్థాయి ఆదాయ కుటుంబాలలో గ్రామీణ వ్యక్తుల నెలవారీ వ్యయం 3,773 కాగా పట్టణ ప్రాంతీయులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.6,459; దిగువ స్థాయి ప్రజలలో గ్రామీణులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.1,373 కాగా పట్టణ ప్రాంతీయులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.2,001. మధ్యస్థాయి వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ. 4,963. మొత్తం దేశ జనాభాలో 50 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ.4,963. మరి మిగతా 50 శాతం మంది విషయమేమిటి? ఆ నివేదిక ఇలా పేర్కొంది: మొదటి 0–5 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,373 కాగా, పట్టణ ప్రాంతాల్లో రూ.2,001, 5 నుంచి 10 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామాల్లో రూ.1,782 కాగా పట్టణాలలో రూ.2,607; 10 నుంచి 20 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామాల్లో రూ.2,112 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ.3,157.

సరే, దిగువన ఉన్న 20 శాతం మంది వద్ద ఆగుదాం. గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తి తన ఆహారానికి, ఆహారేతర అవసరాలకు నెలవారీగా చేసే వ్యయం రూ.2,112 లేదా దినసరిన రూ.70 అయితే ఆ వ్యక్తి పేదవాడు కాదని నీతి ఆయోగ్ అభిప్రాయపడుతున్నదా? అలాగే పట్టణాలలో ఒక వ్యక్తి తన ఆహారానికి, ఆహారేతర అవసరాలకు నెలవారీగా చేసే వ్యయం రూ.3,157 లేదా దినసరిన రూ.100 అయితే ఆ వ్యక్తి పేదవాడు కాదని నీతి ఆయోగ్ అభిప్రాయపడుతున్నదా? ప్రభుత్వానికి నేను ఒక సూచన చేయదలుచుకున్నాను: నీతి ఆయోగ్ అధికారులకు రూ.2,100 ఇచ్చి ఒక నెలరోజుల పాటు గ్రామీణ ప్రాంతంలో నివసించి, తమ జీవితం ఎంత భాగ్యవంతంగా గడిచిందో నివేదిక ఇవ్వమనండి.

సర్వేలో పరిగణనలోకి తీసుకున్న కుటుంబాలలో వ్యక్తుల వినియోగంలో ఆహార వ్యయాల వాటా గ్రామీణ ప్రాంతాల్లో 46 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 39 శాతానికి తగ్గిపోయిందని హెచ్‌సిఇఎస్ వెల్లడించింది. ఇది బహుశా నిజమే అయివుండవచ్చు. పెరిగిన ఆదాయం/ వ్యయం, ఆహార వినియోగం విలువ ఒకే విధంగా ఉండడం లేదా స్వల్పస్థాయిలో మాత్రమే పెరుగుతున్న కారణంగా హెచ్‌సిఇఎస్ వెల్లడించింది నిజమే అని విశ్వసించవచ్చు.

ఇతరత్రా లభిస్తున్న సమాచారం కూడా చాలా కాలంగా గమనంలోకి వస్తున్న వాస్తవాలను ధ్రువీకరిస్తున్నది. మన సామాజిక వర్గాలలో ఎస్సీలు, ఎస్టీలు మరెవ్వరి కంటే కూడా నిరుపేదలు. విడివిడిగా వారి వ్యయాలు దేశ సగటు కంటే కూడా తక్కువ. ఓబీసీలు సగటుకు సమీపంలో ఉంటారు. 'సగటు'కు ఎగువున ఉన్న వారు 'ఇతరులే' అన్నది స్పష్టం. రాష్ట్రాల వారీ సమాచారం కూడా ఈ గమనార్హ వాస్తవాలను ధ్రువీకరిస్తున్నది. నిరుపేద భారతీయులు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయలో ఉన్నారు. వీరి ఎమ్‌పిసిఇ అఖిల భారత స్థాయిలో గ్రామీణ ప్రాంతాల సగటు ఎమ్‌పిసిఇ కంటే దిగువ స్థాయిలో ఉన్నది. పట్టణ ప్రాంతాల ఎమ్‌పిసిఇని పరిగణనలోకి తీసుకున్నా గ్రామీణ ప్రాంతాల పరిస్థితి కంటే పెద్దగా భిన్నంగా లేదని స్పష్టమవుతుంది. నిరుపేదలు ఉన్న రాష్ట్రాలు చాలా కాలంగా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీల పాలనలో ఉన్నవి కావడం గమనార్హం. 1995 నుంచి బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్‌లో సైతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఎమ్‌పిసిఇ అఖిల భారత గ్రామీణ, పట్టణ సగటు ఎమ్‌పిసిఇ కంటే పెద్దగా మెరుగ్గా లేదు. ఇదొక ఆశ్చర్యకరమైన వాస్తవం.



భారతదేశ జనాభాలో పేదలు 5 శాతానికి మించి లేరని నీతి ఆయోగ్ ప్రకటించింది. దీని సూచితార్థం పేదలుగా పరిగణించదగ్గవారు ఎవరూ లేరని అనేవారు లేకుండా పోతున్నారని, భారతీయులు అందరూ సంపద్వంతులు అవుతున్నారనే కాదూ? ఇది నిజమే అయితే ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 80 కోట్ల మందికి నెలకు ఒక్కో వ్యక్తికి 5 కిలోలు చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఎందుకు పంపిణీ చేస్తోంది? పేదలు 5 శాతానికి మించి లేకపోతే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 వెల్లడించిన వాస్తవాల విషయమేమిటి?

భారతదేశ జనాభాలో పేదలు 5 శాతానికి మించి లేరన్న నీతి ఆయోగ్ వాదన నన్ను బాగా చికాకు పెడుతున్నది. ఆగ్రహం కలిగిస్తోంది. ఈ వాదన సూచితార్థమేమిటి? పేదలుగా పరిగణించదగ్గవారు ఎవరూ లేరని, పేదలు అనేవారు లేకుండా పోతున్నారని, భారతీయులు అందరూ సంపద్వంతులు అవుతున్నారనే కాదూ? ఇది నిజమే అయితే ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 80 కోట్ల మందికి నెలకు ఒక్కో వ్యక్తికి 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఎందుకు పంపిణీ చేస్తోంది? పేదలు 5 శాతానికి మించి లేకపోతే జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే–5 ఈ క్రింది వాస్తవాలు ఎలా వెల్లడి అయ్యాయి : 6 నుంచి 59 నెలల వయసులో ఉన్న బాలల్లో 67.1 శాతం మంది ఎందుకు రక్త హీనతతో బాధపడుతున్నారు? అలాగే 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళల్లో 57 శాతం మంది రక్త హీనతతో ఎందుకు బాధడుతున్నారు? ఐదేళ్ల లోపు బాలల్లో 35.5 శాతం మంది ఎందుకు అనారోగ్యంతో బలహీనపడిపోతున్నారు? అలాగే ఐదేళ్ల వయసులోపు బాలల్లో 19.5 శాతం మంది పెరుగుదల ఎందుకు గిడసబారిపోతోంది?

ఢిల్లీ వీధుల్లో ఎంతో మంది బాలలు అడుక్కోవడం నీతి ఆయోగ్‌కు కనిపించడం లేదా? పేవ్‌మెంట్‌లపైన, వంతెనల కింద వేలాది వ్యక్తులు నిద్రపోతున్న దృశ్యాలు నీతి ఆయోగ్ అధికారుల గమనంలోకి రావడం లేదా? గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం 15.4 శాతం మంది ఎందుకు తమ పేర్లను నమోదు చేయించుకున్నారు? ఉజ్వల లబ్ధిదారులు ఏడాదికి సగటున కేవలం 3.7 సిలిండర్లను మాత్రమే ఎందుకు కొనుగోలు చేస్తున్నారు?

సంపన్నుల ప్రయోజనాలను మాత్రమే నెరవేర్చదలుచుకుంటే నీతి ఆయోగ్ ఆ పనిని నిరభ్యంతరంగా చేయవచ్చు. అయితే పేదలను పరిహసించవద్దు. పేదరికాన్ని నిర్మూలించడంలో ప్రభుత్వం సఫలం కాకపోవచ్చు. అయితే తనకళ్ల ముందునుంచి పేదలను పూర్తిగా తొలగించడానికి మహారాజశ్రీ ప్రభుత్వం చాల కష్టపడుతోంది. పేదల విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ మిథ్యా వాదనలను చూసిన తరువాత నేను అనువాదంలో చదివినవే అయినప్పటికీ ఒక మహాకవి మాటలను ఉటంకించకుండా ఉండలేను. ఆయన తన 'మిథ్యావాది' కవితలో ఇలా ప్రశ్నించారు: 'మాయంటావా? అంతా మిథ్యంటావా?/ కనపడినది కనబడదని మాయంటావూ? అంతా మిథ్యంటావూ?/ కూలివాని గుండె చెరువు, బిచ్చగాని కడుపు కరువు, మాయంటావూ? అంతా మిథ్యంటవూ?'

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నా పేరు రైతు..
నా పైరు కవాతు..!

మహమ్మారి గళానికి అమరిన అరదండమై
ఉరి తాడును హత్తుకునే మొండెమై
కాలం కొయ్యకు వేళ్లాడుతూ
చిరుగుతున్న వస్త్రమై
మిన్నంటి రెప రెప లాడుతున్న
వ్యవసాయ కార్మికులం

మనసును పంటకు కంచెగా కట్టి
దిష్టిబొమ్మలా వేళ్లాడే దేహం నా దుస్థితి కావచ్చు
చక్రమోలే గిర గిరా తిరిగినా
సమస్యల గాయాల బోనులో చిక్కి
వున్న దగ్గరే కూలబడి ఏడ్వటం నా స్థితి కావచ్చు
ఉరితాడుకు వేళ్లాడే
తల నాదే కావచ్చు.. కానీ

ఏపుగా పెంచి సున్నితంగా తుంచి
ఎండబెట్టి గలగలా గంపకెత్తి
బస్తాల్లో బానెడు ఆశల్తో కుక్కి
మార్కెట్ యార్డుల్లో కెళ్తే
తల వేళ్లాడదీసిన పంట ధర
నా భరోసాను ముక్కలు చేసింది

విపణి శక్తులూ ప్రకృతి విపత్తులూ
మాయదారి కలుపు చట్టాలు
తల తాకట్టు పెట్టుకొమ్మన్నై
అన్నీ మమ్మల్ని అమ్ముడు పొమ్మన్నై
అన్నీ మమ్మల్ని అవమానించినై

వ్యవసాయానికి వెన్నెముకనై
అన్నపూర్ణదేశంలో రాజునై రారాజునై
అక్షర పుటల్లో వర్ధిల్లిన నేను
ఇప్పుడు చేతుల్ని నెత్తిమీద
చరుచుకుంటూ ఏకరువు పెడుతున్నా
కమ్ముకొచ్చిన కసాయి రక్కసిపై
ఉద్యమ మందును పూట పూటకూ పిచికారీ చేస్తున్నా
బ్రతుకు పంట ఎందుకుపచ్చగా పండదో వేచి చూస్తున్నా
ఇప్పటివరకూ
బలిపీఠంపై మోకరిల్లిన తల నాదే కావచ్చు
కానీ.. ఇప్పుడిక సమస్యలను
ఉరితీసే తలారీని నేనే!
నాపేరు రైతు.. నాపైరు కవాతు..!

– కటుకోఝ్వల రమేష్

ఆర్ఆర్ఆర్‌తో రైతుల జీవితాలు విధ్వంసం


తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి దావోస్‌లో 'ప్రపంచ ఆర్థిక వేదిక' సమావేశం నుంచి తిరిగి రాగానే రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ వేగవంతం చేయండి అని అధికార్లకు ఆదేశాలు ఇచ్చారు. అంతేకాకుండా అవుటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్), ఇప్పుడు నిర్మించబోతున్న రీజినల్ రింగ్‌రోడ్డు మధ్య ప్రదేశంలో పరిశ్రమల గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. దీంతో 340 కి.మీ. ఈ రింగ్ రోడ్డు నిర్మాణం వల్ల ప్రభావితం అయ్యే హైదరాబాద్ చుట్టూ ఉన్న సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, భోనగిరి, నల్గొండ, వికారాబాద్, జనగాం జిల్లాలకు చెందిన 300 గ్రామాల రైతులు ఉలిక్కిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, తరువాత మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి కూడా వేలు, లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రాబోతున్నాయని ప్రకటించారు.

ముఖ్యమంత్రి ప్రకటన చూడగానే రైతులకు గత ప్రభుత్వం భూసేకరణ చేసిన ప్రక్రియ చీకటి రోజులు గుర్తుకొచ్చాయి. మల్లన్న సాగర్ నిర్మాణం కోసం గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు జరిపిన విధ్వంసం గుర్తుకొచ్చింది. గ్రామాల్లో 144వ సెక్షన్ విధించి, పలుమార్లు లాఠీచార్జి చేశారు. బయటి గ్రామాల వారినెవ్వరినీ ఆ గ్రామాలకు పోనివ్వలేదు. దాదాపు ఆరుగురు రైతులు గుండె పగిలి మరణించారు. ఒక రైతు తనకు తానే అంటించుకుని మరణించాడు. వందల మందిపై కేసులు పెట్టారు. కొందరు జైళ్లకు వెళ్లి వచ్చారు. ఇంకొందరు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. నిర్వాసితులకు ప్రభుత్వం లింగరాజుపల్లి గ్రామం దగ్గర ఇచ్చిన నివాస స్థలాల్లో ఇప్పుడు నిర్మించదలచిన ఆర్ఆర్ఆర్ రానున్నది. వీరంతా మళ్లీ నిర్వాసితుల మవుతామేమోనని భయపడుతున్నారు.

ఇబ్రహీంపట్నం దగ్గర ఫార్మాసిటీ నిర్మాణానికి భూములివ్వడానికి నిరాకరించిన 43 మందిపై పోలీసులు కేసు పెట్టారు. ఎమ్మెల్యే సభలో నిరసన తెలిపినందుకు అరెస్టులు చేసి, ఇబ్బందులు పెట్టారు. పీడీ యాక్ట్ ప్రయోగించి ఐదుగురు రైతులను జైలుకు పంపారు. యాదాద్రి–భోనగిరి జిల్లాలోని రాయగిరి ప్రాంతంలోని 13 గ్రామాలలో ఆర్ఆర్ఆర్ కోసం భూసేకరణకు వెడితే పెద్ద ఎత్తున ప్రజలు నిరసనలు చేశారు. వందల మంది పోలీసుల సహాయంతో రెవెన్యూ అధికారులు గ్రామాలకు వచ్చి సర్వే చేశారు. ఈ సందర్భంగా చాలా మంది రైతులను అరెస్టు చేశారు. ఆరుగురిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ యాదగిరిగుట్టకు వచ్చినప్పుడల్లా గ్రామాల్లోని కొందరిని పోలీస్‌స్టేషన్లలో కూర్చోబెట్టేవారు. ఇంత నిర్బంధ పద్ధతుల ద్వారా గత ప్రభుత్వం భూసేకరణ చేసింది. ఈ విధ్వంసకర దృశ్యాలన్నీ మనసులో మెదిలి, చౌటుప్పల్ మండలంలోని మందోళ్లగూడెంలోని మామిడి నర్సిరెడ్డి అనే రైతు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ప్రస్తుత ముఖ్యమంత్రితో పాటు, మంత్రి కోమటిరెడ్డి కూడా భూసేకరణ మొదలుపెట్టమని ఆదేశాలు ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు తమ పని మొదలుపెట్టారు. నర్సింహారెడ్డికున్న ఎనిమిదెకరాలలో ఆరున్నర ఎకరాల భూమి ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో పోతోంది. అలాగే భోనగిరి–చౌటుప్పల్ గ్రామాలలో గత సంవత్సరం నుంచి ఐదుగురు రైతులు భూములు పోతున్నాయని మనోవేదనతో మరణించారు.

గత ఎన్నికల ప్రచారంలో ముఖ్య కాంగ్రెస్ నాయకులందరూ రాయగిరి ప్రాంతంలోని గ్రామాలకు ఆర్ఆర్ఆర్ నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చారు. ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, వి. హనుమంత రావు, కోదండరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు ఆర్ఆర్ఆర్‌లో భూములు కోల్పోయే విషయాన్నే ప్రధాన సమస్యగా ప్రచారం నిర్వహించారు. రాయగిరి, భువనగిరి ప్రాంతాల్లోని రైతులు మూడు పర్యాయాలు అభివృద్ధి ప్రక్రియలో భూములు కోల్పోయారు. నేషనల్ హైవే 153, కాళేశ్వరం నుంచి రాబోయే సాగునీటి కాలువకు, విద్యుత్ హై టెన్షన్ టవర్లు, లైన్ల నిర్మాణానికి, రాయగిరి నుంచి యాదాద్రికి వెళ్లే రోడ్డు విస్తరణ కోసం భూములు అప్పగించారు.

ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో సేకరించాల్సిన భూములన్నీ చిన్న, మధ్య తరగతి రైతుల వ్యవసాయ భూములే. గత ఎన్నికల ప్రచారంలో ముఖ్య కాంగ్రెస్ నాయకులందరూ రాయగిరి ప్రాంతంలోని గ్రామాలకు ఆర్ఆర్ఆర్ నుంచి విముక్తి కలిగిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం చేపట్టిన అంశాలను, ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం సమీక్షిస్తోంది. అలాగే ఆర్ఆర్ఆర్‌ను కూడా సమీక్షించి, రైతుల జీవితాలు విధ్వంసం కాకుండా ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి.



గత ముఖ్యమంత్రి యాదాద్రి అభివృద్ధి కోసం యాదాద్రి టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైటీడీఏ)ని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ యాదాద్రి చుట్టూ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి మాస్టర్ ప్లాన్ తయారుచేసింది. ఇందుకు 1330 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఇందులో ఈ గ్రామాల ప్రజలు భూములు కోల్పోతారు. ఇంకా ఏమైనా మిగిలివుంటే ఇప్పుడు ప్రభుత్వం నిర్మించబోయే ఆర్ఆర్ఆర్‌లో పోతాయి. ఆర్ఆర్ఆర్ ప్రకటించిన తర్వాత రెండుసార్లు అలైన్‌మెంట్ మార్చారు. మొదటిసారి దేవస్థానం పక్కనుంచి ఉత్తర భాగాన మోటకొండూరు మండలం గుండా పోతుందని గెజిట్‌లో ప్రకటించారు. రెండోసారి నందనం, చందుపట్ల గ్రామ శివార్ల నుంచి పోతుందని ప్రకటించారు. ఇప్పుడు మూడవది. టీఆర్ఎస్ మాజీ శాసనసభ్యులు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డిల భూముల్లోంచి ఈ రోడ్డు వేయడానికే మార్పులు జరిగాయని ప్రజలు అనుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల ప్రచారంలో ఈ కుట్రనే బాగా ప్రచారం చేసింది.

ఈ ఆర్ఆర్ఆర్ ప్రయోజనం ఏమిటో ఆలోచించవలసిందే. చౌటుప్పల్ నుంచి వలిగొండ మీదుగా మెదక్ గజ్వేల్‌కు మంచి రోడ్డే ఉంది. ఇది 40 అడుగులు ఉంది. కానీ వంద అడుగుల కోసం ఇదివరకే భూసేకరణ చేసి ఉంచారు. దాన్ని విస్తరించుకోవచ్చు. సూర్యాపేట నుంచి జనగాం ద్వారా సిద్దిపేటకు ఇప్పుడున్న రోడ్డు కోసం కూడా ఇదివరకే వంద అడుగులు విస్తరించడానికి భూమిని సేకరించారు. దీన్ని విస్తరించవచ్చు. విజయవాడ హైవే నుంచి భోనగిరి మీదుగా కరీంనగర్‌కు ఒక రోడ్డు ఉంది. ఈ రోడ్లన్నీ ఇదివరకే నిర్మాణమై ఔటర్ రింగ్ రోడ్డుకు 25 కిలోమీటర్ల లోపే ఉన్నాయి. అంటే ఈ ప్రాంతాలన్నీ ఔటర్ రింగ్‌రోడ్డుతో అనుసంధానమై ఉన్నాయి. చౌటుప్పల్ వైపు పరిశీలిస్తే వలిగొండ నుంచి చౌటుప్పల్‌కు రోడ్డు, వలిగొండ–నాగిరెడ్డిపల్లి–భోనగిరి రోడ్లు ఉన్నాయి. వలిగొండ నుంచి చౌటుప్పల్ గుండా భద్రాచలం పట్టణానికి 100 అడుగుల రోడ్డు ఇప్పుడు నిర్మాణంలో ఉంది.

ఆర్ఆర్ఆర్ నిర్మాణంలో సేకరించాల్సిన భూములన్నీ చిన్న, మధ్య తరగతి రైతుల వ్యవసాయ భూములే. చౌటుప్పల్ దగ్గర గ్రామాల్లోని భూములన్నీ మూసీ ప్రాజెక్టు ఆయకట్టులోని మూడు పంటలు పండించే భూములే. ఈ మొత్తం భూసేకరణలో ప్రభుత్వ భూమి అసలే లేదు.

ఆర్ఆర్ఆర్‌లో హైదరాబాద్ చుట్టూ 25 కారిడార్లు ఉంటాయని చెబుతున్నారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల గ్రామాలకు కనెక్టివిటీ మెరుగవుతుందని అంటున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డుపై ఉన్న 24 జంక్షన్లు ఇదివరకే జిల్లాలతో అనుసంధానం అయ్యాయి. తెలంగాణ నుంచి వెళ్లే దాదాపు 20 జాతీయ రహదారులు ఓఆర్ఆర్‌తో లింక్ అయ్యాయి. ఆర్ఆర్ఆర్, తక్కిన జాతీయ రహదారుల ద్వారా దేశ రాజధానికి అనుసంధానం చేస్తుందని, దీంతో రైతుకు రవాణా సౌకర్యం మెరుగువుతుందని, బేరం చేసుకుని శక్తి పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. భారత్‌మాలలో దేశంలోని 550 జిల్లాలను కలుపుతూ నిర్మించదలచిన 34,800 కి.మీ. రోడ్లలో ఈ ఆర్ఆర్ఆర్ ఒకటి.

రాష్ట్రంలో నూతనంగా గద్దెనెక్కిన ప్రభుత్వం కూడా ఈ విధ్వంసకర అభివృద్ధి వైపే అడుగులు వేస్తుందా అనే సంశయం కలుగుతోంది. గత ప్రభుత్వం చేపట్టిన అంశాలను, ప్రాజెక్టులను ఈ ప్రభుత్వం సమీక్షిస్తోంది. అలాగే ఆర్ఆర్ఆర్‌ను కూడా సమీక్షించి, రైతుల జీవితాలు విధ్వంసం కాకుండా ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి.

• యస్. జీవన్‌కుమార్
మానవ హక్కుల వేదిక

అక్షరాల గాండీవం

చరిత్ర నిగ్గు దేల్చాల్సిన
స్థిరమైన ఆనవాలొకటి
ఎప్పుడో కూలిపోయింది
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నెత్తురోడిన
నిండు చూలాల తల్లి పట్టెడు ఆశతో
కనిపెంచిన కవలలిద్దరు
ఇంకా కత్తులు దూసుకోవాలా!?

తలరాతలు కనిపించని బ్రహ్మసృష్టిలో
మందిరాలు, మసీదులు ఆరామాలంటూ
ఎన్ని విశ్వాసాలు ప్రతిష్ఠించామో కానీ
మోక్ష చింతన మరిచిపోతున్నామా!
సాష్టాంగ పడుతున్న ప్రతి వేడుకోలు
కడుపు కోసం, కన్నవారి కోసమే కదా

గమ్యమో, గమనమో
ముక్తో, విముక్తో
పయనించే రైలు ఒకే చోటికైనప్పుడు
విద్వేషాల సెగలు గక్కుతూ
మనుషులెందుకు
రైలు పట్టాల్లా విడిపోవాలి!?

యుగయుగాల పరివేదనలో
ముడుపుగట్టుకున్న నమ్మకాలు
నీకు– నాకు అందరికీ కడిగిన ముత్యాలే
ఇప్పుడవి రాజకీయ అంగడిలో
అమ్ముకోవాలా!?

గిట్టుబాటు ధరల చట్టం
ఎవరి చుట్టమై ఆగిపోయిందో తెలియదు
రైతే రాజన్న రాజధాని ఢిల్లీ
కురుక్షేత్రాన్ని తలపిస్తున్నప్పుడు
తప్పిపోయాల్సింది కాలనాళికలను కాదు
నిన్న గాక మొన్న
సర్కారు హామీ పడ్డ
తడారని సంతకాలను
కన్నీటి పొగలు (Tear Gases)
దేశమంతా కమ్ముకోకముందే
ధర్మరాజా కనికరించు...
కర్ణ కఠోర తాంత్రిక సంగీతంలో
సంవిధాన ప్రేమాక్షరాలు
We are the people of India
శ్రుతి చేసిన విధానమైన
గీతాబోధన కావాలేమో...
అర్జునా...
గాండీవం చేతబూను

– అమర్

అన్నారం బ్యారేజిని పరిశీలిస్తున్న కేటీఆర్



మేడిగడ్డ బ్యారేజీ వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి

పంటలు ఎండుతున్నాయి

- మేడిగడ్డ సందర్శనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిర్లక్ష్యం చేయకుండా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- హరీష్‌రావు తదితర నేతలతో కలిసి పర్యటన

కోపం ఉంటే మాపై తీర్చుకోండి.. రైతులపై కాదు

భూపాలపల్లి/మహదేవపూర్ రూరల్/మహదేవపూర్/కృష్ణకాలనీ, మార్చి 1 : కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వానికి తమపై కోపముంటే తమపైనే చూపాలి కానీ రైతులపై చూపొద్దని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు పేర్కొన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి బస్సులో మేడిగడ్డకు చేరుకున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల బృందం బ్యారేజీ ముఖద్వారం నుంచి ప్రత్యేక వాహనాల్లో కుంగిన ప్రాంతానికి వెళ్లారు. పగుళ్లు తేలిన పిల్లరును, కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు అంటే మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వందల కిలోమీటర్ల మేర సొరంగాలు, కాలువలు, పంప్‌హౌజ్‌లు, బ్యారేజీల్లాంటి వంద అంకాలతో కూడుకున్న సాగు, తాగునీటి ప్రాజెక్టు అని వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో ఒకటైన మేడిగడ్డ బ్యారేజీలో చిన్న సమస్య ఎర్పడితే పునరుద్ధరించాల్సిపోయి.. చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 1.6కిలోమీటర్ల పొడవున్న బ్యారేజీలో 50మీటర్ల మేర సమస్య ఎర్పడితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తూ, పనికిరాని ప్రాజెక్టు అని, రూ.లక్షకోట్లు నీటిపాలయ్యాయని ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లసాగర్ తదితర ప్రాజెక్టుల్లో లోపాలున్నా తామెప్పుడూ రాజకీయం చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించామన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు బ్యారేజీ పునరుద్ధరణకు వీలుందని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వరదలు ప్రారంభం కాకముందే కాఫర్‌డ్యాం ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరితో కరీంనగర్ సహా పలు జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయన్న కేటీఆర్ సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఇంజనీరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బ్యారేజీలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపడితే నీటిని నిల్వ చేసి రాష్ట్రానికి సాగునీరందించవచ్చన్నారు. బ్యారేజీలో వచ్చిన సమస్యను పరిష్కరించుకుని భవిష్యత్‌లో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. మిగతా బ్యారేజీల్లోనూ సమస్యలుంటే వాటిని ముందుగానే గుర్తిస్తే సరిపోతుందన్న ఆయన 93మీ టర్ల వరకు నీటిలెవల్ ఉంచి నీటిని ఎగువకు పంపింగ్ చేసుకోవచ్చని తెలిపారు.



అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి



మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి వచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు

అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్

- కాంగ్రెస్ తీరుపై కడియం శ్రీహరి, హరీష్‌రావు మండిపాటు

మేడిగడ్డ సందర్శన అనంతరం అన్నారం బ్యారేజీ వద్దకు చేరుకున్న బీఆర్‌ఎస్ నేత బృందం అక్కడ ప్రాజెక్టు అవసరతతో పాటు మరమ్మతులు ఏమేరకు సాధ్యమో వివరించేందుకు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్‌ను ఏర్పాటు చేసింది. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ పీపీటీలో ప్రాజెక్టు సమగ్రస్వరూపాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కడి యం, హరీ‌ష్‌రావు తమ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ రాజకీయపరమై దుర్బు ద్ధితో ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారాలు చేస్తోందంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వంద కాంపోనెంట్ల సమాహారమని, ఇదో బృహత్తరమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలు, 15రిజర్వాయర్లు, 19సబ్‌స్టేషన్లు, 21పంప్‌హౌజ్‌లు, 203కిలోమీటర్ల నిడివలో సొరంగాలు, 1531మీటర్ల మేర గ్రావిటీ కాలువలు, 98కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్, 141టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్లు, 530మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేయడం లాంటి కాంపోనెంట్ల ద్వారా మొత్తం 240టీఎంసీల నీటిని వి నియోగించుకునే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి నిర్మించినట్టు చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టులో దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం తో చేస్తూ ప్రాజెక్టును నిర్వీ ర్యం చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. చరిత్రలో అతి తక్కువ అంచనాలతో నిర్మాణం పూర్తయిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని గణాంకాలు వెల్లడించారు. అలాగే కేటీఆర్ మాట్లాడు తూ ప్రాజెక్టుపై వి చారణ నిర్వహించి అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలని శాసనసభ వేదికగా తాము ఇప్పటికే తే ల్చిచెప్పామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వా కం కారణంగా కరీంనగర్‌లో పంటలు ఎండిపోతు న్నాయన్నారు. ఇప్పటికైన యుద్ధప్రాతి పాదికన చ ర్యలు చేపట్టి వరదలు వచ్చేలోపు ప్రాజెక్టును పున రుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మదేవేందర్‌రెడ్డి,

మిగతా 7వ పేజీలో..



వినియోగదారులకు జీరో బిల్ ఇస్తున్న మంత్రి సురేఖ

ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం

- పేదల ఇళ్లల్లో వెలుగులు నింపడమే లక్ష్యం
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- భగత్‌సింగ్ నగర్‌లో గృహజ్యోతి పథకం ప్రారంభం

వరంగల్‌టౌన్, మార్చి 1: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని, ప్రజా పాలన అందిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని 19వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులతో కలిసి ఆమె గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహలక్ష్మి పథకం ప్రారంభమైందని, ఈ రోజు జిల్లా కేంద్రాల్లో మంత్రుల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామన్నారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం కింద 1.45లక్షల కుటుంబాలకు, మహాలక్ష్మి పథకం కింద 50వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే ఈ పథకాలు వర్తిస్తాయని, ఇది నిరంతర ప్రక్రియని, దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేసిందే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, కాంగ్రెస్‌ను గెలిపించిన రెండో రోజే రెండు పథకాలను ప్రారంభించి ప్రజలకు చేరువయ్యేలా చేశామన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, చిన్నచిన్న ఉద్యోగాలు చేసే మహిళలు బస్సు చార్జీలు తప్పడంతో సంతోషిస్తున్నారన్నారు. ఉచిత సౌకర్యంతో వైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారని, మేడారం జాతరకు లక్షలాది మంది మహిళలు బస్సుల్లో వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నాయని, పథకాలను కొద్ది రోజుల్లోనే బంద్ చేస్తారని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనం లూటీ చేయడం తప్పా, చేసిందేమీ లేదన్నారు.

కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌దాసు, ఎస్ఈ మధుసూదన్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, నల్గొండ మేష్, మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, కొత్తపల్లి శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, కూచన రవీందర్, సిలువేరు శ్రీనివాస్, జంగం ప్రభాకర్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ట్రెయినీ కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

హనుమకొండ రూరల్, మార్చి 1: టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణ, ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. గృహజ్యోతి, మహలక్ష్మీ పథకాలకు సంబంధించి గ్యాస్ నెంబరు, విద్యుత్ వినియోగదారుల నెంబరు ఇవ్వనట్లయితే ఎంపీడీవో కార్యాలయం, మునిసిపాలిటీల్లో ఏర్పాటు చేయనున్న ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరి చేయాలన్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఇంటర్, టెన్త్ పరీక్షలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, ఇన్‌చార్జి ఆర్‌డీవో సదానందం, డీఐఈఓ గోపాల్, డీఈవో డాక్టర్ అబ్దుల్ హై, రవాణా శాఖ ఎంవీఐ రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకేందుకు వేచియున్న వినయ్, అరూరి

మేడిగడ్డ తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు

- స్వాగతం పలికిన వినయ్, అరూరి
- టోల్‌గేట్ వద్ద అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు.. ఉద్రిక్తత

హనుమకొండ టౌన్, మార్చి 1: బీఆర్‌ఎస్ శుక్రవారం చేపట్టిన చలో మేడిగడ్డ ప్రాజెక్టు కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి బస్సులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీష్‌రావు పలువురు నేతలు రాగా, జనగామ వద్ద స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. భారీకాన్వాయ్‌తో బయలుదేరిన బీఆర్ ఎస్ శ్రేణులకు హనుమకొండ, వరంగల్ జిల్లాల బీఆర్‌ఎస్ అధ్యక్షులు దాస్యం వినయభాస్కర్, అరూరి రమేశ్ జాతీయ రహదారి వంగపహాడ్ క్రాస్‌వద్ద స్వాగతం పలి కారు. గూడెప్పాడ్ ఎస్ఎస్సార్ హోటల్ వద్ద పరకాల మా జీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి స్వాగతం పలికారు. ఇలా కాళేశ్వరం వరకు ప్రధాన సెంటర్లలో కేటీఆర్ కాన్వాయ్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ప్రతీ సెంటర్ వద్ద ఆగిన కేటీఆర్ కార్యకర్తలను, నేతలను పలకరిస్తూ కరచాలనం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్, కేటీఆర్‌లకు అనుకూలంగా కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేసారు. మేడిగడ్డకు వెళ్లిన వారిలో ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల పార్టీ అధ్యక్షులు దాస్యం వినయభాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్, అరూరి రమేశ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తదితరులున్నారు.

అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

మేడిగడ్డకు వెళుతున్న బీఆర్‌ఎస్ నేతల కాన్వాయ్‌ని దేవన్నపేట టోల్‌గేట్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నేత పోరెడ్డి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు టోల్‌గేట్ వద్దకు చేరుకుని బీఆర్‌ఎస్ నేతల కాన్వాయ్‌కి అడ్డు గా వెళ్లారు. దీనితో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కేటీఆర్ ప్రయాణించే బస్సుతోపాటు పాటు నేతల వాహనాలు నిలిచిపోయాయి. ఇరుపార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరిస్థితి చేయి దాటే ప్రమాదాన్ని గుర్తించిన పోలీసులు.. ఇరువర్గాలను చెదరగొట్టి వాహనాలు పంపించారు. పలివేల్పుల వద్ద కాంగ్రెస్ నేత దేవరకొండ అనిల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇక్కడ పోలీసులు ఎలాంటి గొడవ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. కాగా, శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన తమను బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి రెచ్చగొట్టి గొడవకు కారణమయ్యారని పోరెడ్డి మహేందర్‌రెడ్డి కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కేయూ పోలీసులు ధ్రువీకరించారు.

రామ రాజ్యం కావాలా.. రాక్షస పాలన కావాలా?

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్
- కమలాపూర్‌లో కొనసాగిన ప్రజాహిత యాత్ర



కమలాపూర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

కమలాపూర్ (ఎల్కతుర్తి), మార్చి 1: భారత దేశం రామ రాజ్యంగా ఉండాలంటే దేశ ప్రధానిగా నరేంద్రమోదీనే కొనసాగాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో బండి సంజయ్ చేపట్టిన ప్రజా హిత యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కమలాపూర్ మండల కేంద్రంలో మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ పాలన అంతమొందగా కాంగ్రెస్ రాక్షస పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల్లోనే తెలంగాణకు రూ.10వేల కోట్ల అప్పులు చేసి చూపెట్టారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులు జారీ చేయకుండానే రేషన్ కార్డులు ఉన్న వారికే 6 గ్యారంటీలను అందిస్తామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదా అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలు కోసం కేసీఆర్‌ను నిలదీస్తే తనపై 100 కేసులు పెట్టి 14 సార్లు జైలుకు పంపారని విమర్శించారు. కేసులకు బయపడే వ్యక్తిని కాదని, ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడుతానన్నారు.

కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు బీజేపీ నాయకులు వెళితే పోలీసులతో కొట్టించారని.. ఇప్పుడు కేటీఆర్ అక్కడికి వెళ్లే ప్రయత్నం చేస్తే దాదాపు వారికి అదే గతి పట్టిందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ - కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనన్నారు. కాళేశ్వరంపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని రుజువైనా ఎందుకు కేసీఆర్‌పై కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే దోపిడీకి అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదన్నారు. ప్రపంచం మొత్తం దేశ ప్రధాని మోదీనే దేవుడిగా కొలుస్తున్నారన్నారు. తిరిగి మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేసుకుని రామ రాజ్యాన్ని నెలకొలుపుదామన్నారు. అనంతరం బండి సంజయ్ ప్రజా హిత యాత్ర కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశించింది. జమ్మికుంట మండలం ఇల్లంతకుంట మీదిగా వీణవంక మండల కేంద్రానికి చేరుకుంది. వీణవంకలో బండి సంజయ్ బస చేసి తిరిగి యాత్ర కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అరుదైన పక్షుల ఆలవాలం

- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక రకాల పక్షులు
- విడిదికి అనువుగా అమ్మవారిపేట చెరువు
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతి ప్రేమికుల డిమాండ్

7

పరిశోధనల్లో ప్రజావసరాలకు ప్రాధాన్యం

- ఈ దిశగా సరికొత్త ఆవిష్కరణలు
- గ్రిడ్ ఇండియా డైరెక్టర్ రాజీవ్ పోర్వాల్ పిలుపు
- నిట్‌లో సుస్థిర విద్యుత్, శక్తిపై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న రాజీవ్ పోర్వాల్

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు సామాన్యుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శాస్త్ర, సాంకేతికరంగాల్లో సరికొత్త ఆవిష్కరణలను చేయాలని గ్రిడ్ ఇండియా డైరెక్టర్ (సిస్టమ్ ఆపరేషన్) డైరెక్టర్ రాజీవ్ పోర్వాల్ పిలుపునిచ్చారు. సాంకేతిక నిపుణుల కృషి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంగా సాగాలన్నారు. వరంగల్ నిట్ కళాశాలలో శుక్రవారం సుస్థిర విద్యుత్, శక్తిపై అంతర్జాతీయ సదస్సు జరిగిం ది. ముఖ్య అతిథిగా హాజరైన రాజీవ్ పోర్వాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో సింక్రోనస్ గ్రిడ్, మైక్రోగ్రిడ్‌లో వివిధ సవాళ్లను ఎదుర్కోవడంలో భారతదేశం అగ్రభాగాన ఉందన్నారు. ఇంధన రంగంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత, ఈ రంగంలో లాభాలను గడించడానికి, ఇందుకు సంబంధించిన పరిశ్రమలతో చురుకుగా సహకరించడానికి నిట్ వంటి సాంకేతిక కళాశాలలు తోడ్పాటు అందించాల్సిన ఆవిశ్యకతను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ భీమ్ సింగ్ మాట్లాడుతూ.. నిట్ వంటి అత్యున్నత సాంకేతిక కళాశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఉద్యోగాలలో స్థిరపడడంతోనే సరిపెట్టుకోకుండా కంపెనీలను ప్రారంభించి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా దృష్టిపెట్టాలని పిలుపునిచ్చారు. హిటాచీ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అకిటూర్ రెహమాన్ మాట్లాడుతూ.. 2030 నాటికి మన దేశం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 500 జీడబ్ల్యూ శక్తిని ఏకీకృతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ప్రసంగిస్తూ.. ఎనర్జీ గ్రిడ్‌ల ఆవశ్యకత, స్వచ్ఛమైన వనరుల ద్వారా శక్తి ఉత్పత్తి, వాటి ప్రాముఖ్యతను ప్రధాన ఎత్తి చూపారు. అంతర్జాతీయ ఒప్పందాలలో పేర్కొన్న ప్రతి ష్ఠాత్మక లక్ష్యాలను సాధించడానికి మన దేశం యత్ని స్తున్నదన్నారు. నికర సున్నా ఉద్గారాల వైపు పునరు త్పాదకాలను వేగంగా ఏకీకృ తం చేసే కృషి జరుగుతోందన్నారు.

ఈ సదస్సులో ఎన్ఐటీడబ్ల్యు డీన్ (ఆర్అండ్‌డీ) ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ బీఎల్ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు. నిట్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ సదస్సులో దేశంలోని వివిధ నిట్, ఐఐటీ కళాశాలల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. వరంగల్ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మొత్తం 292 పరిశోధనాపత్రాలను సమర్పించారు. వీటిలో 114 పత్రాలను ప్రదర్శనకు అంగీకరించారు.



కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు

- రెండోరోజు రూ.2.98కోట్ల ఆదాయం రాక

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీ పంలోని టీటీడీ కల్యాణ మండపంలో మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు శుక్రవారం రెండోరోజు ప్రశాంతంగా సాగింది. రెండో రోజు 71 హుండీలను లెక్కించగా రూ.2,98,35,000 ఆదాయం వచ్చింది. దీంతో గురు వారం లెక్కించగా వచ్చిన రూ.3.15కోట్లతో కలుపుకొని మొత్తం ఆదాయం రూ.6,13,75,000 చేరుకున్నది. ఈ రెండు రోజులు లెక్కించిన హుండీల సంఖ్య మొత్తం 205 చేరుకున్నది. రెండో రోజు లెక్కింపులోనూ కరెన్సీ నోట్లు, నాణాలు, బంగారం, వెండి కానుకలతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తం బయట పడింది. వీటిని లెక్కించి బ్యాంకులో జమ చేశారు. భారీ బందోబస్తు మధ్య హుండీల లెక్కింపు జరుగుతోంది. నాణాలు, బియ్యం, వేరు చేసే మిషన్‌ను ఈసారి ప్రత్యే కంగా ఏర్పాటు చేయడం వల్ల లెక్కింపు వేగంగా జరుగుతోంది. దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంతరావు, ఏసీ ఆర్.సునీత, ఈవో రాజేంద్రం లెక్కింపును పర్యవేక్షిస్తున్నారు. లెక్కింపు మరో నాలుగైదు రోజులు పట్టవచ్చు.

వంగరలో క్షుద్రపూజల కలకలం

భీమదేవరపల్లి, మార్చి 1: మండలంలోని వంగరలో శుక్రవారం తెల్లవారు జామున క్షుద్రపూజలు కలకలం రేపాయి. వంగర నుంచి మాలపల్లి కాలనీకి వెళ్లే రహదారిలో పూజలు చేసిన, ఓ మేకను బలిచ్చిన ఆనవాళ్లను శుక్రవారం ఉదయం వంగర గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వంగర ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు తన సిబ్బందితో అక్కడికి చేరుకుని అక్కడున్న పసుపు, కుంకుమ, దుస్తులు, మేక కళేబరాన్ని తొలగించారు. ఎవరైనా ఇలాంటి చర్యలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే గతంలోనూ ఇలాంటి సంఘటనలున్నా ఈ సారి ఏకంగా జంతుబలివ్వడంతో ప్రజలు భయాందళన చెందుతున్నారు.

జడ్పీ వ్యవస్థ నిర్వీర్యం

నిధుల మంజూరులో కోత ● అరకొర నిధులతో పనులు చేయని దుస్థితి
కార్యాలయ నిర్వహణకు డబ్బులు కరువు ● ఉత్సవ విగ్రహాలుగా జడ్పీటీసీలు

హనుమకొండ టౌన్, మార్చి 1: గత పాలకులు జడ్పీ సెక్టార్‌ను నిర్వీర్యం చేశారు. మినీ అసెంబ్లీగా పిలవబడే జడ్పీ సెక్టార్‌కు నిధుల మంజూరులో కోత విధించారు. పలు గ్రాంట్లను నిలిపివేసి అరకొర నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. అభివృద్ధి పనులు దేవుడెరుగు కనీసం చాయి, బిస్కెట్లకు నిధులు లేని దుస్థితి జడ్పీ సెక్టార్‌లో నెలకొంది. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి ఉత్సాహంగా జడ్పీలో అడుగుపెట్టిన జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారారు. కేవలం మీటింగ్‌లకు రావడం, వారు కొనసాగుతున్న పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా వారు చేసే ఘనకార్యం ఏమిలేదు. మరో నాలుగుమాసాల్లో పదవీకాలం పూర్తి కావస్తుండగా గెలిపించిన ప్రజల కోసం పైసా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో జడ్పీటీసీలు ప్రజలకు ముఖం చాటేయాల్సిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుండటం గమనార్హం. నూతన ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనించి జడ్పీలకు పూర్వవైభవం తీసుకురావాలని సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకొర నిధులు మంజూరు

జడ్పీ సెక్టార్‌లకు గత పాలకులు అరకొర నిధులు మంజూరు చేశారు. 2019 జూలై మొదటి వారంలో జడ్పీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేవలం రూ.5కోట్ల 83లక్షల 22వేల నిధులు మంజూరయ్యాయి. వీటిలో కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్ల 78లక్షల 39వేలు కాగా, రాష్ట్రం స్పెషల్ గ్రాంట్ క్రింద మంజూరు చేసిన నిధులు రూ.3కోట్ల 48లక్షలు. ఈనిధులు జిల్లాలోని ఏడుగురు జడ్పీటీసీలు, ఇద్దరు కోప్షన్ సభ్యులకు కేటాయిస్తారు. కాగా, వచ్చిన నిధులు 60:40 రేషియోలో పంపకాలు జరుపుకున్నట్లు సమాచారం. 60శాతం 8మంది సభ్యులకు 40శాతం చైర్మన్ కోటా కింద కేటాయింపులు జరుపుకున్నట్లు తెలిసింది. చైర్మన్‌కు కేటాయించిన అదనపు నిధులు అత్యవసరమైన చోట వెచ్చించేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ప్రతి జడ్పీటీసీకి వచ్చిన గ్రాంట్ కేవలం రూ.60 లక్షలు మించలేదు. ప్రతీ జడ్పీటీసీ పరిధిలో 20కి పైగా గ్రామాలుంటాయి. వచ్చిన గ్రాంట్ సమానంగా పంపకాలు జరిపితే ప్రతీ గ్రామానికి రూ.3లక్షల నిధులు మాత్రమే వస్తాయి. అరకొర నిధులతో ఎలాంటి పనిచేయలేని జడ్పీ టీసీలు ఒకటిరెండు గ్రామాలు ఎంపిక చేసుకుని అందుబాటులో నిధులమేరకు అభివృద్ధి పనులు చేశారు. మిగతా గ్రామాలను గాలికి వదిలేసారు.

చాయ్, బిస్కెట్లకు డబ్బులు లేవు

పాలకులు జడ్పీ సెక్టార్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో కనీస సౌకర్యాలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జడ్పీలకు మంజూరయ్యే నిధుల నుంచి 5శాతం నిధులు పరిపాలన సంబంధ ఖర్చులకు వెచ్చిస్తున్నారు. సమావేశాలు జరిగినప్పుడు చాయ్, బిస్కెట్లు, స్టేషనరీ, స్వీపర్లకు వేతనాలకు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నిధుల మంజూరులో కోత ఏర్పడటంతో యేడాదిగా కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. దినసరి ఉద్యోగులకు రెండు మూడు నెలలకు వేతనాలు ఇస్తున్నారు. జడ్పీ కార్యాలయం మెయిన్ రోడ్డు ఆరు కమర్షియల్ కాంప్లెక్స్ ఉండటం, వాటి అద్దెలతో ఖర్చులు కానిస్తున్నారు. మొత్తంగా గతపాలకుల వైఖరితో మినీ అసెంబ్లీగా పిలువబడే జడ్పీ సెక్టార్లు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొనడం విశేషం.

మంజూరైన నిధులు ఇలా..

15వ ఆర్థిక సంఘం నిధులు: 2020-21 సంవత్సరానికి గాను రూ.57,87,000

2021-22 సంవత్సరానికి గాను రూ.93,80,464

2022-23 సంవత్సరానికి గాను రూ.97,24,102

2023-24 సంవత్సరానికి గాను రూ.29,47,730

స్పెషల్ గ్రాంట్: 2021 సంవత్సరానికి గాను రూ.1,73,00,663

స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్: 2022-23 సంవత్సరానికి గాను రూ.1,31,82,907..

అల్లంత దూరం నుంచి పక్షులను చూడడం, చెట్లపై వాలిన వాటి అందాలను దూరంగా గమనించడం సహజం. అవే పక్షులను దగ్గరగా చూస్తే? వాటి ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే..? చింత రావి, తుమ్మ, గండ్ర వెదురు చెట్లపై వాలే ఈ అతిథి విహంగ జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే.. ఎంత బాగుంటో దో కదా.. ఈ సరదా తీరాలంటే వరంగల్‌లోని అమ్మవారిపేట చెరువు వద్దకు వెళితే సరి. ఆహారం, అన్వేషణ, అవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతను వివరంగా తెలుసుకునే అవకాశం ఈ చెరువు వద్ద కనిపిస్తుంది. పక్షులు కిలకిలరావాలు చెవులకు ఇంపుగా వినిపిస్తాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.



అరుదైన పక్షుల ఆలవాలం

- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక పక్షులు
- అమ్మవారిపేట చెరువు వద్ద పక్షుల విడిదిగా అనువైన వాతావరణం
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతిప్రేమికుల డిమాండ్

హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట ప్రకృతి రమణీయతకు ప్రతీక. చెరువుకు రెండు వైపుల గుట్టలు. మరో వైపు పొలాలు, ఇంకో వైపు నిండుగా నీళ్లతో చెరువు. దాని ఆవరించిన కట్ట. ఎటుచూసినా పచ్చని చెట్లు. నిశ్శబ్దమైన వాతావరణం. చెట్లపై వివిధ రకాల అరుదైన పక్షుల కిలకిలలు, స్థానికంగా ఉండే పక్షులతోపాటు వివిధ దేశాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ విడిది చేసి ఉండడం కనిపిస్తుంది. సుమారు 100 రకాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వీటిలో అత్యంత అరుదైన పక్షులు కూడా ఉన్నాయి. ఇటీవల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జగన్ ఓ అరుదైన పక్షిని గుర్తించి ఫొటోలు తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా అక్కడ ఉన్నాయి. సాధారణంగా ఆయా కాలాల్లో వివిధ ప్రాంతాల నుంచి పక్షులు గుడ్లను పొదగడం కోసం అనువైన ప్రాంతాలను వెతుక్కుంటూ వలస వెళుతుంటాయి. అలాంటి ప్రాంతమే అమ్మవారిపేట చెరువు. పచ్చని చెట్లు, మనుసుకు హాయినిచ్చే ప్రశాంతతకు పెట్టింది పేరు ఈ చెరువు. అనువైన వాతావరణం ఉండడంతో అనేక పక్షులు ఇక్కడికి పెద్దఎత్తున వలస వస్తున్నాయి.

అరుదైన పక్షి

ఇటీవల అత్యంత అరుదైన పక్షి స్పర్ వింగ్డ్-లాప్ వింగ్ అనే పక్షి అమ్మవారిపేట చెరువు వద్ద కంటపడింది. దేశంలో మొట్టమొదటి సారి ఇక్కడే కనిపించడం విశేషం. ఈపక్షి స్వస్థలం ఉత్తర ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, మధ్యదరా ప్రాంతాలు. సాధారణగా ఏ పక్షి రెక్కలకు గోళ్లు ఉండవు. కానీ అరుదైన పక్షి రెక్కలకు గోళ్లు ఉన్నాయి. చిన్నగా, పొట్టిగా ఉండి చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది. ఈ పక్షిని మొట్టమొదటిసారిగా హనుమకొండకు చెందిన జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ గుర్తించారు. పక్షి ఫొటోలను తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా ఇక్కడ సంచరిస్తున్నాయి. ఆయన వాటిని కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. దీనిని బట్టి సుదూర దేశాల నుంచి పక్షులు ఈ చెరువు వద్దకు వలస వస్తున్నట్లు స్పష్టమవుతోంది.

వంద రకాల పక్షులు

అమ్మవారిపేట చెరువు వద్ద 100 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు ఇతర దేశాలకు చెందిన అరుదైన, అందమైన పక్షులు కూడా ఉన్నాయి. వేర్ టేయిల్డ్ స్వాలో, బ్లూటేల్డ్ బీ ఈటర్, యూరోసియన్ వేగన్, కామన్ వ్యాగ్ టేయిల్, విస్కర్డ్ టెర్న్స్, బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్స్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, ఎల్లో రాటిల్డ్ లాప్వింగ్, ఎల్లో వ్యాగ్‌టేల్, ఇంటర్మీడియట్ ఎగ్రెట్, స్పాట్ బిల్‌ డక్, కామన్ డ్రాంగో, కామన్ ప్రెనియా, సాండ్ పైపర్, డార్టర్ ద స్నేక్ బర్డ్, గ్రే హేరాన్, గ్రీన్ బీ ఈటర్, ఫ్రింగ్డ్ ఊలీడక్స్, నాబ్ బిల్డ్ డక్స్, బిన్ టెల్, గార్గని, యురేపియన్ బీగన్, టఫెడ్ డక్ట్, తదితర పక్షులు వీటిలో ఉన్నాయి. కామన్ కింగ్ ఫిషర్, రీడ్ వెబ్లెర్, సిల్వర్ బిల్, ఫెల్‌వోస్ విజిలింగ్ డక్స్ వంటి పక్షులు కూడా వీటిలో ఉన్నాయి.

పక్షుల సంరక్షణ కేంద్రం

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిపేట చెరువు వద్ద అనేక రకా పక్షులు విడిది చేస్తున్నందువల్ల ఈ చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా మార్చాలని స్థానికులు, పక్షి ప్రేమికులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని ఆమీన్‌పూర్ చెరువు తర్వాత అత్యధిక సంఖ్యలో వివిధ రకాల పక్షులకు కేంద్రంగా ఉన్న అమ్మవారి పేట చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించినట్లయితే మరిన్ని ఎక్కువ పక్షులు ఇక్కడి వచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. వాస్తవానికి వరంగల్ నగరం, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో పలుచెరువు ఉన్నాయి. ఈ చెరువుల వద్ద కూడా అనేక రకాల పక్షులు మనకు తారసడతాయి. అయితే కబ్జాల కారణంగా ఈ చెరువులన్నీ క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీనితో వరంగల్‌లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పక్షులన్నీ ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నాయి. అలా కాకుండా కనీసం అమ్మవారి చెరువునా కాపాడానలి ప్రజలు కోరుతున్నారు.

పక్షి ప్రేమికుడు డాక్టర్ జగన్

డాక్టర్ జగన్ పక్షి ప్రేమికుడు. ఏళ్లతరబడి పక్షులపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వందర రకాల పక్షులపై లోతైన అధ్యయనం చేశారు. వాటి ఫోటోలను తీసి అల్బమ్‌గా తీసుకువచ్చారు. అమ్మవారిపేట చెరువు వద్ద అరుదైన స్పర్డ్ వింగడ్-ల్యాప్ వింగ్ పక్షిని మొట్టమొదటి సారి గుర్తించింది ఆయనే. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన డాక్టర్ జగన్ 2005నుంచి పక్షలపై అధ్యయనం చేస్తున్నారు. ఉద్యోగరిత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అమీన్‌పూర్ చెరువు, దానిచుట్టుపక్కల ఉన్న పలు అరుదైన పక్షలను గుర్తించారు. వరంగల్ దాని చుట్టుపక్కల ఉన్న చెరువుల వద్ద అనేక రకాల పక్షలు కనిపిస్తాయని అంటున్న ఆయన చెరువులు అంతరించిపోతుండడం వల్ల ఈ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కామన్ పెర్నియా


గ్రీన్ బీటర్


ఎల్లో వ్యాగ్‌టేయిల్


ఇంటర్మీడియట్ ఎగ్రెట్


సాండ్ పైపర్


డార్టర్ ది స్నేక్ బర్డ్


గ్రే హెరాన్


కామన్ డ్రాగన్


స్పాట్ బిల్ డక్

నకిలీ సెఫిక్సిన్ విక్రయించొద్దు..

హనుమకొండ, మార్చి 1: నకిలీ సెఫిక్సిన్‌ను మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నకిలీవిక్రయాలపై ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఔషధ నియంత్రణ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం విచా రణ చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లో ఈ నకిలీ మం దు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పసిగట్టి దాడులు చేపట్టామన్నారు. వీటి మూలాలు ఉత్తరా ఖండ్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడడకు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అరెస్టు కూడా చేశా మన్నారు. హనుమకొండలో ఇలాంటి నకిలీ విక్ర యా లు చేపడితే కఠిన చర్యలు తప్పవని

పది మందికి జరిమానా

హనుమకొండ క్రైం, మార్చి 1: డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేయూ జంక్షన్, పెద్దమ్మగడ్డ, నయీంనగర్, యాదవనగర్‌లో గురువారం రాత్రి పది మందిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్లు గుర్తించారు. వారికి శుక్రవారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రమేష్ పది మందికి రూ.10,700 జరిమానా విధించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 7 గురు వ్యక్తులకు రూ.7,900 జరిమాన విధించినట్లు సీతారెడ్డి తెలిపారు.

వలంటీర్ల ఎంపిక

హనుమకొండ క్రైం, మార్చి 1: అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన సమయంలో స్వచ్ఛందంగా పని చేసేందుకు వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్లు అగ్నిమాపక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ అధికాధి మామిడి భగవాన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 'ఆపద మిత్రుడు - స్వచ్ఛంద సేవకుడు' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నుంచి 200 మందిని, హనుమకొండ జిల్లా నుంచి 300 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరిత్యాలైన అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, తుపాన్లు వచ్చిన ప్రాంతాల్లో స్వచ్ఛందంగా పని చేస్తూ ప్రజలకు సేవ చేయాలనే మానవత్వం ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండు జిల్లాల కలెక్టర్ల ఉత్తర్వుల మేరకు ఈనెల 4నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని, 18 నుంచి 40 యేళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 7వ తరగతి చదివి సేవాభావం కలిగి ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎంపిక చేసిన వారికి 12 రోజుల ప్రత్యేక సామగ్రిని అప్పగించి శిక్షణ ఇస్తామని తెలిపారు. అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 87126 99149, 87126 99305 నెంబర్లలో సంప్రదించాలని భగవాన్‌రెడ్డి సూచించారు.

ఫోన్ లాక్కుని డబ్బు స్వాహా

హనుమకొండ క్రైం, మార్చి 1: బలవంతంగా ఫోన్ తీసుకుని ఫోన్‌లో నుంచి డబ్బులు కాజేసిన వ్యక్తిపై హనుమకొండ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఊకంటి శ్రీనాథ్‌రెడ్డి టైలర్‌స్ట్రీట్‌లో మెడికల్‌షాపులో పని చేస్తున్నాడు. హనుమకొండ సుధానగర్ ప్రాంతానికి చెందిన అనిపర్తి అనితకుమార్ అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట పరిచయమయ్యాడు. కిందటేడు ఆగస్టు 28న శ్రీనాథ్‌రెడ్డి పనిచేస్తున్న మెడికల్ షాపునకు అనితకుమార్ వచ్చాడు. ఫోన్ మాట్లాడేది ఉంది, ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో బలవంతంగా ఫోన్‌ను లాక్కుని ఓ లోన్ యాప్ ద్వారా రూ.2.30లక్షలు అనిత్‌కమార్ ఫోన్‌పేకు పంపించుకున్నాడు. డబ్బుల గురించి ప్రశ్నించగా ఇస్తానని జరుపుకుంటూ వచ్చి చివరికి ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీనాథ్‌రెడ్డి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. పంటలు ఎండుతున్నాయి


టోల్‌గేట్ వద్ద బీఆర్ఎస్ నాయకుల కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, జడ్పీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమన్వయలోపంతో ఉద్రిక్తత

బీఆర్ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమ నేపథ్యంలో పోలీసుల సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. తొలుత బ్యారేజీ చెక్‌పోస్ట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లోనికి అనుమతించిన పోలీసులు కేటీఆర్ పర్యటనకు కొద్ది నిమిషాల ముందు కట్టడి చర్యలు ప్రారంభించారు. అప్పటికే వంతెన సమీపంలోకి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించినా వారంతా వంతెన గేటు వద్దకు చేరుకోవడంతో పోలీసులు వంతెన గేటు మూసివేశారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య సుమారు అరగంటపాటు వాగ్వాదం జరిగింది. కానీ అక్కడ సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడంతో.. కార్యకర్తలంతా ఒక్కసారిగా గేటును తోసేసి లోనికి దూసుకురావడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మహిళ కార్యకర్తలు, నాయకులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు ముందు ఓడీ ఎస్పీ స్థాయి అధికారి మీడియాకు అనుమతి ఉందని లోపలికి పంపగా.. మరో డీఎస్పీ స్థాయి అధికారి అడ్డుకోవడం వాగ్వాదానికి దారితీసింది. పోలీసుల సమన్వయలోపాన్ని బయటపెట్టింది. ఇక పోలీసులు అత్యుత్సాహం కారణంగా కేటీఆర్‌తో కలిసి పరిశీలనకు వెళ్లాల్సిన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్‌రెడ్డిపాటు ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి సహా పలువురు నేతలు ప్రత్యేక వాహనాల్లో కాకుండా నడుచుకుంటూ కుంగిన ప్రాంతానికి వెళ్లారు. మూడు రోజుల ముందే పర్యటనకు సంబంధించిన సమాచారం ఉన్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపించాయి.

ఉద్రిక్తత.. ఉద్విగ్నంగా..

బీఆర్ఎస్ చేపట్టిన చలో మేడిగడ్డ కార్యక్రమం ఉద్రిక్తతగా సాగింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ తెలంగాణ భవన్ నుంచి రెండు బస్సులతో పాటు కాన్వాయ్‌లో వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు, హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీస్పీకర్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదుసూధనచారి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల బృందానికి జనగామ జిల్లా పెంబర్తి వద్ద స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎరబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు పెంబర్తి నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. 'గో బ్యాక్ బీఆర్ఎస్.. గో బ్యాగ్ కేటీఆర్' అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేసి బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసుల బందోబస్తు మధ్య కాన్వాయ్ ముందుకు సాగింది. దామెర క్రాస్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పోలీసుల చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యర్తలను కేటీఆర్ పరామర్శించారు. అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్ బృందం మధ్యాహ్నం భోజనం అనంతరం 3:30గంటలకు భూపాలపల్లికి బయలుదేరి 4:40కి మేడిగడ్డకు చేరుకున్నారు. అక్కడ పరిశీలన అనంతరం 5.20గంటలకు అన్నారం బ్యారేజీకి వెళ్లారు.

బీఆర్ఎస్ నాయకుల అత్యుత్సాహం

పిల్లర్ల పైకి ఎక్కి సెల్ఫీలు

మహదేవపూర్ రూరల్, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజీ వద్ద పోలీసులు పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రమాదకర ప్రదేశంలో సెల్ఫీలు దిగుతూ కనిపించారు. తొలుత మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి అనుమతించని పోలీసులు ఆ తర్వాత కార్యకర్తలు నెట్టుకుంటూ రావడంతో వారిని వదిలేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు బ్యారేజీ వంతెనపైనే కాకుండా పిల్లర్లపైకి ఎక్కి సెల్ఫీలు దిగారు. సాధారణంగా అధికారులకు మాత్రమే అనుమతి ఉన్నచోట హంగామా చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయలేదు.


మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌పైకి ఎక్కి సెల్ఫీలు దిగుతున్న బీఆర్ఎస్ నాయకులు

గెలుపే లక్ష్యంగా..

- కబడ్డీ పోటీలలో స్వర్ణ పతకమే లక్ష్యంగా కసరత్తు
- నేటి నుంచి నాగార్జుసాగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు



జేఎన్ఎస్ కబడ్డీ కోర్టులో సాధన చేస్తున్న హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 1: మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న 70వ అంతర్ రాష్ట్రాల సీనియర్ మెన్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జిల్లాకు కీర్తి తీసుకరావడమే ధ్యేయంగా హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్టు క్రీడాకారులు కొంత కాలంగా హనుమకొండ జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో డీఎస్‌ఏ తాత్కాలిక కోచ్ ఓనపాకల శంకర్ సారథ్యంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు. డీఎస్‌ఏ కోచ్ శంకర్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న జిల్లా జట్టు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలి.. : ఓనపాకల శంకర్, డీఎస్‌ఏ కబడ్డీ కోచ్

జేఎన్ఎస్‌లో కొన్ని క్రీడలకు మాత్రమే అకాడమీలు ఉన్నాయి. గ్రామీణ క్రీడగా ప్రసిద్ధిగాంచిన కబడ్డీ క్రీడాకారులు కోసం అకాడమీ ఏర్పాటు చేయడం ద్వారా మెరికలాంటి క్రీడాకారులను జిల్లాకు అందించవచ్చు. అకాడమీలు నెలకొల్పడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండడంతో క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించవచ్చు. అదే విధంగా కబడ్డీ క్రీడను ఒలంపిక్‌లో చేర్చడం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ లభించే అవకాశం ఉంది. ప్రతీ రోజు సుమారు 30 మంది యువతకు కబడ్డీ క్రీడలో ఉదయం, సాయత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్న. ఇక్కడ నా వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి రాణిస్తున్నారు.

గ్రేట్ 'జాబ్'!

- అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల్లో అరుదైన ఫలితాలు
- ఒక్కరికి పలు ఉద్యోగాలు

● ఒకే మహిళకు నాలుగు ఉద్యోగాలు


గట్ల పుష్పలత

కేసముద్రం, మార్చి 1 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన గట్ల పుష్పలత తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక పరీక్షల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ నియామక పరీక్షల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టులకు ఆమె ఎంపికయ్యారు. కేసముద్రం స్టేషన్‌కు చెందిన స్థానిక జీజేసీ లెక్చరర్ కొత్తకొండ ప్రసాద్‌తో 2009లో వివాహం కాగా, అప్పటికే ఆమె బీఎస్సీ(బీజెడ్సీ), బీఈడీ పూర్తి చేశారు. వివాహం అనంతరం ఆమె భర్త ప్రోత్సాహంతో 2013లో ఎంఎస్సీ(బాటనీ), 2019లో ఎంఏ(తెలుగు) కేయూలో పూర్తిచేసి, జాతీయ అర్హత పరీక్ష(నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) అర్హత సాధించారు. 2021లో నియామక పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలో గెస్ట్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పు టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు పుష్పలతను అభినందించారు.

● అక్కాచెల్లెళ్లకు మూడేసి ఉద్యోగాలు


అక్కాచెల్లెళ్లు దివ్య, వకుల

బచ్చన్నపేట, మార్చి 1: వారిద్దరు అక్కాచెల్లెళ్లు.. పేదరైతు ఇంట్లో పుట్టిన బిడ్డలు. పెళ్లిళ్ల అయినప్పటికీ పట్టు వదలలేదు. మంచి ఉద్యోగం సంపాదించి చదివిన చదువుకు సార్థకత చేకూర్చాలనుకున్నారు. రాసిన మూడు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని మండల ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ సక్కుబాయి ఈదిరెడ్డి దంపతులకు వకుల, దివ్య అనే ఇద్దరు కుమార్తెలు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. వకులను జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌కు చెందిన వంటేరు సంపత్‌రెడ్డికి, రెండో అమ్మాయి దివ్యను బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉమ్మెంతల మధుసూదన్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. వకుల గృహిణిగా, దివ్య జనగామ మండలం వెంకిర్యాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం అగస్టు 2023లో గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కోసం పరీక్షలు నిర్వహించగా, అక్కాచెల్లెళ్లు జనగామలో ఉంటూ ప్రిపేర్ అయ్యారు. ఫిబ్రవరి 14న పీజీటీ, 29న జూనియర్ లెక్చరర్, మార్చి 1న టీజీటీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మూడింటిలోనూ అక్కాచెల్లెళ్లు ఎంపికయ్యారు. దీంతో జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో జాయిన్ అయ్యేందుకు వారు సిద్ధమయ్యారు. కాగా ఒక్క ఉద్యోగం పొందేందుకు నానా తంటాలు పడుతున్న ఈ రోజుల్లో అక్కాచెల్లెళ్ల మూడేసి ఉద్యోగాలకు ఎంపిక కావటంతో వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఉంటామని వారు ఆత్మస్థైర్యంతో చెబుతున్నారు.

● దంపతులకు రెండేసి ఉద్యోగాలు


గంధసిరి వెంకటేశ్వర్లు, గీత

కురవి, మార్చి 1: కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గంధసిరి వెంకటేశ్వర్లు-గీత దంపతులు ఇటీవల విడుదలైన ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో రెండేసి ఉద్యోగాలు సాధించారు. గురుకుల ఫలితాల్లో గంధసిరి వెంకటేశ్వర్లు డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఆయన భార్య గీత పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. భార్యాభర్త రెండేసి పోస్టులకు ఎంపిక కావడం పట్ల మిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

● ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు

నడికూడ, మార్చి 1 : నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల కృష్ణమూర్తి పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అయితే ఆయన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గురుకుల ఫలితాలల్లో గణిత శాస్త్రం విభాగంలో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. కాగా, స్వగ్రామం చర్లపల్లిలో కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. కృష్ణమూర్తి ఐదుగురు సోదరులు, సోదరి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గమనార్హం. కృష్ణమూర్తి పదో తరగతి వరకు చర్లపల్లిలో చదువుకున్నాడు. ప్రస్తుతం బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు.

బయో కెమిస్ట్రీ ఇన్‌చార్జ్ హెడ్‌గా మధుకర్‌రావు

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూ బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి హెడ్‌గా డాక్టర్ కె.మధుకర్‌రావును నియామిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2007లో బయోకెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులుగా మధుకర్‌రావు నియమితులు కాగా, ఇప్పటివరకు 30 పరిశోధన పత్రాలను ప్రచురించారు. మధుకర్‌రావు నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.



నేటి నుంచి తపాలా ఉద్యోగుల జాతీయ మహాసభలు



మాట్లాడుతున్న బొద్దున వెంకటేశ్వర్లు

వడ్డేపల్లి, మార్చి 1: కాజీపేట ఫాతిమానగర్‌లోని బాల వికాస కేంద్రంలో అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం 12వ జాతీయ మహాసభలను ఈ నెల 2, 3, 4 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆహ్వాన సంఘం ప్రతినిధులు కర్ర యాదవరెడ్డి, కాయిత ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. ఈ మహాసభల్లో ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ మహాదేవయ్య తదితరులు హాజరవుతారని, తపాలా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఆహ్వాన కమిటీ ప్రతినిధులు దారం జనార్ధన్, మర్రి కొమురారెడ్డిలు పాల్గొన్నారు.

ట్రస్మా నుంచి పలువురి బహిష్కరణ

వడ్డేపల్లి, మార్చి 1: సంఘానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కారణంగా తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) నుంచి పలువురిని బహిష్కరించినట్లు ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెమురుకొమ్ముల రమేష్‌రావు తెలిపారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జున రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అడ్వయిజర్ కె.భూపాల్‌రావు మాట్లాడారు. గురువారం హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాకు చెందిన అసోసియేషన్ నాయకులు సంఘ నిర్ణయానికి వ్యతిరేకంగా వ్యవహరించడంతోపాటు అసోసియేషన్ నాయకులపై దుర్భాషలాడారని అన్నారు. సంఘానికి వ్యతిరేకంగా వ్యవహరించిన జిల్లాకు చెందిన ఎస్. వెంకటేశ్వర్‌రావు, ఎ.శ్యామ్, కె.శ్రీధర్, ఎ.వీరస్వామి, బి.రవి, జ్ఞానేశ్వర్‌సింగ్‌లను ట్రస్మా నుంచి బహిష్కరించినట్లు చెప్పారు. వీరికి ఇప్పటి నుంచి సంఘంతో ఎటువంటి సంబంధం ఉండబోదని తెలిపారు. ఈ సమావేశంలో ట్రస్మా జిల్లా నాయకులు రాధాకృష్ణ, అశోక్ కుమార్, రాజేందర్, నర్సయ్య అనిల్‌కుమార్, బి.కనకయ్య, విలియం, వెంకటేశ్వర్లు, హరికుమార్ పాల్గొన్నారు.

టీఎల్‌ఎం ద్వారా ఉత్తమ బోధన

ఐనవోలు, మార్చి 1: టీఎల్‌ఎం ద్వారా ఉత్తమ బోధన జరుగుతుందని మండల నోడల్ అధికారి పి.ఆనందం తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐనవోలు ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ప్రగతి పరిశీలన చేసి సలహాలు, సూచనలు అందించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూశారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్ బాగా ఉండాలంటే ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు మధుకర్, మహేందర్, భీమాళ్ళ సారయ్య, లక్ష్మయ్య, మహేందర్‌రెడ్డి, సీఆర్పీ రేవతి, భవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

ఐనవోలు, మార్చి 1: ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒక రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్‌ఎంగా యాకర నవ్యశ్రీ, తెలుగు టీచర్లుగా ఎం.అవంతిక, బి.న్యాన్సి, ఇంగ్లీష్ టీచర్‌గా బేబి, గణిత టీచర్లుగా ఇ. విష్ణువర్ధన్, టి. కావేరి, ఈవీఎస్ టీచర్లుగా రిషిక్, కోటి, పీఈటీగా టి. చరణ్‌లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చుంచుకాల లింగారావు, ఉపాధ్యాయురాలు ఉమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

▸▸ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాజీపేట 61వ రోడ్డులో డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట టౌన్, మార్చి 1: వరంగల్ కాజీపేట అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. కాజీపేట 61వ డివిజన్‌లోని కేయూ 100 ఫీట్ల రోడ్డులో చేపట్టిన డ్రెయినేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. రూ.కోటి యాభై లక్షలతో ఈ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు లోటస్ అపార్ట్‌మెంట్‌వాసులతో పాటు స్థానిక ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, సాగరికరావు, ఏ.నాగరాజు, రమేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుంటుబానికి ఆర్థిక సాయం

వరంగల్ 47వ డివిజన్ బోడగుట్టకు చెందని సింగారపు పలనికుమార్ ఇటీవల దసరా ఉత్సవాల కోసం డెకరేషన్ ఏర్పాట్లు చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వైరు తాకి విద్యుదాఘాతంతో మృతి చెందాడు విషయం తెలిసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్ నుంచి రూ.4లక్షల చెక్కును శుక్రవారం బాధితుడి తండ్రి సింగారపు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, కార్పొరేటర్ సమ్మద్ విజయశ్రీరజాలి, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, బంక సంపత్‌యాదవ్, నకుంజన్, మానస, మధు, రమేష్, నాగరాజు, ఓబుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక అంశాలపై అందరిలో అవగాహన పెంపొందించాలి

కేయూ క్యాంపస్: ఆర్థిక అంశాలపై అందరిలో అవగాహన కల్పించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం హనుమకొండ కేడీసీ కామర్స్ విభాగం నేతృత్వంలో 'ఫిన్‌టెక్ ద ఇంక్లూజివ్ స్ట్రాటజీ ఫర్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై సదస్సులో సంచికను ఆవిష్కరించి మాట్లాడారు. పాఠశాల స్థాయిలో ఆర్థిక అక్షరాస్యతపై పాఠ్యాంశాలను రూపొందిస్తే భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతోందని చెప్పారు. రూ.10లక్షల విలువైన ఫర్నిచర్‌ను ఇస్తానని ప్రకటించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ కట్ల రాజేందర్, సోమిరెడ్డి, భాస్కర్‌రావు, మల్లయ్య రమేశ్, వినోద్‌రావు, లింగారెడ్డి, పావని, సుజాత, ఝాన్సీరాణి, రాజీరు, నవీన్, స్వర్ణలత, సునిత రాణి, బాల చందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిక

వడ్డెపల్లి, మార్చి 1 : హనుమకొండ కుమార్‌పల్లి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బింగి శ్రీనివాస్‌తో పాటు కొత్త రవి, ఉడుతల బాబురావులు శుక్రవారం హనుమకొండ పట్టణంలో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రలో బీజేపీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి బీజేపీలో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే ఒంటేరు జయపాల్, బీజేపీ నేత జలగం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

- మడికొండ: మడికొండకు చెందిన బీఆర్ఎస్ నేత దువ్వ నవీన్ శుక్రవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా నగరానికి వచ్చిన అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ సమక్షంలో హనుమకొండలో దువ్వ నవీన్, పలువురు యువకులు శుక్రవారం పార్టీలో చేరగా వారికి కాషాయకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఆకుల శ్రీకాంత్, తౌటిరెడ్డి రవిందర్‌రెడ్డి, గడ్డం మహేందర్, బండ రాజు, ఎలకంటి సురేష్, కుక్కల రాకేష్, కొత్తకొండ రాకేష్, బల్సుకూరి శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

హనుమకొండ రూరల్, మార్చి 1: సదరం క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు ఈనెల 2వ తేదీన మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవచ్చునని డీఆర్‌డీవో నాగపద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో మధ్యాహ్నం 11 గంటల నుంచి స్లాట్స్ అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. సదరం క్యాంప్‌నకు హాజరయ్యే దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జర్నలిజంలో రవీందర్‌కు గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా పట్టా అందుకుంటున్న పారిపెల్లి రవీందర్

కేయూ క్యాంపస్, మార్చి 1: హనుమకొండకు చెందిన పారిపెల్లి రవీందర్ హైదరాబాద్ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జర్నలిజం విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. శుక్రవారం హైదరాబాద్ రవీందర్‌భారతి హాల్‌లో జరిగిన తెలుగు వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా పారిపెల్లి రవీందర్ బంగారు పతకాన్ని సాధించారు. 'వరంగల్ జిల్లా గ్రామీణాభివృద్ధిలో ప్రసార మాధ్యమాల ప్రభావం' అనే అంశంపై ప్రొఫెసర్ కడియాల సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో రవీందర్ రూపొందించిన పరిశోధన గ్రంథానికి డాక్టరేట్ పట్టాతో పాటు ఉత్తమ పరిశోధనగా ఎంపికైనందుకు విశ్వవిద్యాలయంలో బంగారు పతకాన్ని ఎంపిక చేయగా గవర్నర్ అందచేసి అభినందించారు. రవీందర్ జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కుర్చపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. బంగారు పతకంతో పాటు పీహెచ్‌డీ అందుకున్న రవీందర్‌కు కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టే భాస్కర్ అభినందనలు తెలిపారు.

మాదిగలు ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతారు..



మాట్లాడుతున్న పిడమర్తి రవి, డాక్టర్ బొల్లికొండ వీరేందర్ తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణకు మాటిచ్చి మాదిగలను మోసం చేస్తున్న బీజేపీకి మాదిగలంతా ఓటుతోనే బుద్ధి చెబుతారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం హనుమకొండలో మాదిగల జోడో యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ వీరేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పిడమర్తి రవి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మాదిగల చెప్పు, డప్పుల సాక్షిగా ఓడిస్తామని అన్నారు. గతంలో ఎన్నో బిల్లులు ప్రవేశపెట్టి నెగ్గిన బీజేపీ ఇప్పుడు ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు ఎందుకు పెట్టి ఆమోదించడం లేదన్నారు. మాదిగలకు న్యాయం చేయకపోతే బీజేపీకి తెలంగాణలో పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు.

డాక్టర్ బొల్లికొండ వీరేందర్ మాట్లాడుతూ.. మాదిగలకు మూడు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని అన్నారు. ఎంహెచ్‌పీఎస్ అధ్యక్షుడు మైస ఉపేందర్, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కలగడ్డ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణలోని అత్యధిక శాతం ఉన్న మాదిగలకు సీట్ల కేటాయింపులో అధిక ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ దళిత బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జల మల్లికార్జున, మహా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ బొర్రెల్లి సురేశ్, మాదిగ యూత్ జేఏసీ అధ్యక్షుడు నక్క మహేశ్, బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష ఇన్‌చార్జిలు కాడపాక రాజేందర్, దుప్పిటి కిశోర్, బరిగల బాబు, దార దేవేందర్, నమిండ్ల భాస్కర్, యాకయ్య, సురేశ్, నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించుకోవాలి

▸▸ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



ఐనవోలులో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

ఐనవోలు, మార్చి 1: దేశం కోసం నీతి, నిజాయితీతో పనిచేస్తున్న మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ప్రజా సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలో వనమాల కనపర్తి, వెంకటాపూర్, ఐనవోలు, పున్నేలు, పంథిని గుండా యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఐనవోలు తెలంగాణ తల్లి సెంటర్‌లో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీ అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలుచేస్తూ జనరంజక పాలనను అందిస్తున్నారని కొనియాడారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచ అగ్రదేశాల సరసన నిలిపిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం బీజేపీకి పట్టంకట్టడం ఖాయమన్నారు. తెలంగాణలో సైతం 17 స్థానాలు గెలుచుకొని దేశ అభివృద్ధి కోసం మోదీ వెంటనడుద్దామని పిలుపునిచ్చారు. వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని భారీ మెజారిటీతో గెలిపించుకుందామన్నారు.

ఈ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటిశ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చీటూరి అశోక్, విశ్రాంత ఐపీఎస్ అధికారి కృష్ణప్రసాద్, బన్న ప్రభాకర్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఇంచార్జి మురళీధర్‌గౌడ్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, మల్లాడి తిరుపతిరెడ్డి, హనుమకొండ జిల్లా కార్యదర్శి గుండేకారి కోటేశ్వర్ రావు, జిల్లా కోశాధికారి బొల్లేపల్లి మహేష్ గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, మాజీ కన్వీనర్ అర్షనపల్లి శ్రీరాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధనే అమరులకు నిజమైన నివాళి



అమరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు

వడ్డెపల్లి, మార్చి 1: వర్గీకరణ సాధనే మాదిగ అమరులకు నిజమైన నివాళులని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి మందకుమార్ మాదిగ అన్నారు. శుక్రవారం మాదిగ అమరవీరుల సంస్మరణ సమావేశం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. మాదిగ అమర వీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. జాతి అస్తిత్వం కోసం, ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించిన వీరులు ఎల్లప్పుడు మాదిగ సమాజం గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ నాయకులు జన్ను దినేష్ మాదిగ, బండారి సురేందర్, మంద చిన్న రాజు మాదిగ, చేతళ్ల శివ, రేణుకుంట్ల ఉమామహేష్, వెంకటస్వామి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

- ఎమ్మార్పీఎస్- టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మాదిగ అమర వీరుల సంస్మరణ సభను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి అమరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్- టీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు మేడ స్వామి, దేవరకొండ సదానందం, సిలువేరు సుధాకర్, జన్ను సంజీవ్, కొడవటి తిరుపతి, గిన్నారపు అనిల్‌కుమార్, అరూరి రాకేష్, మహేందర్, సుదన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన గ్రంథాలు భవిష్యత్ తరాలకు పునాది



సత్కారం అందుకున్న విద్యార్థులతో పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్యా బాబు రావు

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పరిశోధక గ్రంథాలు భవిష్యత్ తరాలకు పునాది అని తెలుగు విశ్వవిద్యాయం జానపద గిరిజన విజ్ఞాన పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు అన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం సందర్భంగా పట్టాలు అందుకున్న వరంగల్ జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్యార్థులను శుక్రవారం వరంగల్ హంటర్‌రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ఘనంగా సత్కరించారు. శాలువాలు కప్పి సత్కరించారు. అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ భూక్యా బాబురావు మాట్లాడుతూ.. పీఠంలోని పరిశోధక విద్యార్థులు నక్కల, కోయ, పట్టెడ తెగ, మల్లన్న జాతరలు, వేదోక్త బ్రాహ్మణుల జీవిత చక్రసంబరాలు వంటి అంశాలపై పరిశోధనలు చేశారని, వారి సిద్ధాంత గ్రంథాలను పుస్తక రూపంలో తీసుకురావాలని సూచించారు. సత్కారం పొందిన వారిలో విద్యార్థులైన డాక్టర్ కత్తి మల్లయ్య, డాక్టర్ గంపా సతీష్, ఎంఫిల్ విద్యార్థిని కుంజా వరలక్ష్మి పీహెచ్‌డీ విద్యార్థి వైజయంతుల శ్రీరాములు, ఎంఫిల్ విద్యార్థి బానోతు కవిత, పి.మహేష్, ఈసం గౌరయ్య ఉన్నారు. వీరంతా మొన్న హైదరాబాద్‌లో జరిగిన తెలుగు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా పట్టాలు, గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరెపల్లి రవికుమార్, డాక్టర్ బాసాని సురేష్, పీఠం సిబ్బంది, పూర్వ విద్యార్థులు రాజు, నరసింహ, పాషా, సిద్దిపేట నుంచి వచ్చిన నక్కల తెగ ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టుటైమ్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలి

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూ పరిపాలన భవనం ఎదుట శుక్రవారం పార్టుటైమ్ అధ్యాపకులు ఐదో రోజు నిరసన ప్రదర్శనలు సాగించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వై.రాంబాబు, డాక్టర్ దేవోజీనాయక్, జనరల్ సెక్రటరీ డాక్టర్ నరేందర్‌నాయక్, డాక్టర్‌మాధవి, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ పరహ ఫాతిమా, డాక్టర్ టి.సమత, డాక్టర్ ప్రగతి, డాక్టర్ జోస్న, డాక్టర్ సరిత, డాక్టర్ సరిత, నవీన్, సంజీవ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం కేయూ ప్రధాన గ్రంథాలయం ఎదుట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అలువాల కార్తీక్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భీమా వినయ్‌కుమార్, సెహ్వాగ్, రాహుల్ వర్ధన్, దారవత్ మహేశ్, ఎమ్డీ పయాజ్, కేయూ స్టూడెంట్స్ రంజిత్,రమేశ్, వరుణ్, కద్రోజు, యేసుదాసు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళులు

కేయూ క్యాంపస్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ ఉద్యమ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు శుక్రవారం కేయూ మొదటి గేటు వద్ద ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి, వర్సిటీ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు కుమ్మరి శ్రీనాథ్‌ల నేతృత్వంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల మురళి, హరీశ్, గణేశ్, లడే రవికుమార్, మాసు శ్రీకాంత్, ప్రణయ్, జనార్ధన్, కోయడ సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల నూతన కార్యవర్గం ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 1: తెలంగాణ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోషియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటైంది. అధ్యక్షులుగా బొజ్జ సూర్యనారాయణరెడ్డి, కార్యనిర్వహక అధ్యక్షులుగా శ్రీధర్‌రావు, పరమేశ్, ఉపాధ్యక్షులుగా నారాయణగౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పూర్వ అధ్యక్షుడు ప్రకాశ్, గింజల రమణారెడ్డి, సుందర్‌రాజ్, కార్యదర్శులు హరిస్మరణ రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలతోపాటు రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీ కార్యవర్గ ప్రతినిధులు హాజరయ్యారు.

కేయూ నూతన అధికారుల బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూలో శుక్రవారం నూతన ఆర్ట్స్ విభాగాల డీన్, తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్‌తో పాటు ఇతర పరిపాలన అధికారులు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన డీన్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతికి కేయూ అధ్యాపకులు డాక్టర్ మంజుల, పద్మజ, డాక్టర్ కొట్టే భాస్కర్, డాక్టర్ మంద భాస్కర్, కల్లెపల్లి ప్రశాంత్, జాటోత్ స్వామి, డాక్టర్ టి.సునీత తదితరులు పుష్పగుచ్ఛాలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వర్ణ పతక విజేతలకు అభినందనల వెల్లువ

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 1: జాతీయస్థాయి జూనియర్స్ బాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో స్వర్ణ పతకం సాధిండంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన క్రీడాకారులను తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సాంబశివరావు అభినందించారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 25 వరకు బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన జాతీయస్థాయి జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలలో రాష్ట్ర జట్టు తరుపున ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎస్.భవీల్య, కె.రవళి పాల్గొని అత్యుత్తమ ప్రతిభతో రాణించి జట్టు విజయంలో కీలక భూమిక పోషించారు. ఈ మేరకు జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులు భవిల్య, రవళిలను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాంబశివరావు హనుమకొండలోని తన నివాసగృహంలో శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేసన్ బాధ్యులు రాజేందర్, డాక్టర్ రతన్‌సింగ్, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమరులకు నివాళులు

ఐనవోలు, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులను స్మరిస్తూ శుక్రవారం ఐనవోలు అంబేద్కర్ సెంటర్‌లో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణమాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధించుకుని అమరవీరులకు శాంతిని చేకూర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చింత అశోక్‌మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు సిగారపు మాణిక్యం, జిల్లా, మండల నాయకులు కట్కూరి ప్రవీణ్ మాదిగ, సింగారపు స్వామి, ఇస్రం బాబు, ఇల్లందుల కొంరయ్య, చింత శ్రీనివాస్, సంద్ర భిక్షపతి, వెంకన్న, చింటూ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన

ఐనవోలు, మార్చి 1: ధరణి సమస్యల దరఖాస్తుల పరిశీలనను రెవెన్యూ అధికారుల చేపట్టారు. మండల వ్యాప్తంగా 474 దరఖాస్తులు రాగా, వీటిని ఈ నెల 9 వరకు పరిశీలించి కలెక్టర్‌కు పంపించనున్నట్లు తహసీల్దార్ విక్రమ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒకొక్క బృందంలో ఆరుగురు ఉద్యోగులు ఉన్నారు. మూడు బృందాలకు తహసీల్దార్ విక్రమ్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ అనిల్‌కుమార్ నేతృత్వం వహించనున్నారు. శనివారం నుంచి గ్రామాల వారీగా వెళ్లి దరఖాస్తులను విచారించనున్నారు.

బల్దియా స్వచ్ఛ ఆటోడ్రైవర్‌కు పలువురి పరామర్శ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), మార్చి 1: ములుగు గట్టమ్మ ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బల్దియా స్వచ్ఛ ఆటోడ్రైవర్ బొట్ల దేవస్వామిని కార్మిక సంఘాల ప్రతినిధులు పరామర్శించారు. మేడారం జాతరలో విధులు నిర్వహించి తిరిగి వస్తుండగా జరిగిన ప్రమాదంలో దేవస్వామి గాయపడ్డారు. శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి వెళ్లి దేవస్వామి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. దేవస్వామికి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని బల్దియా సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్‌ను కోరినట్లు కార్మిక సంఘాల ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు రాజారపు భాస్కర్, మున్నంగి రఘు, బరుపట్ల మహేశ్, బాబు, బొట్ల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ రాక

హనుమకొండ సిటీ, మార్చి 1 : కాంగ్రెస్ తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి, ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ శనివారం వరంగల్ రానున్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. వరంగల్ లోక్‌సభ ఎలక్షన్ ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి కూడా ఆమె వెంట వస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 2 మార్చి 2024



పోషకాహారం తీసుకుంటున్నా ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరిస్తోందా? అయితే అలసటకు లోనుకాకుండా చేసే ఈ 'పవర్ స్నాక్స్' ట్రై చేయండి.

'పవర్ స్నాక్స్'!

వంటిల్లు

రాగి బిస్కెట్లు

వంద గ్రాములు రాగుల్లో 330 కేలరీల శక్తి ఉంటుంది. రాగుల్లోని క్యాల్షియం బుద్ధి బలాన్ని పెంచుతుంది. కాబట్టి సుగర్‌లెస్ ఈవినింగ్ స్నాక్‌గా రాగి బిస్కెట్లు ఇవ్వవచ్చు. వీటిని ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు:

రాగి పిండి - 1 కప్పు, యాలకుల పొడి - అర టీస్పూను
సొంఠి - చిటికెడు, గుడ్డు - 1
ఉప్పు - అర చెంచా, రైస్ బ్రాన్, ఆయిల్ - అర కప్పు

తయారీ విధానం:

- రాగి పిండి, యాలకుల పొడి బాండీలో వేసి నూనె లేకుండా రెండు నిమిషాలపాటు వేయించాలి.
- ఇప్పుడు గుడ్డు, సొంఠి, ఉప్పు వేసి కలపాలి.
- చివర్లో నూనె వేసి ముద్దలా కలపాలి.
- ఈ ముద్దను చిన్న ఉండలుగా చుట్టి, గుండ్రంగా బిస్కెట్లుగా వత్తుకోవాలి. ఈ బిస్కెట్లను బటర్ పేపర్ వేసిన ట్రేలో పరుచుకోవాలి.
- ఓవెన్‌ను ప్రీ హీట్ చేసుకోవాలి. 180 డిగ్రీల దగ్గర 8 నిమిషాలపాటు బేక్ చేసి తీయాలి.

ఖర్జూర లడ్లు

కావలసిన పదార్థాలు:

ఖర్జూరాలు - 1 కప్పు, పచ్చి కొబ్బరి - అర కప్పు
జీడిపప్పు - 1 కప్పు, కొబ్బరి నూనె - రెండు టీస్పూన్లు



ఖర్జూరంలో విటమిన్ బి6, రాగి, మెగ్నీషియం ఉంటాయి. జీడిపప్పులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఎదిగే పిల్లల బుద్ధి బలానికి ఎంతో అవసరం. కాబట్టి వీటినెలా తయారు చేయాలంటే....

తయారీ విధానం:

- ఖర్జూరాలను విత్తనాలు తీసి గంటపాటు నీళ్లలో నానబెట్టాలి.
- తర్వాత ఆరబెట్టి పక్కనుంచాలి.
- జీడిపప్పులో కొబ్బరి కలిపి, బ్లెండ్ వేయాలి.
- దీన్లోనే ఖర్జూరాలు, కొబ్బరి నూనె కూడా వేసి మళ్లీ బ్లెండ్ చేయాలి.
- ఇలా తయారైన చిక్కని మిశ్రమాన్ని ఉండలు చుట్టాలి.
- వీటిని ఫ్రిజ్‌లో చల్లబరిచి పిల్లలకు ఇవ్వాలి.

జొన్న వడ

చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి జొన్నలు. గ్లూటేన్ లేని సురక్షితమైన పోషకాహారంగా వీటిని పరిగణించవచ్చు. శరీరానికి సరిపడా మాంసకృత్తులు, పీచుపదార్థం జొన్నల ద్వారా పొందవచ్చు. ఒక కప్పు జొన్నల్లో 12 గ్రాముల ఫైబర్ ఉంటుంది. పిల్లలకు రోజుకి అవసరమైన పీచులో ఇది 48%. కాబట్టి జొన్న వడలను మార్నింగ్ లేదా ఈవినింగ్ స్నాక్‌గా పిల్లలకు ఇవ్వాలి. వీటిని ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు:

జొన్న పిండి - 1 కప్పు
శనగపిండి - అర కప్పు
అల్లం తురుము - అర టీస్పూను
వెల్లుల్లి తరుగు - 1 టీస్పూను
పెరుగు - 1 కప్పు
ఉప్పు, కారం, పసుపు - సరిపడా
నీళ్లు - తగినన్ని
నువ్వులు - 2 టీస్పూన్లు
నూనె - వేపుడుకు సరిపడా



తయారీ విధానం:

- పైన చెప్పిన పదార్థాలన్నీ టినీ గిన్నెలో వేసి నీళ్లు చేర్చి ముద్దలా కలుపుకోవాలి.
- గుండ్రంగా వడలు చేసుకుని పక్కన పెట్టుకోవాలి.
- బాండీలో నూనె పోసి వడలను ఎర్రగా వేయించుకోవాలి.
- కొబ్బరి లేదా అల్లం చట్నీతో వేడిగా వడ్డించాలి.

మేకప్

బ్యూటిఫుల్ బాడీ కోసం...

మేకప్ ముఖానికే పరిమితం చేస్తే, మరి చేతులు, పాదాల పరిస్థితేంటి? మన ముఖంతో పాటు శరీరం కూడా ఆకర్షణీయంగా కనిపించాలంటే బాడీ మేకప్ ఎంచుకోవాలి.

చర్మం నునుపుగా మెరుపులీనుతూ కనిపించేలా చేసే ఈ బాడీ మేకప్ పూర్తిగా శరీరానికే పరిమితం. పొట్టి దుస్తులు ధరించినా, ఆకర్షణీయమైన మేజోళ్లు ధరించినా, టాప్‌లెస్ డ్రస్సులు ధరించినా ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండడం కోసం సెలబ్రిటీలు ఈ బాడీ మేకప్‌ను ఎంచుకుంటూ ఉంటారు.

- **రెండింటికీ తేడా:** ముఖానికి వేసుకునే మేకప్ పలుచగా, ఎక్కువ మెరుపును కలిగి ఉంటుంది. బాడీ మేకప్ మందంగా ఉండడంతో పాటు, పిగ్మెంట్‌ను కూడా కలిగి ఉంటుంది.
- **దుస్తులకు అంటుకోదు:** ముఖానికి మేకప్ వేసుకుంటే పొరపాటున చెరిగిపోతుందేమోనని కంగారు పడుతూ ఉంటాం. కానీ బాడీ మేకప్ అలా కాదు. ఇది దుస్తులకు అంటుకోదు. అయితే ఎక్కువగా చమట పట్టే తత్వం ఉన్నవాళ్లు మేకప్ చెరిగినా దుస్తులకు అంటుకున్నట్టు కనిపించకుండా ఉండడం కోసం లేత రంగు దుస్తులను ధరించడం మేలు.



ఇలా ఎంచుకోవాలి

- ఫేసియల్ మేకప్ ఐటమ్స్‌ను ఎంచుకునేటప్పుడు అనుసరించే నియమాలనే బాడీ మేకప్ ఎంచుకునేటప్పుడు కూడా అనుసరించాలి. బాడీ మేకప్‌లో భాగంగా ఎంచుకునే ఫౌండేషన్లు, కన్‌సీలర్లూ నాణ్యమైనవే అయి ఉండాలి.
- చర్మపు రంగుకు దగ్గరగా ఉండే బాడీ మేకప్ ఎంచుకోవాలి. లేత గులాబీ రంగు చర్మం కలిగినవాళ్లు, బీజ్, క్రీమ్ షేడ్స్ ఎంచుకోవాలి. ఐవరీ, బఫ్, ట్యాన్ బాడీ షేడ్స్ కూడా బాగుంటాయి.
- బాడీ బ్రాంజర్లు, బాడీ హైలైటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చర్మపు రంగుకు దగ్గరగా ఉండేవాటినే ఎంచుకోవాలి.
- ఆయిల్ ఫ్రీ, వాటర్ ప్రూఫ్... ఈ రెండు పేర్లు ఉన్న వాటినే ఎంచుకోవాలి.

మేకప్‌కు ముందు

- చర్మానికి నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.
- పగుళ్లు, గాయాలు లాంటివి లేకుండా చూసుకోవాలి.
- మానిక్యూర్, పెడిక్యూర్ చేయించుకోవాలి.
- బాడీ స్క్రబ్బింగ్ లేదా బాడీ పాలిషింగ్‌తో చర్మం మరింత మెరుస్తుంది.
- వ్యాక్సింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DtzukOV లో చదవండి.

సెలబ్ ఫిట్

కెరీర్‌కు శ్రీకారం చుట్టింది తెలుగులోనే అయినా... 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో **దిశా పటానీ** స్టోరీనే మారిపోయింది. ఆ చిత్రం ఇచ్చిన విజయం... వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. నాజూకైన రూపం.. గమ్మత్తయిన చూపులు.. దిశ అభిమానుల హృదయ సామ్రాజ్ఞి అయింది. 'ఇప్పుడు మీరు చూస్తున్న నా ఈ రూపం రాత్రికి రాత్రి వచ్చింది కాదు. దాని వెనుక కొన్నేళ్ల శ్రమ ఉంది' అంటున్న దిశ 'వర్కవుట్' ఇది..



దిశ.. మెరుపుతీగలా

వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన 'లోఫర్' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది దిశా పటానీ. మరుసటి ఏడాదే మంచి బ్రేక్ వచ్చింది. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ జీవిత కథ ఆధారంగా తీసిన 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో సుశాంత్‌సింగ్ రాజ్‌పుట్ సరసన నటించిన దిశ... ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయింది. బాలీవుడ్‌లోనే కాకుండా ఓ చైనీస్ చిత్రంలోనూ అవకాశం దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్ బరేలీలో పుట్టిన దిశ... అమినిటి యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందింది. ఆమె తండ్రి జగదీశ్‌సింగ్ పోలీస్ అధికారి. తల్లి హెల్త్ ఇన్‌స్పెక్టర్. అక్క కుష్బూ భారత సైన్యంలో లెఫ్టినెంట్. తమ్ముడు సూర్యాంశ్. గ్లామర్ ప్రపంచం మీద ఉన్న ఆసక్తితో అందాల పోటీల్లో పాల్గొంది. హీరో టైగర్ ష్రాఫ్‌తో కలిసి ఓ మ్యూజిక్ వీడియోలో నటించిన దిశ... ఆ తరువాత అతనితో కలిసి 'భాగీ2', 'భాగీ3' చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగు చిత్రాలు ఉన్నాయి. వాటిల్లో ఒకటి ప్రభాస్‌తో, మరొకటి తమిళ హీరో సూర్యాతో నటిస్తోంది. ఈ రెండూ భారీ బడ్జెట్ సినిమాలు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పుడూ అభిమానులతో టచ్‌లో ఉండే ఆమెకు ఫాలోయింగ్ కూడా తక్కువేం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరు కోట్ల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. పని ఒత్తిడిలో ఎంత బిజీ అయినా... వ్యాయామానికి మాత్రం విరామం ఇవ్వదు ఈ బ్యూటీ. ఎందుకంటే అదే తనను ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచుతుందంటుంది.

ఇదీ మెనూ...

'నా డైట్ చాలా సింపుల్. పోషక విలువలు, పిండి పదార్థాలు గల ఆహారం తీసుకొంటాను. పోషకాహారం అంటే... కూరగాయలు, చికెన్, గుడ్లు వంటివి. చపాతీ లేదా అన్నంతో తింటాను. ఏం తిన్నా అందులో పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి. వారాంతాల్లో ఎప్పుడైనా నాకు నచ్చినవన్నీ లాగించేస్తాను' అంటున్న దిశకు స్వీట్స్ బాగా ఇష్టం. పాన్ కేక్, ఐస్‌క్రీమ్స్ తెగ తింటుంది.

- ఉదయం వ్యాయామానికి ముందు గుడ్లు
- జిమ్ నుంచి రాగానే చికెన్/ గుడ్లు/ పన్నీర్‌తో కూడిన పోషకాహారం
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్‌తో పాలు లేదా మరేదైనా అల్పాహారం
- మధ్యాహ్నం సాధారణంగా బ్రౌన్ రైస్‌తో చికెన్
- రాత్రిపూట పోషకాలు పుష్కలంగా ఉండేవి చికెన్, గుడ్లు, సలాడ్స్ అప్పుడప్పుడు బ్రౌన్ రైస్
- స్నాక్స్ సమయంలో పండ్లు, పండ్ల రసాలు, బాదం, పీనట్స్ బాయిల్డ్ చికెన్

'మనం చేసే పని ఎంత ముఖ్యమో, నిద్ర కూడా అంతే ముఖ్యం. అందుకే కనీసం రోజుకు ఎనిమిది గంటలు నిద్ర పోతాను. రాత్రి త్వరగా పడుకుని, ఉదయం త్వరగా లేస్తాను'.

వర్కవుట్ ఇలా...

'క్రమం తప్పని వ్యాయామం, మితంగా ఆహారం... పర్‌ఫెక్ట్ ఫిజిక్ కావాలంటే ఇవే ప్రధానం. ఎప్పుడూ వర్కవుట్స్ కాకుండా రెగ్యులర్‌గా కొన్ని స్టంట్స్, నాట్యం కూడా చేస్తుంటాను. వాస్తవానికి నాకంటూ ఓ ఫిట్‌నెస్ మంత్రా అనేది లేదు. కానీ... రోజూ జిమ్‌లో కష్టపడతాను. అందరినీ నేను కోరేది ఏంటంటే... ఉదయం లేవగానే ముందు మంచం దిగండి. బయటకు వెళ్లండి. రన్నింగ్, జాగింగ్, జిమ్, డ్యాన్స్... ఏది నచ్చితే అది చేయండి. అప్పుడప్పుడు కాకుండా... ఏదైనా సరే దైనందిన జీవితంలో భాగం కావాలి. అన్నింటి కంటే ముఖ్యంగా ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవాలి. మనం ఎలా కనిపిస్తున్నామన్నదే కాదు... ఎంత ఆరోగ్యంగా, ఎంత సంతోషంగా ఉన్నామన్నది కూడా ముఖ్యం. నిత్యం వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లవల్ల ఇప్పటికిప్పుడు మీలో మీకు మార్పు కనిపించకపోవచ్చు. కానీ కొన్నేళ్ల తరువాత అది మీ జీవితాన్నే మార్చేస్తుంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది దిశ. సాధ్యమైనంతవరకు ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళుతుంది. ఇష్టంతో కష్టపడుతుంది.



- ఉదయం జిమ్‌కు వెళ్లగానే ముందుగా కార్డియో ఎక్సర్‌సైజ్‌లుంటాయి.
- ఆ తరువాత శారీరక దారుఢ్యం కోసం లైట్‌వెయిట్, కొన్ని రోజులు హెవీవెయిట్ ట్రైనింగ్.
- వ్యాయామాలతో పాటు రకరకాల యాక్టివిటీస్ కూడా ఉంటాయి. చేతులు, కాళ్లూ బలంగా తయారవడం కోసం, చువ్వలా ఫ్లెక్సిబిలిటీ కోసం జిమ్నాస్టిక్స్ సాధన.
- వీటితోపాటు సమయాన్ని బట్టి కిక్ బాక్సింగ్, డ్యాన్స్. 'నాట్యంతో మనసు పరవశిస్తుంది. రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. నా ఫిట్‌నెస్ మెనూలో డ్యాన్స్ అతి ముఖ్యమైనది'.
- మనసిక ప్రశాంతతకు కనీసం అరగంట యోగా
- ఒకవేళ బరువు పెరిగితే... ఆ రోజు కసరత్తుల తీవ్రత ఇంకాస్త పెరుగుతుంది.
- ఏ కారణంగానైనా జిమ్‌కు వెళ్లలేకపోతే... ఇంట్లోనే ఓ గంట ట్రెడ్‌మిల్

'మన శరీరాన్ని సరైన ఆకృతిలో పెట్టుకోవడం... ఫిట్‌గా ఉండటం అందరికీ అవసరం. అప్పుడే ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండగలుగుతాం.'



దధిక్షీరే సమేపక్త్వా త్వర్ధభాగావశేధితె!
అష్టమాంశాన్ క్షిపేత్తత్ర తండులాన్నిస్తుచాన్ స్థిలాన్!
ప్రియాలపనసాబ్జానాం మజ్జాం మాత్రాసమాం క్షిపేత్!
క్షీరాదర్ధ ఘృతం చైవ శర్కరాం చ తథాన్యసేత్!
సిద్ధే త్రికటుకోపేతః కర్పూరేణాధివాసితః!
ఏవిష విష్యందనోనామ దేవలోకేపి దుర్లభః!
యస్మిన్ పక్వేపిహి ఘృతం స్యందతె సర్వతోముఖమ్!

విష్యందనం అనే పాయసం

'విష్యందనం' అనే పాయసం దేవతలకు కూడా దొరకదంటూ దీని తయారీని వివరించాడు క్షేమశర్మ. 'విష్యందనం' అంటే చుక్కలు చుక్కలుగా పడేదని, ప్రవహించేదని అర్థాలు. ఇప్పుడు మనం వండబోయేది అలా ఉండాలన్నమాట. ఇది గుండెకి మంచిదని, బలకరమైనదని, పిల్లలకు పెడితే ఎదుగుదల బావుంటుందనీ, పురుషుల్లో జీవకణాలు పెరుగుతాయనీ, వాతాన్ని, వేడినీ తగ్గిస్తుందనీ దీని ప్రభావాన్ని తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు క్షేమశర్మ.

పాయసానికి ఇవి సాధారణ గుణాలే! కానీ విష్యందనం తక్కిన పాయసాలకన్నా ప్రత్యేకమైంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.

- ఒక కప్పు పాలు, అదే గ్లాసుతో మజ్జిగ తీసుకోండి. రెండింటినీ కలిపి సన్నసెగన బాగా కలుపుతూ మరిగించాలి. సగానికి సగం మరిగేంతసేపు దగ్గరే ఉండి కలుపుతూ ఉండాలి.
- ఇప్పుడు అదే కప్పులో నాలుగో వంతు దంపుడు బియ్యం లేదా పట్టు తక్కువ బియ్యం ఈ మరుగుతున్న పాలలో కలపండి. పావు కప్పు పొట్టు తీసిన నువ్వుపప్పు కూడా అందులో కలపండి. ఇవి రెండూ 3-4 చెంచాలకన్నా ఎక్కువ పట్టవు.
- పాలలో బియ్యం, నువ్వుపప్పు చక్కగా ఉడికి మెత్తగా అన్నం తయారవుతుంది. ఇది ఒక విధంగా చక్కెరపొంగలి లాంటిదే.
- ఇందులో అదే కప్పులో సగం నెయ్యి, సగం పంచదార కలిపి ఉడికించండి.
- చక్కగా ఉడికిన తరువాత అందులో శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడిని తగినంత కలపండి.



- స్టవ్ ఆర్పేశాక కొద్ది సేపు ఆగితే ఈ విష్యందనం చల్లారుతుంది. అప్పుడు చిటికెడంత పచ్చకర్పూరం కలిపితే పరిమళభరితంగా ఉంటుంది.

ఇలా తయారైన విష్యందనంలో జీర్ణకోశాన్ని బాగు చేసి, జీర్ణశక్తిని పెంచే గుణమే ప్రధానంగా ఉన్నదని క్షేమశర్మ పేర్కొన్నాడు.

పాలలో మజ్జిగని గానీ, మజ్జిగలో పాలు గానీ కలిపి తీసుకోకూడదని, అది విరుద్ధాహారం అవుతుందని ఆయుర్వేద శాస్త్రం చెప్పింది. మజ్జిగ పులిసిందని, అందులో పాలు కలుపుకొని తినటం విరుద్ధాహారం అవుతుంది. పెరుగన్నం తినగానే పాలతో చేసిన ఐస్ క్రీమ్ తినటం విరుద్ధాహారం. పెరుగు ఆవడ తినగానే కాఫీయో టీయో తాగటం విరుద్ధాహారం.

కేవలం పాలతోనే ఈ విష్యందనాన్ని కాయవచ్చు కదా.. మధ్యలో ఈ మజ్జిగని కలపటం దేనికి అనే ప్రశ్నకి ఒక సమాధానం ఉంది. 'లాక్టో బాసిల్లై' అనే ఉపయోగపడే బాక్టీరియా కోసం మనం పెరుగుని, మజ్జిగనీ వాడుతున్నాం. ఈ లాక్టో బాసిల్లై పాలని... పెరుగులా మారుస్తుంది. లాక్టిక్ యాసిడ్ వలన ఆ పెరుగుకి పుల్లదనం కలుగుతుంది. పొయ్యి మీద కాచినందువల్ల మజ్జిగలోని ఈ బాక్టీరియా నశించిపోయినా, లాక్టిక్ యాసిడ్ అలానే ఉండిపోతుంది. పాలతో కాచిన పాయసంలో లేని లాక్టిక్ యాసిడ్... మజ్జిగ కలిపి కాచిన ఈ విష్యందనంలో ఉంటుంది. లాక్టిక్ యాసిడ్ శరీరానికి చాలా మేలు చేస్తుంది. కొన్ని రకాల పోషకాలు వంటబట్టేందుకు ఇది సహకరిస్తుంది. కొవ్వును తగ్గిస్తుంది. పేగులను బలపరుస్తుంది. కొన్ని రకాల కేన్సర్లకు కూడా ఇది ఔషధంగా పనిచేస్తుంది.

పాలు, మజ్జిగ కలిపి తయారు చేసిన వంటకాలు, పానీయాలు మనకు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు 'రసాల' అనే తీపి లస్సీని పాలు, మజ్జిగలను బాగా చిలుకుతూ తయారు చేస్తారు. ఉత్తరాదిలో దీని వాడకం ఎక్కువ. ఈ విష్యందనం కూడా అటువంటి వంటకమే.

పాలలో మజ్జిగ కలిపితే ఆ పాలు పెరుగులా తోడుకుంటాయి. మజ్జిగలో పాలు కలిపితే... ఆ మజ్జిగ కూడా పెరుగులా తోడుకుంటుంది. కానీ, పాలనూ మజ్జిగనూ కలిపి సగానికి మరిగేంతసేపు కాస్తే, మజ్జిగలోని ఉపయోగపడే బాక్టీరియా చచ్చిపోతుంది కాబట్టి, వాటితో వండిన పాయసం పెరుగులా తోడుకోదు. పాలు, మజ్జిగ కలిపి తయారు చేసిన స్వీట్ లస్సీ లేదా సాల్ట్ లస్సీ కూడా చేసిన వెంటనే తాగితే పెరుగులా తోడుకోదు. లేదా ఫ్రిజ్జులో పెట్టుకున్నా తోడుకోదు. మిల్క్ అండ్ బటర్‌మిల్క్ బిస్కట్స్ తయారు చేస్తున్నారు. నిమ్మరసం, పాలు కలిపి విరిగిన గుజ్జుతో రసగుల్లాలు చేస్తున్నారు.

ఆధునిక ఆహార శాస్త్రవేత్తలు, ఆయుర్వేద పండితులు విష్యందనం లాంటి వంటకాల తయారీ గురించి, వాటి ఆరోగ్య ప్రభావం గురించి సైన్సు పరంగా విశ్లేషించిన సందర్భాలు లేవు. ఎవ్వరూ ఇలాంటి ప్రజోపయోగకర అంశాలమీద దృష్టి సారించలేదు. క్షేమశర్మ 'క్షేమకుతూహలం' పరమ ప్రామాణిక గ్రంథం. అందులో ఈ విష్యందనం వంటకాన్ని... జీర్ణశక్తిని పెంచే ద్రవ్యాలలో ఒకటిగా పేర్కొన్నాడు.

• గంగరాజు అరుణాదేవి

సమ్మర్ కేర్



రోజురోజుకూ పెరుగుతున్న ఎండల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వైద్యులు. లేదంటే అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆ జాగ్రత్తలేంటంటే...

ఎండలో బయటకు వెళుతున్నారా..?

సమయానికి ఆహారం తీసుకోవాలి. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి. ఎండలో ఉద్యోగాలకు, ఆటలకు వెళ్లేవారైతే మరో లీటరు అదనంగా తీసుకోవాలి. అంటే చమట రూపంలో శరీరం నుంచి బయటకు పోయే నీటిని తిరిగి శరీరానికి అందించాలనమాట. దాని వల్ల హైడ్రేషన్ సాధారణ స్థాయిలో ఉంటుంది. బయటకు వెళ్లేవారు నల్ల కళ్లద్దాలు, గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి. వదులైన, కాటన్ దుస్తులు ధరించాలి. టైట్‌గా ఉండే జీన్స్, పాలిస్టర్‌లాంటి దుస్తులకు సాధ్యమైనంతవరకు వేసవిలో దూరంగా ఉంటే మేలు. అలాగే చాలామంది ఎండలో నుంచి ఇంటికి రాగానే స్నానం చేయడం, లేదంటే చల్లనీళ్లతో ముఖం కడుక్కోవడం, ఫ్రిజ్‌లో నుంచి నీళ్లు తీసుకొని తాగడం చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. ఎందుకంటే శరీర ఉష్ణోగ్రత ఎప్పుడూ బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలి. అలాకాకుండా ఒక్కసారిగా ఉష్ణోగ్రతలో మార్పు వస్తే శరీరం దాన్ని తట్టుకోలేదు. తలనొప్పి, జ్వరం, గొంతులో మంట లాంటి సమస్యలు వస్తాయి. బలహీనంగా, సున్నితంగా ఉన్నవారికైతే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం ముంచుకురావచ్చు. కనుక ఎండలో నుంచి ఇంట్లోకి రాగానే... శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చేవరకు రెండు మూడు నిమిషాలు విశ్రాంతినివ్వాలి. ఆ తరువాతనే నీళ్లు తాగడం కానీ, ముఖం కడుక్కోవడం కానీ చేయాలి. అదేవిధంగా గంటలతరబడి ఏసీలో కూర్చొని ఒక్కసారిగా ఎండలోకి వెళ్లడం కూడా సమస్యలను కొనితెచ్చుకోవడమే. క్రమంగా ఏసీని తగ్గించుకొని, కాసేపు ఏ బాల్కనీలోనో ఉండి, అప్పుడు బయటకు వెళ్లాలి.



మహేశ్ సినిమాపై రాజమౌళి క్లారిటీ

అగ్ర దర్శకుడు రాజమౌళి, మహేశ్ కాంబినేషన్‌లో వచ్చే సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని అభిమానులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా గురించి రకరకాల వార్తలు వస్తున్నాయి. ఏ చిన్న విషయమైనా క్షణాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా దర్శకుడు రాజమౌళి బళ్లారిలోని అమృతేశ్వర ఆలయ ప్రారంభోత్సవానికి కుటుంబసమేతంగా హాజరయ్యారు. అక్కడి రాజకీయ నాయకులతో మాట్లాడిన ఆయన మహేశ్‌తో తీస్తున్న సినిమా గురించి ప్రస్తావించారు. 'మహేశ్‌తో ఓ సినిమా చేస్తున్నా. ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. ఇంకా టైటిల్ ఖరారు కాలేదు' అని అన్నారు. షూటింగ్ ఎప్పటి నుంచో అనేది స్పష్టంగా చెప్పకపోయినా 'మహారాజ్' అనే టైటిల్ ఖరారు అయిందనే వార్తలపై ఆయన క్లారిటీ ఇచ్చినట్లయింది. భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కథను సంచలన రచయిత విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా దీనిని నిర్మిస్తున్నారు. మరోవైపు మహేశ్ ఈ సినిమా కోసం తన లుక్ మార్చుకున్నారు. ఆ సరికొత్త లుక్ ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అది చూసి అభిమానులు 'సూపర్' అంటూ ఎంతో మురిసిపోతున్నారు.



ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్

నితిన్ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. గత నెల్లో మున్నార్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన చిత్రబృందం గురువారం నుంచి మరో షెడ్యూల్ కోసం రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నారు. దీనికోసం భారీ సెట్ వేశారు. హీరోతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో అలరించనున్నారు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

వారాణసిలో మొదలైన ఓదెల 2



ఓటీటీలో విడుదలై విజయం సాధించింది 'ఓదెల రైల్వే స్టేషన్'. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి దర్శకుడు సంపత్‌నంది కథను అందించగా, అశోక్ తేజ దర్శకత్వం వహించారు. దీనికి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తమన్నా ప్రధాన పాత్రను పోషించే ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం వారాణసిలో మొదలైంది. పలు భాషల్లో థియేటర్లలోనే విడుదల చేస్తామని నిర్మాత మధు చెప్పారు. విజువల్ ఎఫెక్ట్స్ కు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. యూనిట్ విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ఆసక్తికరంగా, ఆధ్యాత్మికంగా ఉంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సౌందర్ రాజన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

మళ్లీ పుట్టినావా!



సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు స్వీయ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్మాత్మకంగా 8 భారతీయ భాషల్లో తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ పద్మావతి నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచగా.. ఇప్పుడు ఆ అంచనాలను రెట్టింపు చేయడానికి ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్ 'మళ్లీ పుట్టినావా' అంటూ సాగే గీతం విడుదలైంది. ఈ పాటకి సాబు వర్గీస్ మ్యూజిక్ అందించారు. వరికుప్పల యాదగిరి లిరిక్స్ రాసి ఆలపించారు ప్రస్తుతం సెన్సార్ కార్యక్రమాల్లో ఉన్న ఈ చిత్రం అతి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ట్రైలర్‌కు వస్తున్న స్పందన పట్ల చిత్ర దర్శకుడు ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో అందమైన ప్రదేశాల్లో చిత్రీకరణ జరుపుకొన్న ఈ చిత్రానికి సంబంధించిన విజువల్స్‌ను మీడియాతో పంచుకున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను త్వరలోనే నిర్వహించి రిలీజ్ డేట్ ప్రకటిస్తామని తెలిపారు. ఈ చిత్రం అందరికీ ఖచ్చితంగా నచ్చుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో నిహార్, నాగార్జున,రగ్గా ఇఫ్తాకర్ నటించారు. ఎడిటర్: వెలగపూడి రామారావు, డీవోపీ: కంతేటి శంకర్.

స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో ప్రేమకథ



నేషనల్ అవార్డ్ విన్నర్ నరసింహ నంది దర్శకత్వంలో వస్తోన్న చిత్రం '1920 భీమునిపట్నం'. కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో బ్రిటీష్ ప్రభుత్వపు పోలీస్ ఆఫీసర్‌గా కంచర్ల ఉపేంద్ర, స్వాతంత్ర్య సమరయోధుడి కుమార్తెగా అపర్ణా దేవి నటిస్తున్నారు. వీరిద్దరిపై తీసిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడారు. ఈ చిత్రంలోని సీతారామ్, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఆస్కార్ స్థాయికి తగ్గట్లు చిత్రీకరణ జరుపుతామని వివరించారు. సింగిల్ షెడ్యూల్‌లో హైదరాబాద్, రాజమండ్రి, భీమునిపట్నం, అరకు, ఊటీలలో షూటింగ్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. కొన్ని వాస్తవ సంఘటనలను ప్రేరణగా తీసుకుని చక్కటి భావోద్వేగాలతో తెరకెక్కిస్తున్నామని దర్శకుడు అన్నారు. పాత్రలన్నీ సహజసిద్ధంగా ఉంటాయని తెలిపారు. ఇళయరాజా సంగీతం ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని ఆయన చెప్పారు. తన కెరీర్‌లోనే ఇది విభిన్న చిత్రమవుతుందని నటుడు కంచర్ల ఉపేంద్ర అన్నారు. తెలుగు సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించే చిత్రంగా ఇది నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కెరీర్ తొలి దశలోనే నటనకు స్కోప్ ఉన్న మంచి చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నట్లు హీరోయిన్ అపర్ణా దేవి అన్నారు.ఈ చిత్రానికి సంగీతం:ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఎస్ మురళీమోహన్ రెడ్డి, ఎడిటింగ్:నాగిరెడ్డి,కళ:సురేశ్ భీమగాని, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత

కొత్త సినిమా లోగో విడుదల

నిర్మాత కంచర్ల అచ్యుతరావు, ఉపేంద్ర హీరోగా నటించే మరో కొత్త సినిమా 'విక్రమదాస్' చిత్రం లోగో ఈ సందర్భంగా విడుదల చేశారు. ఈ సినిమాకు బాలు దర్శకత్వం వహించనున్నారు.



తంత్ర శాస్త్రం నేపథ్యంలో

అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవి చైతన్య నిర్మిస్తున్నారు. మార్చి 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తాంత్రిక పూజల నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. అనన్య మాట్లాడుతూ 'నాకెరీర్‌లో ఇది ఉత్తమ చిత్రం అవుతుంది, ఇకపై అంతా నన్ను 'తంత్ర అనన్య' అని పిలుస్తారు' అని అన్నారు. హారర్‌తో పాటు రొమాన్స్, సెంటిమెంట్ ఉన్నాయని ధనుష్ చెప్పారు. మనం కోల్పోయిన తంత్రశాస్త్రం అనే విజ్ఞానాన్ని గురించి ఈ సినిమాలో చెప్పబోతున్నాం అని దర్శకుడు తెలిపారు.

'సాగు' చిత్రం నాకెంతో ప్రత్యేకం

నిహారిక



వంశీ తుమ్మల, హారిక బల్ల జంటగా నటించిన ఇండిపెండెంట్ ఫిల్మ్ 'సాగు' ఈ నెల నాలుగున ఓటిటీ వేదికగా విడుదల కానుంది. యశస్వి వంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'జీవితంలో ఎన్నో ఎదురుదెబ్బలు తగులుతుంటాయి. అధైర్యపడకుండా ఆశతో ముందుకు సాగాలని చెప్పే చిత్రం ఇది. నాకు ఈ సినిమా ఎంతో ప్రత్యేకం. నా జీవితంలో జరిగిన ప్రతి విషయంలోనూ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ అండగా ఉన్నారు. 52 నిముషాలు ఉన్న ఈ చిత్రాన్ని నాలుగు రోజుల్లో షూట్ చేశారు. ఇంత మంచి ప్రాజెక్ట్‌ను అందరి ముందుకు తీసుకు రావడం ఆనందంగా ఉంది' అన్నారు. రైతు గురించి చెప్పాలని సాగు చిత్రం తీశాననీ, సమస్య ఎటువంటిదైనా ఆత్మహత్య పరిష్కారం కాదని ఇందులో చెప్పామని దర్శకుడు వినయ్ రత్నం తెలిపారు. ఇందులో నటించే అవకాశం వచ్చినందుకు వంశీ, హారిక కృతజ్ఞతలు తెలిపారు.

అది చూసి అమ్మానాన్న ఉలిక్కిపడ్డారు

త్రిప్తి డిమ్రి

ఒకే ఒక్క సినిమాతో అందరి దృష్టిని ఆకట్టుకొన్న నటి త్రిప్తి డిమ్రి. 'యానిమల్' చిత్రంలో ఆమె పాల్గొన్న బోల్డ్ సీన్లు చూసి 'ఎవరీమె' అంటూ గూగుల్‌లో ఆరా తీశారెందరో. ఆ సినిమా తర్వాత త్రిప్తి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయింది. కొత్త అవకాశాలు కూడా ఆమెను వెదుక్కుంటూ వచ్చాయి.



అయితే 'యానిమల్'లో ఆమె చేసిన సన్నివేశాల గురించి సోషల్ మీడియాలో కొందరు ఇప్పటికీ ట్రోల్ చేస్తూనే ఉన్నారు. తాజాగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీని గురించి వివరణ ఇచ్చింది త్రిప్తి. 'దర్శకుడు సందీప్ వంగా ఆ చిత్ర కథ గురించి చెప్పినప్పుడు నాది చాలా చిన్న పాత్ర అని స్పష్టంగా చెప్పారు. అయినా ఆ పాత్ర ఆసక్తికరంగా ఉండడంతో అంగీకరించాను. ప్రేక్షకులు ఏమనుకుంటారు, విమర్శలు వస్తాయా అని ఆలోచించుకుంటూ కూర్చుంటే ఏ పనీ చేయలేం. నిజం చెప్పాలంటే 'యానిమల్'లో నేను పాల్గొన్న శృంగార సన్నివేశాలు చూసి అమ్మా, నాన్న ఉలిక్కిపడ్డారు. ఇదేమిటని నన్ను నిలదీశారు. సినిమాకు ఆ సీన్ ఎంత ముఖ్యమో నేను వివరించిన తర్వాత వాళ్లు ఏమీ మాట్లాడలేదు. నా తొలి సినిమా 'లైలా మజ్ను' విడుదలైనప్పుడు నాన్న నా గురించి గొప్పగా చెప్పాలని అనుకున్నారు. కానీ ఆ సినిమా పెద్దగా ఆడలేదు. 'యానిమల్' విడుదలైన తర్వాత అందరూ నన్ను గుర్తు పడుతున్నారు. ఇలా గుర్తింపు తెచ్చుకోవడానికి నాకు ఇంత టైమ్ పట్టింది' అంది.



కొత్త పాయింట్‌తో... కలియుగం పట్టణంలో

విశ్వకార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటించిన 'కలియుగం పట్టణంలో' చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. రమాకాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ ఈ సినిమా నిర్మించారు. గురువారం సాయంత్రం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'నేను నటించిన 'ఆ నలుగురు' చిత్రంలో విశ్వ కార్తికేయ నటించాడు. ఇప్పుడు ఈ సినిమాలో హీరో పాత్ర పోషించాడు. కొత్త పాయింట్‌తో చిత్రం రాబోతోందని అర్థమైంది. ఈ నిర్మాతలు నా పాత మిత్రులు. కష్టపడి పని చేస్తుంటే ఎప్పుడూ అవకాశాలు వస్తుంటాయి. ఈ చిత్ర యూనిట్ కూడా కష్టపడి పని చేసి ఉంటుందని భావిస్తున్నాను' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ 'నేను సినిమాలకు కొత్త. నాకు మూడు ఇంజనీరింగ్ కాలేజీలు ఉన్నాయి. మా స్టూడెంట్స్‌కు చాలా టాలెంట్ ఉంది. దీనిని బయటకు తీసుకురావాలని, నా విద్యార్థులకు అవకాశాలు ఇవ్వాలనీ నానీ మూవీ వర్క్స్ సంస్థ ఏర్పాటు చేశాను. దర్శకుడు రవికాంత్ చెప్పిన కథ నచ్చి, ఈ ప్రాజెక్ట్‌లో ఇన్‌వాల్వ్ కావాలని నిర్ణయించుకున్నా. షూటింగ్ కడపలోనే పెట్టాలని కండీషన్ పెట్టా. నా ఊరి జనాలకు, ఏదో మేలు చేయాలని నా తపన' అని చెప్పారు. కడప నుంచి మంచి నిర్మాత పరిశ్రమకు వస్తున్నాడని దర్శకుడు నీలకంఠ చెప్పారు. సినిమా టీమ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. మదర్ సెంటిమెంట్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ కలగలిపి ఈ సినిమా తీసినట్లు విశ్వకార్తికేయ చెప్పారు.



‘గ్రేస్’ షో

- హ్యారిస్ హాఫ్ సెంచరీ
- యూపీదే విజయం
- గుజరాత్‌కు హ్యాట్రిక్ ఓటమి

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

గ్రేస్ హ్యారిస్ (60 నాటౌట్)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ విజయాల బాట పట్టింది. గ్రేస్ హ్యారిస్ (33 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60 నాటౌట్) మరోసారి తన ఫామ్‌ను చాటుకుంటూ అజేయ అర్ధసెంచరీతో నిలువగా, శుక్రవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆరంభ రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఈ జట్టుకిది వరుసగా రెండో విజయం కావడం గమనార్హం. అటు గుజరాత్ మాత్రం హ్యాట్రిక్ ఓటములతో డీలా పడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 142 పరుగులు చేసింది. స్పిన్నర్ ఎకెల్‌స్టోన్ (3/20) కట్టుదిట్టమైన బంతులకు జెయింట్స్ పరుగుల కోసం తడబడింది. ముందుగా ఓపెనర్లు వోల్వార్ట్ (28), కెప్టెన్ మూనీ (16)లను తను పెవిలియన్‌కు చేర్చింది. అటు హర్లీన్ (18) నిదానంగా ఆడడంతో ఒత్తిడి పెరిగింది. ఈ స్థితిలో మిడిలార్డర్ బ్యాటర్లు లిచ్‌ఫీల్డ్ (35), గార్డ్‌నర్ (30) ఎదురుదాడి లక్ష్యంగా పరుగులు రాబట్టారు. 18వ ఓవర్‌లో గార్డ్‌నర్ రెండు ఫోర్లు, లిచ్‌ఫీల్డ్ సిక్సర్‌తో 19 రన్స్ సమకూరాయి. అయితే తర్వాతి ఓవర్‌లోనే ఈ ఇద్దరూ వెనుదిరిగినా జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది.

యూపీ జోరు: స్వల్ప ఛేదనను ధాటిగా ఆరంభించిన యూపీ 15.4 ఓవర్లలో 143/4 స్కోరుతో నెగ్గింది. లెఫ్టామ్ స్పిన్నర్ తనూజ కన్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఓపెనర్ కిరణ్ నవ్‌గిరె (12) విఫలమైనా, కెప్టెన్ హీలీ (33) వేగంగా ఆడింది. తద్వారా తొలి వికెట్‌కు 4.3 ఓవర్లలోనే 42 పరుగులు జత చేరాయి. పవర్‌ప్లేలోనే ఈ ఇద్దరూ వెనుదిరిగినా జట్టు ఇబ్బందిపడలేదు. చమరి (17) నాలుగు ఫోర్లతో ఆకట్టుకుంది. చివర్లో హ్యారిస్, దీప్తి శర్మ (17 నాటౌట్) జోడీ తమ క్రితం మ్యాచ్ మాదిరే భారీ షాట్లతో చెలరేగుతూ తుదికంటా నిలిచి జట్టుకు ఘనవిజయాన్నందించారు.

సంక్షిప్త స్కోర్లు
గుజరాత్ జెయింట్స్: 20 ఓవర్లలో 142/5 (లిచ్‌ఫీల్డ్ 35, గార్డ్‌నర్ 30, వోల్వార్ట్ 28; ఎకెల్‌స్టోన్ 3/20); **యూపీ వారియర్స్:** 15.4 ఓవర్లలో 143/4 (హ్యారిస్ 60 నాటౌట్, హీలీ 33, దీప్తి శర్మ 17 నాటౌట్; తనూజ 2/23).



ఎకెల్‌స్టోన్ (3/20)

అనుక్ష హ్యాట్రిక్

- భూటాన్‌పై భారత్ సూపర్ విన్
- శాఫ్ అండర్-16 ఫుట్‌బాల్

భూట్మండు: శాఫ్ అండర్-16 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. అనుక్ష కుమారి హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగడంతో భారత్ 7-0తో భూటాన్‌పై భారీ విజయం సాధించింది. విజగతా క్రీడాకారిణుల్లో పెర్ల్ ఫెర్నాండెజ్ రెండు గోల్స్ చేయగా.. శ్వేతా రాణి, అన్విత చెరో గోల్ కొట్టారు. నాలుగు దేశాల ఈ టోర్నీలో ఆతిథ్య నేపాల్, బంగ్లాదేశ్ పోటీలో ఉన్న మిగతా రెండు జట్లు.

దేశవాళీలో అమ్మాయిలకూ రెడ్‌బాల్ టోర్నీ

28 నుంచి పుణెలో సీనియర్ ఇంటర్ జోనల్

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి సారించిన బీసీసీఐ.. తాజాగా మహిళలనూ రెడ్‌బాల్ టోర్నీలో ఆడించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆరేళ్ల తర్వాత తొలిసారిగా సీనియర్ ఇంటర్ జోనల్ మల్టీ-డే ట్రోఫీని నిర్వహించేందుకు సిద్ధమైంది. డబ్ల్యూపీఎల్ ముగిసిన పదిరోజుల తర్వాత అంటే.. ఈనెల 28నుంచి పుణె వేదికగా ఈ టోర్నీ జరగనుంది. ఇటీవల భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో టెస్టు మ్యాచ్‌లు ఆడింది. భవిష్యత్‌లోనూ మహిళలకు వీలైనన్ని ఎక్కువ టెస్టులు నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో మరింత ప్రాక్టీస్ కోసం మహిళలకు రెడ్‌బాల్ టోర్నీలు నిర్వహించాలనుకుంటోంది. మహిళలు చివరిసారిగా 2018లో దేశవాళీల్లో రెడ్‌బాల్ క్రికెట్ ఆడారు. అప్పుడు రెండురోజుల మ్యాచ్‌ల్లో తలపడ్డారు. ఈసారి టోర్నీ మూడురోజుల పాటు జరగనుంది. ఆరు జట్లు (ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్, నార్త్-ఈస్ట్ జోన్) పోటీ పడే ఈ టోర్నీలో లీగ్ దశ, క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్స్ ఉంటాయి. ఫైనల్ ఏప్రిల్ 9న జరుగుతుంది.



పుణెరి పట్టేసింది

ప్రో కబడ్డీ నయా చాంప్ పల్టన్

- ఉత్కంఠ ఫైనల్లో హరియాణాపై గెలుపు
- ఉత్తమ రైడర్‌గా అషు, డిఫెండర్‌గా రీజా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రో కబడ్డీ సీజన్-10 టైటిల్‌ను పుణెరి పల్టన్ జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా జరిగిన తుది పోరులో పుణె 28-25తో హరియాణా స్టీలర్స్‌పై నెగ్గి విజేతగా నిలిచింది. పుణె చాంపియన్‌గా నిలవడం ఇదే తొలిసారి. ఈ జట్టు గత సీజన్‌లో ఫైనల్ చేరినా, జైపూర్ పింక్‌పాంథర్స్ చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఇక, తొలిసారి ఫైనల్ చేరిన హరియాణా ఆఖర్లో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది.

చెలరేగిన పంకజ్, మోహిత్: రైడర్లు పంకజ్ మోహిత్ 9 పాయింట్లు, మోహిత్ గోయత్ (5), అస్లం ఇనామ్‌దార్ (4), డిఫెండర్లు గౌరవ్ ఖత్రి (4) పుణె విజయంలో ముఖ్య భూమిక పోషించారు. హరియాణా స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ నాలుగు పాయింట్లే సాధించి, నిరాశ పర్చాడు. ఫైనల్లో డిఫెండర్ల ఆటే గెలుపు అవకాశాలను ప్రభావితం చేసింది. ఇరు జట్ల రైడర్లు చెరో 17 పాయింట్లతో సమంగా నిలవగా, డిఫెన్స్‌లో పుణె 9 పాయింట్లు సహా ఒక ఆలౌట్ బోనస్ పాయింట్ దక్కించుకుని పైచేయి సాధించింది.

పోటాపోటీగా..: ఈ సీజన్‌లోని రెండు ఉత్తమ డిఫెన్స్ జట్ల మధ్య ఫైనల్ జరగడంతో పాయింట్ల కోసం రైడర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఆట ప్రారంభమైన తొలి పది నిమిషాల్లో ఇరు జట్లకూ పెద్దగా పాయింట్లు లభించలేదు. ఆతర్వాత పోటాపోటీగా ఒక్కో పాయింట్ సాధించడం మొదలవగా ఒక సమయంలో 7-7తో సమమైంది. ఈ దశలో పుణె రైడర్ పంకజ్ సూపర్ రైడర్‌తో 4 పాయింట్లు సాధించి, పుణెను ప్రథమార్ధంలో 13-9 ఆధిక్యంలో నిలిపాడు.

హరియాణా పోరాడినా..: ద్వితీయార్ధంలో హరియాణా గెలుపు కోసం తీవ్రంగా పోరాడినా విజయానికి చేరువగా వచ్చి.. ఆగిపోయింది. ఆట రెండో భాగంలో పుణెతో సమానంగా హరియాణా 15 పాయింట్లు సాధించి, స్కోరు అంతరాన్ని తగ్గించగలిగింది కానీ, విజయానికి అవసరమైన పాయింట్లను సాధించలేకపోయింది. ప్రథమార్ధంలో పుణె సాధించిన మూడు పాయింట్ల ఆధిక్యతే ఆ జట్టును విజేతగా నిలిపింది. ఈ సీజన్ ఉత్తమ రైడర్ అవార్డును అషూ మాలిక్ (దబాంగ్ ఢిల్లీ), ఉత్తమ డిఫెండర్ అవార్డును మహ్మద్ రీజా (పుణెరి పల్టన్) అందుకున్నారు.



బోర్డు మంచి పనే చేసింది

కపిల్ దేవ్

న్యూఢిల్లీ: రంజీల్లో ఆడనందుకు ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌కు సెంట్రల్ కాంట్రాక్ట్‌లు నిరాకరించడాన్ని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ సమర్థించాడు. దేశంకన్నా ఎవరూ పెద్దవారు కాదని, బీసీసీఐ చర్య కొంతమందికి బాధ కలిగించినా పర్వాలేదని తేల్చి చెప్పాడు. ‘దేశవాళీ క్రికెట్ ఉనికిని కాపాడేందుకు బోర్డు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎదిగాక కొంతమంది ఆటగాళ్లు రంజీలను విస్మరించడం శోచనీయం’ అని కపిల్ అన్నాడు.



గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలకు హాజరైన టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ, క్రికెటర్లు సూర్యకుమార్, రషీద్ ఖాన్, షట్లర్లు సైనా నెహ్వాల్, కశ్యప్.

ఐర్లాండ్ ‘తొలి’ గెలుపు

అఫ్ఘాన్‌తో ఏకైక టెస్టు

అబుధాబి: ఐర్లాండ్ క్రికెట్ జట్టు సంచలనం సృష్టించింది. తమ టెస్టు చరిత్రలోనే తొలి విజయాన్ని నమోదు చేసింది. అఫ్ఘానిస్థాన్‌తో మూడు రోజుల్లోనే ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఈ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 2018లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన ఐర్లాండ్‌కిది ఎనిమిదో టెస్టు మాత్రమే. అయితే 111 పరుగుల ఛేదనలో ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 13 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. కానీ కెప్టెన్ బల్బిర్నీ (58 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకోగా, ఐదో వికెట్‌కు టకర్ (27 నాటౌట్)తో కలిసి అజేయంగా 72 పరుగులు జత చేశాడు. దీంతో ఐర్లాండ్ 111/4 స్కోరు చేసి గెలిచింది. అంతకుముందు అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 155, రెండో ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేసింది. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 263 రన్స్‌కు ఆలౌటైంది.



బల్బిర్నీ (58 నాటౌట్)

కుప్పకూలిన కివీస్

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 383

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కేవలం 179 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ నాథన్ లియాన్ (4/43), హాజెల్‌వుడ్ (2/55) ధాటికి కివీస్ బ్యాటర్లు ఏ మాత్రం నిలవలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్ (71) అర్ధ సెంచరీ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 279/9తో రెండో రోజైన శుక్రవారం ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 104 పరుగులు జోడించి 283 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (174 నాటౌట్) పదో వికెట్‌కు హాజెల్‌వుడ్ (22)తో కలిసి రికార్డుస్థాయిలో 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలో 2004లో కివీస్‌తో టెస్టులో గిలెస్పీ, మెక్‌గ్రాత్ కలిసి 10వ వికెట్‌కు జోడించిన 114 రన్స్ రికార్డును గ్రీన్, హాజెల్‌వుడ్ జోడీ బద్దలుకొట్టింది. ఇక, కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ (5/70) ఐదు వికెట్లు తీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్ ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 13 రన్స్ చేసింది. ప్రస్తుతం ఆసీస్ 217 పరుగుల ఆధిక్యంలో ఉంది.



లియాన్ (4/43)

గాయత్రి జోడీ అవుట్

న్యూఢిల్లీ: జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బరిలో మిగిలిన ఏకైక భారత జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ పోరాటం ముగిసింది. ఈ ద్వయం క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ పోరులో నాలుగో సీడ్ గాయత్రి జంట 16-21, 14-21తో చైనాకు చెందిన ఆరోసీడ్ జోడీ లి యి జింగ్/లూ గ్జూ మిన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి వెనుదిరిగింది.

బిజినెస్

మార్కెట్లకు జీడీపీ జోష్


- సెన్సెక్స్ 1,245 పాయింట్లు అప్
- 22,300 ఎగువకు నిఫ్టీ
- రూ.4.29 లక్షల కోట్లు పెరిగిన ఈక్విటీ మదుపరుల సంపద

వృద్ధి గణాంకాల దన్నుతో సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి జీడీపీ వృద్ధి రేటు విశ్లేషకుల అంచనాలను మించడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు, గ్లోబల్ మార్కెట్ల ర్యాలీ, గతనెల వాహన విక్రయ గణాంకాల్లో సానుకూలత ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరచడంతో కొనుగోళ్లు పోటెత్తాయి. దాంతో సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,245.05 పాయింట్ల (1.72 శాతం) లాభంతో సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి 73,745.35 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 1,318.91 పాయింట్ల వృద్ధితో 73,819.21 వద్ద కొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 370.5 పాయింట్లు ఎగబాకి 22,353.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 355.95 పాయింట్ల (1.62 శాతం) లాభంతో 22,338.75 వద్ద క్లోజైంది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి కూడా. మార్కెట్ ర్యాలీతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.4.29 లక్షల కోట్లు పెరిగి రూ.392.25 లక్షల కోట్లకు (4.78 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 6.46 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్ టీ షేర్లు 4 శాతానికి పైగా పుంజుకోగా.. టైటాన్, ఇండస్ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి సుజుకీ షేర్లు మూడు శాతానికి పైగా ఎగబాకాయి. మార్కెట్ దిగ్గజ షేరైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం 2 శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.89 శాతం వరకు పెరిగాయి.

రంగాలవారీ సూచీల్లో హెల్త్‌కేర్, ఐటీ, టెక్నాలజీ మినహా అన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. లోహ రంగ సూచీ అత్యధికంగా 3.84 శాతం ఎగబాకింది. కమోడిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్‌లు సైతం 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి.



మరిన్ని విషయాలు..

- పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.425.45కు చేరుకుంది. ఆర్‌బీఐ ఆంక్షలు ఎదుర్కొంటున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)-పేటీఎం మధ్య అంతర్గత ఒప్పందాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు కంపెనీ ప్రకటించడం ఇందుకు దోహదపడింది.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు తగ్గి 82.91 వద్ద ముగిసింది.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.26 శాతం పెరిగి 82.94 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.350 పెరిగి రూ.63,320కి చేరుకోగా.. కిలో వెండి రేటు రూ.400 పెరుగుదలతో రూ.74,500 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 2,045 డాలర్లు, సిల్వర్ 22.60 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.
- గతనెల 23తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 297.5 డాలర్లు పెరిగి మొత్తం 61,907.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది.

నమ్‌కీన్ ఉత్పత్తుల తయారీ సంస్థ గోపాల్ స్నాక్స్ ఐపీఓ ఈ నెల 6న ప్రారంభమై 11న ముగియనుంది. రూ.650 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తున్న ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.381-401గా నిర్ణయించింది.

ఎన్ఎస్ఈ.. 9 కోట్ల మంది ఇన్వెస్టర్లు

తమ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన యూనిక్ ఇన్వెస్టర్ల సంఖ్య 9 కోట్లు దాటిందని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వెల్లడించింది. అందులో కోటి మంది కేవలం ఐదు నెలల్లో చేరినట్లు తెలిపింది. స్టాక్ మార్కెట్ మదుపరులు గడిచిన ఐదేళ్లలో మూడింతలు పెరిగారు. శరవేగంగా సాగుతున్న డిజిటలీకరణ, ఇన్వెస్టర్లలో అవగాహన పెరుగుతుండటం, ఆర్థిక సవిస్మృతాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పాటు గత కొన్నేళ్లలో స్టాక్ మార్కెట్లు ఆకర్షణీయ రిటర్నులు పంచుతుండటం ఇందుకు దోహదపడింది.

నేడు మార్కెట్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్

భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో తమ సంసిద్ధతను పరీక్షించుకునేందుకు ఈ నెల 2న (శనివారం) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఇంట్రాడేలో ప్రాథమిక సైట్ (పీఆర్) నుంచి డిజాస్టర్ రికవరీ సైట్(డీఆర్)కు మార్చనున్నారు. రెండు సెషన్లలో ఇది జరగనుంది. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు ప్రాథమిక సైట్లో.. 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్లో ట్రేడింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ స్పెషల్ ట్రేడింగ్‌లో అన్ని సెక్యూరిటీల ధరల గరిష్ఠ కదలిక శ్రేణి 5 శాతానికి పరిమితం కానుంది. ఇప్పటికే 2 శాతం లేదా అంతకంటే తక్కువ ప్రైస్‌బ్యాండ్ కలిగిన షేర్లకు పరిమితి యథాతథంగా కొనసాగనుంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు

ఫిబ్రవరిలో 12.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ అమ్మకాలతో పాటు దిగుమతులు కూడా జోరుగా సాగడంతో జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరి నెలలో 12.5 శాతం పెరిగి రూ.1,68,337 కోట్లకు చేరాయి. జీఎస్‌టీ వసూళ్లలో ఫిబ్రవరి నాలుగో అత్యుత్తమ నెలగా నిలిచింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి నెలల మధ్య కాలంలో వసూళ్లు 11.7 శాతం వృద్ధితో రూ.18.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. విభాగాలవారీగా చూసినట్టయితే దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ వసూళ్లలో 13.9 శాతం వృద్ధి నమోదు కాగా దిగుమతులపై జీఎస్‌టీ వసూళ్లు 8.5 శాతం పెరిగాయి. కాగా నెలవారీ సగటు వసూళ్లు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రూ.1.67 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోల్చితే వసూళ్లు రూ.1.5 లక్షల కోట్లు అధికం. రిఫండ్లను తీసివేయగా నికర జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరిలో రూ.1.51 లక్షల కోట్లున్నాయి. మొత్తం వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.41,856 కోట్లు కాగా రాష్ట్రాల జీఎస్‌టీ వాటా రూ.35,953 కోట్లుగా ఉంది.

- ఇప్పటివరకు జీఎస్‌టీ వసూళ్లలో అత్యుత్తమ రికార్డు 2023 ఏప్రిల్‌లో నమోదైన రూ.1.87 లక్షల కోట్లు. ఈ ఏడాది జనవరి రూ.1.74 లక్షల కోట్లతో రెండో స్థానంలోను, రూ.1.72 లక్షల కోట్లతో 2023 అక్టోబరు మూడో స్థానంలోను నిలిచాయి.

వినియోగంలో జోరుకు సంకేతం: జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి వినియోగంలో పెరిగిన జోరుకు దర్పణమని పరిశీలకులంటున్నారు. సుమారుగా అన్ని రాష్ట్రాలూ జీఎస్‌టీ వసూళ్లలో 8 నుంచి 21 శాతం వృద్ధిని నమోదు చేశాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణ అన్నారు. గురువారం విడుదలైన జీడీపీ గణాంకాలు, శుక్రవారం విడుదలైన ఆటోమొబైల్ అమ్మకాల్లో వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థలో పటిష్ఠతకు సంకేతమని కేపీఎంజీ ఇండియా పార్ట్‌నర్ అభిషేక్ జైన్ అన్నారు.

తెలంగాణలో రూ.5,211 కోట్ల జీఎస్‌టీ వసూళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫిబ్రవరి నెల జీఎస్‌టీ వసూళ్లు 18 శాతం వృద్ధి చెంది రూ.5,211 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.4,424 కోట్లుగా ఉన్నాయి. కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి నెల వసూళ్లు 3 శాతం వృద్ధితో రూ.3,557 కోట్ల నుంచి రూ.3,678 కోట్లకు చేరుకున్నాయి.



భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. ప్రభుత్వానికి రూ.2,441.44 కోట్ల డివిడెండ్‌ను అందజేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి డివిడెండ్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సర్వీసుల కార్యదర్శి వివేక్ జోషి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఎల్‌డీ ఆటోమోటివ్, లీజ్ ప్లాన్.. భారత్‌లో సరికొత్త గ్లోబల్ మొబిలిటీ బ్రాండ్ ‘ఆవెన్స్’ను ఆవిష్కరించాయి. ఆవెన్స్ ఇండియా.. దేశంలో మొత్తం 44,000 వాహనాలతో లీజింగ్, ఫ్లీట్ మేనేజ్‌మెంట్‌లో సేవలందించనుంది. ప్రస్తుతం ఈ కంపెనీ దేశవ్యాప్తంగా 280కి పైగా ప్రాంతాల్లో తన కార్యకలాపాలను అందిస్తోంది. గత ఏడాది సెప్టెంబరులో ప్రకటించిన కంపెనీ మూడేళ్ల వ్యూహాత్మక అభివృద్ధి ప్రణాళికకు అనుగుణంగా కొత్త బ్రాండ్ ప్రాతినిథ్యం వహించనుంది. ఏఎల్‌డీ ఆటోమోటివ్ ఇండియా 2005లో కార్యకలాపాలు ప్రారంభించగా లీజ్‌ప్లాన్ ఇండియా 1999లో ఏర్పాటైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,160 ▲	57,900 ▲	76,200 ▲
ముంబై	62,816 ▲	57,540 ▲	69,898 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ		విజయవాడ	460
హైదరాబాద్	460	విశాఖపట్నం	500
2వ తేదీ		వరంగల్	462
చిత్తూరు	513	దజను గుడ్లు రూ.72	
గోదావరి	460		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	134
వరంగల్	126	విజయవాడ	134
కరీంనగర్	126	గుంటూరు	134
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	134
కర్నూలు	126	చిత్తూరు	135
విశాఖపట్నం	127		

పీపీబీఎల్‌తో ఒప్పందాలకు పేటీఎం గుడ్‌బై

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) కార్యకలాపాల నుంచి పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ తప్పుకుంది. పీపీబీఎల్-పేటీఎం మధ్య ఉన్న ఒప్పందాల నుంచి తప్పుకుంటున్నట్టు పేటీఎం బోర్డు శుక్రవారం ప్రకటించింది. ఒక సంస్థపై మరో సంస్థ ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేటీఎం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. అయితే ప్రస్తుతం పీకల్లోతు సంక్షోభంలో ఉన్న పీపీబీఎల్‌కు దూరమయ్యేందుకే పేటీఎం బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. పీపీబీఎల్ పార్ట్‌టైమ్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవి నుంచి పేటీఎం చీఫ్ విజయ శేఖర్ శర్మ తప్పుకున్న మరునటి రోజే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం.

రూ.5.49 కోట్ల జరిమానా: మరోవైపు అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనలు అతిక్రమించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్-ఇండియా (ఎఫ్ఐయూ) పీపీబీఎల్‌పై రూ.5.49 కోట్ల జరిమానా విధించింది. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగా ఎఫ్ఐయూ ఈ చర్య తీసుకుంది.

‘ఆటో’ టాప్‌గేర్

ఫిబ్రవరి అమ్మకాలు మూడో అత్యుత్తమం

న్యూఢిల్లీ: దేశంలో కార్ల డిమాండ్ మంచి జోరుమీదుంది. ఫలితంగా కార్ల అమ్మకాల్లో ఫిబ్రవరి నెల పరిశ్రమ చరిత్రలోనే మూడో అత్యుత్తమమైన నెలగా రికార్డు నమోదు చేసింది. మారుతి సుజుకీ, హ్యుండయ్, టాటా మోటార్స్ అమ్మకాల్లో మంచి వృద్ధిని ప్రకటించగా మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్ కూడా డీలర్లకు అధిక సంఖ్యలో కార్లను డెలివరీ చేశాయి. ఎస్‌యూవీలకు డిమాండ్ చాలా బలంగా ఉన్నదని, రాబోయే నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని విశ్లేషకులంటున్నారు. ఫిబ్రవరి నెల మొత్తం కార్ల విక్రయాలు 3,41,088 యూనిట్లుగా ఉన్నాయి. కాగా 3,94,500 కార్ల అమ్మకాలతో ఈ ఏడాది జనవరి పరిశ్రమలోనే అత్యుత్తమమైన నెలగా రికార్డు నెలకొల్పగా 3,91,811 కార్ల అమ్మకాలతో గత ఏడాది అక్టోబరు రెండో అత్యుత్తమ నెలగా నిలిచింది.

మారుతి విక్రయాల్లో 9 శాతం వృద్ధి: ఫిబ్రవరి నెల అమ్మకాల్లో మారుతి సుజుకీ 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరి నెలతో పోల్చితే కార్ల అమ్మకాలు 1,47,467 నుంచి 1,60,271కి పెరిగాయి. ఫిబ్రవరి నెలలో హ్యుండయ్ మోటార్స్‌ను పరుగులో వెనక్కి నెట్టి టాటా మోటార్స్ రెండో స్థానం ఆక్రమించింది. గత ఏడాది ఫిబ్రవరితో పోల్చితే 19 శాతం వృద్ధితో 51,321 కార్లను విక్రయించింది. కాగా హ్యుండయ్ మోటార్స్ కేవలం 7 శాతం వృద్ధితో 50,201 కార్లను విక్రయించగలిగింది.

- హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ క్వాంటమ్ ఎనర్జీ.. బ్యాటరీ స్వాపింగ్ నెట్‌వర్క్ సంస్థ బ్యాటరీ స్మార్ట్‌తో వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా దేశవ్యాప్తంగా 25కు పైగా నగరాల్లో క్వాంటమ్ ఎలక్ట్రిక్ స్కూటర్ల కోసం బ్యాటరీ స్మార్ట్‌కు చెందిన 900 బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్స్ తోడ్పాటునందించనున్నాయి.

భూమిని కబ్జాచేశారంటూ తోబుట్టువులైన ముగ్గురు చిన్నారులొచ్చి..

న్యాయం చేయాలంటూ ప్రజావాణిలో దరఖాస్తు

- తల్లి లేదు.. మతిస్థిమితం తప్పిన తండ్రి
- 37 గుంటలను కబ్జా చేసిన గ్రామ పెద్దలు
- శుక్రవారం 1509 దరఖాస్తులు



న్యాయం కోసం ప్రజావాణికి వచ్చిన తోబుట్టువులు సాదం వాసవి, జయశ్రీ, శ్రావణి

బేగంపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తోబుట్టువులైన ఆ ముగ్గురు చిన్నారులకు తల్లి లేదు. తండ్రికేమో మతిస్థిమితం లేదు. వారసత్వంగా సంక్రమించిన 37 గుంటల భూమిని పోలీసుల అండతో కొందరు కబ్జా చేశారు. భూమి న్యాయంగా తమకే దక్కాలని చిన్నారులు ధైర్యం చేసి అడిగితే, ఉల్టా వారిని బెదిరించి సంతకాలు తీసుకున్నారు. ఎటూపాలుపోని స్థితిలో ఆ ముగ్గురు చిన్నారులు 'ప్రజావాణి'కొచ్చారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం, శనిగరం గ్రామానికి చెందిన సాదం వాసవి, జయశ్రీ, శ్రావణిలకొచ్చిందీ కష్టం. ప్రజావాణిలో ఆ చిన్నారులు.. 'మంత్రి గారూ.. మేం తల్లిలేని పిల్లలం. మాకు న్యాయం చేయండి' అంటూ మంత్రి సీతక్కను ఉద్దేశించి రాసివున్న పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ ముగ్గురూ 15 ఏళ్లలోపు చిన్నారులే. తల్లి చనిపోవడం, తండ్రితో పాటు పెదనాన్న, నాన్నమ్మకు మతిస్థిమితం లేకపోవడతో ఈ కుటుంబానికి చెందిన 37 గుంటల భూమిపై ఆ ఊర్లోని పెద్దల కన్ను పడింది. స్థానిక ఎస్సై నగేశ్ అండతో పిల్లలను బెదిరించి భూమిని కాజేసే ప్రయత్నం చేశారు. పిల్లలు అడ్డుకోవడంతో చంపేస్తామని బెదిరించి సంతకాలు చేయించుకొని భూమిని కాజేశారు. కాగా ముగ్గురు చిన్నారులు ప్రజవాణికొచ్చి.. సమస్యను వివరించడంతో న్యాయం చేస్తామని వారికి అధికారులు హామీ ఇచ్చారు. ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తంగా 1509 దరఖాస్తులొచ్చాయి. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్.. దరఖాస్తులను స్వీకరించడంతో పాటు వారి సమస్యలను విన్నారు. బీఎడ్ మెరిట్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోర్టులు చెప్పినా గత ప్రభుత్వం ఇవ్వలేదని, న్యాయం చేయాలని డీఎస్సీ-2008 సెలెక్ట్ మెరిట్ బీఎడ్ అభ్యర్థులు ప్రజావాణికి వచ్చారు.

మేడిగడ్డకు వాళ్లెందుకెళ్లారు?:మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): "మాజీ సీఎం కేసీఆర్‌కు మానస పుత్రిక అయిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు మేము వెళ్లినపుడు విమర్శలు చేశారు. బొందల గడ్డకు వెళ్తున్నారా? అని వ్యాఖ్యానించారు. ఏం పీకడానికి వెళ్లారని మమ్మల్ని అన్నవాళ్లు.. ఇపుడు వాళ్లు ఏం పీకడానికి మేడిగడ్డకు వెళ్లారు?" అని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం వైట్ ఎలిఫెంట్ అని అనేకమార్లు చెప్పామని, అది రుజువుకాబోతుందన్నారు. 40-50 పిల్లర్లు ఉన్న దగ్గర 2 పిల్లర్లు కుంగిపోతే నష్టమేంటని అంటున్నారని, కానీ అదే ఇళ్లలో 2 పిల్లర్లు కుంగిపోతే నష్టం ఉండదా అని ప్రశ్నించారు.

రైతులకు ఇబ్బందులు కలగొద్దు:తుమ్మల

వ్యవసాయ మార్కెట్లలో పంట ఉత్పత్తుల క్రయవిక్రయాల సందర్భంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం మార్కెట్లో రైతులు చేపట్టిన ఆందోళన గురించి ఆరా తీశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన వసతులు కల్పించాలని, రైతులు తెచ్చే పంటలకు సరైన గిట్టుబాటు ధర వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను ఆదేశించారు. ఖమ్మం మిర్చి మార్కెట్‌కు ఒకేరోజు 50 వేల మిర్చి బస్తాలు వచ్చాయని అధికారులు మంత్రికి వివరించారు. తేమ ఉన్న మిర్చికి ధర తక్కువ రావడంతో కొంతమంది రైతులు ధర్నా చేసినట్లు తెలిపారు.

సీఎంతో చాలెంజ్ చేసే స్థాయి కేటీఆర్‌కు లేదు: మంత్రి సీతక్క

గంగారం, మార్చి 1: సీఎం రేవంత్‌రెడ్డితో చాలెంజ్ చేసే స్థాయి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్‌కు లేదని మంత్రి సీతక్క అన్నారు. 'లోక్‌సభ ఎన్నికల్లో నీ సిట్టింగ్ సీటులోనే తేల్చుకుందాం..' అంటూ సీఎం రేవంత్‌కు కేటీఆర్ విసిరిన సవాల్‌కు మంత్రి సీతక్క స్పందించారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. 'అసెంబ్లీకి పూర్వ సీఎం కేసీఆర్ రాలేదు.. ప్రతిపక్ష నేతగా మీరు పనికిరారు. మీరే ఎమ్మెల్యే పదవులకు అనర్హులు' అని అన్నారు.

మాయావతి ఆదేశిస్తే నాగర్‌కర్నూల్‌లో పోటీ

- బీజేపీ మళ్లీ గెలిస్తే రాజ్యాంగం రద్దు
- రాష్ట్రంలో ప్రజాపాలన కాదు.. ప్రజా పీడన: ఆర్‌ఎస్ ప్రవీణ్

నాగర్‌కర్నూల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి)/కల్వకుర్తి: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ఆదేశిస్తే నాగర్‌కర్నూలు నుంచి ఎంపీగా పోటీ చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. శుక్రవారం నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు నాగర్‌కర్నూలు నుంచి పోటీ చేయాలని తనను కోరుతున్నారని, ఈ విషయాన్ని మాయావతి దృష్టికి తీసుకెళతానని, ఆమె ఆదేశిస్తే పోటీ చేస్తానని చెప్పారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ గెలిచి మోదీ అధికారంలోకి వస్తే ఉన్న రాజ్యాంగాన్ని రద్దు చేసి కొత్త రాజ్యాంగాన్ని తెస్తారని అన్నారు. రామరాజ్యం పేరుతో మైనార్టీలు, బీసీ, ఎస్సీ ఎస్టీలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో కాంగ్రెస్ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కాదని, ప్రజా పీడిత పాలన కొనసాగుతోందని విమర్శించారు.

మూడు కమ్యూనిస్టు విప్లవ పార్టీలు కలిసి మాస్‌లైన్ పేరుతో జాతీయ పార్టీ

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 1: సీపీఐ(ఎంఎల్)-ఆర్ఐ, పీసీసీ-సీపీఐ(ఎల్), సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా.. ఈ మూడు కమ్యూనిస్టు విప్లవ పార్టీలు జాతీయ స్థాయిలో ఐక్యంగా వ్యవహరించడం కోసం 'మాస్‌లైన్' పేరుతో శుక్రవారం జాతీయ పార్టీని ఏర్పాటు చేశాయి. ఇందుకు ఖమ్మం జిల్లా వేదికైంది. ఈ విషయాన్ని సీపీఐ(ఎంఎల్)-ఆర్ఐ పార్టీ ఆలిండియా కార్యదర్శి ప్రదీప్‌సింగ్, పీసీసీ-సీపీఐ(ఎంఎల్) జాతీయ కార్యదర్శి సుభాష్ దేవ్ వెల్లడించారు. దేశంలో ఫాసిస్టు, మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, మారుతున్న సమాజ పరిస్థితులకు అనుగుణంగా విప్లవ పార్టీలు తమ పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. 3,4,5వ తేదీల్లో ఖమ్మంలో జరిగే మాస్‌లైన్ జాతీయ మహాసభలకు 16రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని వారు తెలిపారు.

లైబ్రేరియన్ పోస్టులకు 5న సర్టిఫికెట్ వెరిఫికేషన్

లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు 5వ తేదీన సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్ణయించింది. షార్ట్ లిస్టులో ఉన్న అభ్యర్థులు 5వ తేదీ ఉదయం 10:30 గంటలకు నాంపల్లిలోని కమిషన్ కార్యాలయానికి చెక్‌లిస్టులో ఉన్న సర్టిఫికెట్లను తీసుకురావాలని అధికారులు సూచించారు.

'మున్సిపల్'లో ఒక జేఏవో పోస్టు తగ్గింపు!

మున్సిపల్ విభాగంలో భర్తీ చేసే జూనియర్ అకౌంట్ ఆఫీసర్స్ పోస్టుల్లో ఒక పోస్టును తగ్గిస్తూ టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. గత నోటిఫికేషన్ ప్రకారం ఈ విభాగంలో మొత్తం 13 పోస్టులుండగా వాటిని 12కు కుదించారు. జోన్-5లో ఈ పోస్టును తగ్గించారు. కాగా, టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా నియమితులైన అమిర్ ఉల్లా ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.



బ్యారేజీని పరిశీలిస్తున్న హరీశ్‌రావు, కడియం శ్రీహరి తదితరులు



అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్, తదితర నేతలు



మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి దూసుకొచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు

ఒక్క పిల్లర్ కుంగితే ఇంత రాద్ధాంతమా?

(మొదటిపేజీ తరువాయి)

వద్దకు చేరుకున్నారు. బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో పగుళ్లు ఏర్పడి.. కుంగిపోయిన 20వ పిల్లర్‌ను పరిశీలించిన తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 1.6 కిలోమీటర్ల పొడవున్న మేడిగడ్డ బ్యారేజీలో 50మీటర్ల పరిధిలో చిన్న సమస్య ఏర్పడితే దాన్ని పెద్దదిగా చూపిస్తున్నారని ఆరోపించారు. మరమ్మతు చేసుకుని బ్యారేజీని వాడుకోవచ్చని ఇంజనీర్లు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొనైనా సరే వానాకాలంలోపు దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కరీంనగర్, ఇతర జిల్లాల్లో నీరు లేక పంటలు ఎండుతున్నాయని, ప్రభుత్వం నీటిని ఎత్తిపోస్తే రైతులకు లాభం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ నిపుణులతో కమిటీ వేసి సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని, నిపుణుల సలహాలు తీసుకుని బ్యారేజీని పునరుద్ధరించాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు ప్రాజెక్టులు రెండు సార్లు కొట్టుకుపోయాయని, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో లీకేజీలు వచ్చాయని గుర్తు చేశారు. కానీ, ఆయా అంశాలపై తామెప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు. ఇది ప్రారంభమేనని, కాళేశ్వరం పరిధిలోని విగతా ప్రాంతాల్లో తమ పార్టీ పర్యటనలు ఉంటాయని వెల్లడించారు.

అన్నారంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

మేడిగడ్డ నుంచి నుంచి అన్నారం బ్యారేజీకి బయలుదేరి వెళ్లిన బీఆర్ఎస్ బృందం.. అక్కడ లీకేజీలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించింది. అనంతరం అక్కడే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని స్పష్టం చేశారు. "తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేసి బీఆర్ఎస్‌ను పడగొట్టేందుకు కుట్ర జరుగుతోంది. గతంలో ప్రగతిభవన్‌ను బాంబులతో పేలుస్తామన్న రేవంత్.. ఇప్పుడు కేసీఆర్‌నే లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నట్టు కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను పడగొట్టాలంటే కాళేశ్వరాన్ని పడగొట్టాలన్నట్టుగా సీఎం వ్యవహార శైలి ఉంది" అని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేని రేవంత్.. కనీసం పరిపాలనైనా సరిగ్గా చేయాలని సూచించారు. అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ గొప్పగా చెప్పుకొనే ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టులో ఓ సర్వేతోపాటు మొబిలైజేషన్ పేరిట రూ.1460 కోట్ల బిల్లులు ఎత్తుకెళ్లారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి, 20లక్షల ఎకరాలకు నీరు అందించామని స్పష్టం చేశారు. చెరువులు, కాల్వలకు గోదావరి నీటిని అనుసంధానం చేశామని, ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు పోశాయని గుర్తు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా పర్వాలేదని, రైతు ప్రయోజాలను దెబ్బతీస్తే ఊరుకోమని హెచ్చరించారు. మేడిగడ్డ బ్యారేజీని వర్షాకాలంలోపు మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్ట్ పాలిటిక్స్ చేస్తోందని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్.. ప్రాజెక్టులపై పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కానీ, తాము మేడిగడ్డకు రాగానే మీడియా సమావేశం పెట్టి మేడిగడ్డను రిపేరు చేపిస్తామని చెప్పారని, ఇది తమ పాక్షిక విజయమని పేర్కొన్నారు. దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మత్తు చేయాల్సింది పోయి రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం చేస్తున్నారని, వచ్చే వర్షాకాలంలో వరదలొచ్చి బ్యారేజీకి ఏమైనా అయితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి సాంకేతిక అడ్డంకులు ఏర్పడడం వల్లే మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణానికి కేసీఆర్ శ్రీకారం చుట్టారని చెప్పుకొచ్చారు. కాళేశ్వరానికి అనుమతులు లేవంటూ మంత్రి ఉత్తమ్ అబద్ధాలు చెబుతున్నారంటూ.. అనుమతులకు సంబంధించిన ఆధారాలను మీడియాకు చూపించారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదనాచారి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

మేడిగడ్డ వద్ద ఉద్రిక్తత..

బీఆర్ఎస్ నేతల మేడిగడ్డ బ్యారేజీ పర్యటన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కేటీఆర్, ఇతర ప్రజాప్రతినిధులతోపాటు తమనూ బ్యారేజీపైకి అనుమతించాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చేశారు. సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బ్యారేజీ వైపునకు దూసుకురాగా పోలీసులు ప్రధాన గేటును మూసివేశారు. కానీ పోలీసు బందోబస్తు తక్కువగా ఉండటంతో బీఆర్ఎస్ శ్రేణులు గేటును నెట్టివేసి, లోపలకు దూసుకొచ్చాయి. ఈ క్రమంలో తోక్కిసలాట జరగడంతో పలువురు మహిళ కార్యకర్తలు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.

పేలిన బస్సు టైర్..

లింగాలఘణపురం: మేడిగడ్డ పర్యటనకు బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రయాణిస్తున్న బస్సు స్వల్ప ప్రమాదానికి గురైంది. ఏఆర్01టీ0752 నంబరు గల బస్సు వెనుకవైపు టైరు పెద్ద శబ్దం పేలిపోవడంతో బస్సులో ఉన్నవారందరూ భయాందోళనకు గురయ్యారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల శివారులో ఈ ఘటన చోటుచేసుకోగా, ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

బీఆర్ఎస్ నేతలకు నిరసన సెగ

మేడిగడ్డ పర్యటనకు బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. 'గో బ్యాక్ బీఆర్ఎస్.. గో బ్యాగ్ కేటీఆర్' అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసు బందోబస్తు మధ్య కాన్వాయ్ ముందుకు సాగింది. కాగా, దామెర క్రాస్ వద్ద పోలీసుల చేతిలో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను కేటీఆర్ పరామర్శించారు. అక్కడే పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్‌తో కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడారు. తమ కార్యకర్తలపై దాడి చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని, బాధితులను గృహ నిర్బంధంలో ఎందుకు ఉంచారని ప్రశ్నించారు. ఎప్పటికీ ఇదే ప్రభుత్వం ఉండదని, ప్రజలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని అన్నారు.



కేటీఆర్ సిరిసిల్లలో రాజీనామా చెయ్..

- నేను నల్గొండలో చేస్తా.!
- సిరిసిల్లలో నేను గెలిస్తే కేటీఆర్ కుటుంబం రాజకీయ సన్యాసానికి సిద్ధమా?
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్
- అర్వింద్, సంజయ్‌కు మతిభ్రమించింది
- ఎన్నికల్లో మా ప్రత్యర్థి బీజేపీయే: మంత్రి

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'కేటీఆర్ నువ్వు సిరిసిల్లలో రాజీనామా చెయ్.. నేను నల్గొండలో రాజీనామా చేస్తా. సిరిసిల్లలో నేను గెలిస్తే కేటీఆర్, కల్వకుంట్ల కుటుంబం రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధమేనా"అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్ విసిరారు. సిరిసిల్ల ప్రజల ఛీత్కారాల నుంచి తప్పించుకోవడానికే మల్కాజ్‌గిరి డ్రామాకు తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. 'కేటీఆర్‌కు దమ్ముంటే సిరిసిల్లలో రాజీనామా చేసి పోటీ చేయమనండి.. కార్యకర్తను పెట్టి ఆ స్థానాన్ని గెలిపించుకుంటాం' అని కోమటిరెడ్డి అన్నారు. కేటీఆర్‌కు టెక్నికల్ నాలెడ్జ్ లేదన్న ఆయన డీఫ్యాక్టో సీఎంగా ఉండి వేల కోట్లు ఖర్చుపెడితే సిరిసిల్లలో కేటీఆర్‌కు వచ్చిన మెజార్టీ 30వేలు మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఒక సీఎం కుమారుడికి ఇంత మెజార్టీ వచ్చిందంటే వాళ్లపై జనాలకు ఎంత కోపం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఆ స్థానంలో తానుంటే వెంటనే పదవికి రాజీనామా చేసేవాడినని చెప్పారు. అధికారంపోయిందనే బాధలో కేటీఆర్, హరీశ్‌లు ఏంచేస్తున్నారో తెలవడంలేదన్నారు. కూలిపోయిన ప్రాజెక్టును చూపించేందుకు లక్షలు ఖర్చు పెట్టి యాత్రలు చేయడం ఎందుకన్న ఆయన పిల్లర్లు కూలిన తర్వాత రిపేరు ఎలా చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ షెడ్డుకు పోలేదని.. స్క్రాప్‌కు వెళ్లిందంటూ ఎద్దేవా చేశారు.. కేటీఆర్ తండ్రిలాగా తన తండ్రి ముఖ్యమంత్రి కాదని.. తాను, ఉత్తమ్, సీఎం రేవంత్‌రెడ్డి రైతు కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చామని గుర్తుచేశారు. రేవంత్ ఆధ్వర్యంలో ప్రజలకు మెరుగైన సంక్షేమం అందించాలని నిరంతరం ప్రయత్నిస్తున్నామని, ప్రజల మన్ననలు పొందుతున్నామన్నారు. మరోవైపు పార్లమెంటు ఎన్నికల్లో తమకు ప్రత్యర్థి బీజేపీయే తప్ప బీఆర్ఎస్ కాదని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని నల్గొండ, భువనగిరి నుంచి పోటీచేయాలని కోరామని, ఆయన పోటీచేస్తే మోదీకన్నా లక్షకుపైగా మెజారిటీ తెప్పించే బాధ్యత తనదన్నారు. తనకు రూ.2వేల కోట్లు ఉన్నాయంటే భయం వేసిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాక అర్వింద్, బండి సంజయ్‌కి మతిభ్రమించిందని, వారి ప్రజలు మర్చిపోయారన్నారు.

సాగర్ కుడికాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, మార్చి 1: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని కుడికాల్వకు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) సభ్యుడు డీఎం రాయ్‌పురే, ఏపీ నీటి పారుదలశాఖ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం నీటిని విడుదల చేశారు. ఏపీలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఆయా జిల్లాల తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేయాలని, ఆ రాష్ట్ర అధికారులు కేఆర్‌ఎంబీకి లేఖలు రాశారు. దీంతో స్పందించిన బోర్డు 3 టీఎంసీల నీటిని విడుదల చేయడానికి అంగీకరించింది. ఈ మేరకు రోజుకు సుమారు 6 వేల క్యూసెక్కుల చొప్పున మొత్తం తొమ్మిది రోజుల పాటు 3 టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు.

కేసీఆర్‌ను మేడిగడ్డకు తీసుకెళ్లలేదేం?

కేటీఆర్.. నీ గిమ్మిక్కులను ప్రజలు నమ్మరు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల మండిపాటు..

- ఓడినా సిగ్గులేకుండా మాట్లాడుతున్నారు: మల్లురవి
- 'పాలమూరు' 50% కూడా పూర్తికాలేదు: వంశీచంద్‌రెడ్డి
- కేటీఆర్ మేడిగడ్డకు కాదు.. ఎర్రగడ్డకు వెళ్లాలి: శంకర్
- ప్రాజెక్టును సందర్శించిన 'ఉమ్మడి పాలమూరు' ఎమ్మెల్యేలు



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని కరివెన రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్/మహబూబ్‌నగర్/షాద్‌నగర్/చౌదరిగూడ/పరిగి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసే విన్యాసాలు, గిమ్మిక్కులను జనం నమ్మబోరని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అన్నారు. మేడిగడ్డకు కేసీఆర్‌ను ఎందుకు తీసుకుపోలేదో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఎల్పీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేల్, లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పారానాయిడ్ స్కిజోఫ్రీనియా అనే వ్యాధితో కేటీఆర్ భ్రమల్లో బతుకుతున్నాడని వీరేశం అన్నారు. మీడియాకు సమాధానం చెప్పలేక చీకటి గదుల్లో వీడియోలు చేసి విడుదల చేస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ వేగు చుక్క అని, రాష్ట్రాన్ని పాలించే శక్తి ఆయనకు మాత్రమే ఉందని మందుల సామేల్ అన్నారు. రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్న కేటీఆర్.. నీ నోటిని అదుపులో పెట్టుకో..' అని లక్ష్మారెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎక్కడి నుంచి వచ్చావో అక్కడికే వెళ్తావంటూ వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటైనా గెలవడానికి కేటీఆర్ ప్రయత్నాలు చేస్తే మంచిదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైనప్పటికీ ఇంకా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. మేడిగడ్డ కుంగుబాటుపై కేటీఆర్ వితండ వాదనలు మాని తప్పులను ఒప్పుకొని ప్రజలను క్షమాపణలు కోరాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ డిమాండ్ చేశారు. ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్ర చేసినట్టుగా కేటీఆర్, బీఆర్ఎస్ నేతల మేడిగడ్డ పర్యటన ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ విమర్శించారు.

'పాలమూరు' సగం కూడా పూర్తి కాలేదు

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 80 శాతం పూర్తయిందని బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారని.. అసలు 50 శాతం పనులు కూడా పూర్తికాలేదని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. 2015లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి మూడేళ్లలో పూర్తిచేస్తామని చెప్పిన కేసీఆర్.. తొమ్మిదేళ్లయినా ఎందుకు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టును చూడటానికి ముందు కేటీఆర్ ఎర్రగడ్డకు వెళ్లాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బీఆర్ఎస్ మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, చిట్టెం పర్ణికారెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి తదితరులు పాలమూరు ప్రాజెక్టును సందర్శించారు. కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్లను పరిశీలించారు. గత బీఆర్ఎస్ సర్కారు అవినీతే లక్ష్యంగా పాలన సాగించిందని, ప్రాజెక్టుల నిర్మాణాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రాజెక్టులో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టకుండా ఇక్కడి రైతులకు బీఆర్ఎస్ సర్కారు తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు.

దేశంలో మహిళలకు రక్షణ లేదు: అల్కా లాంబ

ప్రధాని మోదీ పాలనలో దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, అత్యాచారాలు, అరాచకాలు పెరుగుతున్నాయని ఆలిండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని, తలుపులేసి బిల్లును పాస్ చేశారంటూ తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించినా ప్రధాని మోదీకి రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక అర్హత లేదని మాజీ ఎంపీలు అంజన్ కుమార్‌యాదవ్, సురేశ్ షెట్కర్, బలరాం నాయక్ అన్నారు.

డ్రగ్స్ తీసుకోలేదు.. ఏ పరీక్షకైనా సిద్ధం

రాడిసన్ హోటల్ కేసులో.. డీసీపీ ఎదుట హాజరైన క్రిష్.. ఆయనతో గంటసేపు మాట్లాడిన మాదాపూర్ డీసీపీ వినీత్

హైదరాబాద్ సిటీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ దర్శకుడు జాగర్లమూడి రాధాకృష్ణ అలియాస్ క్రిష్.. శుక్రవారం సాయంత్రం 4:50 గంటలకు హైదరాబాద్ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. రాడిసన్ హోటల్‌లో జరిగిన పార్టీకి క్రిష్ హాజరైనట్లు గుర్తించిన పోలీసులు ఆయనను పదో నిందితుడిగా చేర్చారు. విచారణకు రావాల్సిందిగా కోరారు. అయితే, అందుబాటులో లేనని రెండు రోజుల్లో వస్తానని క్రిష్ సమాధానమిచ్చారు. ఈ ప్రకారం.. శుక్రవారం కుటుంబసభ్యులు, స్నేహితులు ఐదుగురితో కలిసి గచ్చిబౌలి ఠాణాకు వచ్చారు. ఇన్‌స్పెక్టర్ జేమ్స్.. స్టేషన్ రెండో అంతస్తులో ఉన్న మాదాపూర్ డీసీపీ కార్యాలయానికి ఆయనను తీసుకెళ్లారు. డీసీపీ వినీత్ అందుబాటులో లేకపోవడంతో క్రిష్ సుమారు 30-40 నిమిషాలు నిరీక్షించారు. అనంతరం డీసీపీ రావడంతో క్రిష్‌ను ఇన్‌స్పెక్టర్ ఆయన వద్దకు తీసుకెళ్లారు. డీసీపీ సుమారు గంటసేపు క్రిష్‌తో మాట్లాడారు.

స్నేహితుడు ఫోన్ చేస్తేనే వెళ్లా..

రాడిసన్ హోటల్‌లో పార్టీ, డ్రగ్స్ వాడకం గురించి క్రిష్‌ను డీసీపీ ప్రశ్నలడిగినట్లు తెలిసింది. వీటికి జవాబుగా వేరే కార్యక్రమానికి హాజరవాల్సి ఉందని, స్నేహితుడు రఘుచరణ్ ఫోన్ చేస్తే రాడిసన్‌కు వెళ్లానని, అరగంట మాత్రమే ఉన్నానని చెప్పినట్లు సమాచారం.



మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో వెయిటింగ్ హాల్లో కూర్చున్న దర్శకుడు క్రిష్

తాను డ్రగ్స్ తీసుకోలేదని, పార్టీలో డ్రగ్స్ వాడిన విషయం తెలియదని వెల్లడించినట్లు తెలిసింది. సమయానికి అందుబాటులో లేకపోవడం, సినిమా చర్చలకు ముంబై వెళ్లడంతో పోలీసులు పిలిచినపుడు రాలేకపోయినట్లు సమాధానమిచ్చారు. తప్పు చేయనందునే జరిగిన విషయం వివరించడానికి వచ్చానని క్రిష్ చెప్పినట్లు తెలిసింది. వీటికి డీసీపీ సంతృప్తి చెంది.. డ్రగ్స్ పరీక్షలు కచ్చితంగా చేయాలని, సహకరించాలని కోరారు. సిద్ధమని క్రిష్ చెప్పడంతో.. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించాలని ఇన్‌స్పెక్టర్‌ను డీసీపీ ఆదేశించారు.

డ్రగ్స్ కేసులో నన్ను ఇరికించారు!

ముందస్తు బెయిల్ పిటిషన్‌లో క్రిష్ వాదన

క్రిష్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వైఖరి తెలియజేయాలంటూ హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. రాడిసన్ బ్లూ హోటల్ డ్రగ్స్ పార్టీ కేసులో విచారణకు రావాలని పోలీసులు నోటీసులు జారీచేసిన నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కేసుతో ఎటువంటి సంబంధం లేదని, పోలీసులు అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు.

ప్రైవేట్, ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు

క్రిష్‌కు సైబరాబాద్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మూత్ర, ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించాలని గచ్చిబౌలి పోలీసులను డీసీపీ ఆదేశించారు. సిబ్బంది పర్యవేక్షణలోనే ఇవి జరిగేలా చూడాలన్నారు. రిపోర్టులను బట్టి తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపిన డీసీపీ.. పోలీసులకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లకూడదని, ఎప్పుడు పిలిచినా రావాలని క్రిష్‌కు సూచించారు. దీనికి ఆయన అంగీకరించినట్లు తెలిసింది. అనంతరం క్రిష్‌ను గచ్చిబౌలి పోలీసులు పంపించివేశారు.

ఆ ఫ్లైఓవర్లకు కేంద్రం ఓకే

- భూములు అప్పగించేందుకు రక్షణ శాఖ అంగీకారం
- జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు.. ప్యారడైజ్ నుంచి కండ్లకోయ దాకా169 ఎకరాల్లో పనులకు పచ్చజెండా
- బేగంపేట, హకీంపేట వద్ద టన్నెల్స్ ఉండాలని స్పష్టీకరణ
- ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సీఎం కృతజ్ఞతలు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరంలో ట్రాఫిక్ జంఝాటంగా మారిన కంటోన్మెంట్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్ల (ఫ్లైఓవర్ల) నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కంటోన్మెంట్ ప్రాంతంలోని జాతీయ రహదారిపై, రాష్ట్రీయ రహదారిపై కారిడార్ల నిర్మాణానికి హెచ్‌ఎండీఏకు అనుమతినిస్తూ రక్షణ శాఖ శుక్రవారం లేఖ పంపింది. దీంతో హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలోని జాతీయ రహదారి 44పై ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు, హైదరాబాద్-కరీంనగర్ మార్గంలోని రాష్ట్రీయ రహదారి-1పై జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు ఫ్లైఓవర్ల నిర్మాణానికి మార్గం సుగమమైంది. ఈ రెండు మార్గాల్లో ఫ్లైఓవర్ల కోసం తమకు సంబంధించిన 169ఎకరాల భూములను హెచ్‌ఎండీఏకు అప్పగించనున్నట్లుగా రక్షణశాఖ తెలిపింది. ఈ భూమికి సమాన విలువైన భూమి లేదా రూ.1,702 కోట్ల మొత్తం చెల్లించాలని లేఖలో స్పష్టం చేసింది.

జేబీఎస్ మార్గానికి 113.47 ఎకరాలు

హైదరాబాద్-కరీంనగర్ మార్గంలో జేబీఎస్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డులోని శామీర్‌పేట వరకు 18.5 కి.మీ.ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి తొలుత రోడ్లు, భవనాల శాఖ ప్రణాళికలు రూపొందించి హెచ్‌ఎండీఏకు ఈ ప్రాజెక్టును అప్పగించారు. హెచ్‌ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయి సర్వేను పూర్తి చేసి డీపీఆర్ తయారు చేశారు. ఈ ఫ్లైఓవర్ మొత్తం పొడవు 18.5 కి.మీ.లు కాగా అందులో ఆకాశ మార్గం 11.12 కి.మీ.లు ఉండనుంది. ఈ మార్గంలో 113.47 ఎకరాలను ఇచ్చేందుకు రక్షణశాఖ ముందుకొచ్చింది. దీనికి సరి సమాన విలువైన భూమి ఇవ్వాలని లేకుంటే రూ.954.41 కోట్లు చెల్లించాలని నిబంధన విధించింది.

ప్యారడైజ్ మార్గానికి 55.85 ఎకరాలు

జాతీయ రహదారి-44లోని హైదరాబాద్-నాగ్‌పూర్ మార్గంలో ప్యారడైజ్ నుంచి కండ్లకోయ వరకు 18.35 కి.మీ.ల మేర ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మార్గంలో ఫ్లైఓవర్ 7.5 కి.మీ.లు ఉండనుంది. దీని కోసం రక్షణశాఖకు చెందిన 55.85 ఎకరాల భూమి అవసరం ఉండగా రక్షణ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భూమికి కూడా సరి సమాన విలువైన భూమి ఇవ్వాలని, లేకుంటే రూ.748.58 కోట్లు చెల్లించాలని నిబంధన విధించింది. కాగా, ఫ్లైఓవర్ల నిర్మాణంలో భాగంగా బేగంపేట ఎయిర్‌పోర్టు వద్ద, హకీంపేట ఎయిర్‌పోర్టు వద్ద ఫ్లైఓవర్ కాకుండా టన్నెల్ నిర్మించాలని రక్షణశాఖ సూచించింది. హకీంపేటలో 5,348 మీటర్ల స్థలాన్ని లీజుకివ్వనుండగా, ఈ స్థలానికి మీటర్‌కు రూపాయి చొప్పున హెచ్‌ఎండీఏ ఏటా రూ.5,348లు రక్షణశాఖకు చెల్లించాలి. ముందస్తుగా రూ.15.82లక్షలు డిపాజిట్ చేస్తే పనులు పూర్తయిన తర్వాత తిరిగి చెల్లింపులు చేస్తామని నిబంధన విధించారు. ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని పూర్తిగా రక్షణ శాఖ, ఎయిర్‌ఫోర్స్ నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి హర్షం

హైదరాబాద్ నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతించినందుకు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు రక్షణ శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం కేంద్రంతో అనుసరించిన అహంకార పూరిత వైఖరితోనే ఏళ్లకేళ్లుగా ఎలివేటెడ్ కారిడార్ల అనుమతి ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఎనిమిదేండ్లుగా పెండింగులో ఉన్న ఈ సమస్యకు పరిష్కారం లభించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేవలం 80 రోజుల్లోనే తమ కొత్త ప్రభుత్వం ఈ అనుమతులు సాధించటం రాష్ట్రాభివృద్ధి పట్ల తమ చిత్తశుద్ధిని చాటిందన్నారు. రాష్ట్రానికి అవసరమైన వాటి కోసం ఢిల్లీకి వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞాపనపత్రాలను అందించిన విషయాన్ని సీఎం రేవంత్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎవరినైనా కలుస్తామని, కేంద్రంతో సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. రాజకీయ విభేదాలు, పార్టీల సిద్ధాంతాలు ఏవైనా.. తెలంగాణ ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. త్వరలోనే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలు ప్రారంభిస్తామన్నారు.

నలుగురు సభ్యులతో బోర్డు ఏర్పాటు

రక్షణ శాఖ అప్పగించిన భూమిలో ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి, సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ, డిఫెన్స్ ఎస్టేట్ అధికారి, స్థానిక మిలిటరీ అథారిటీతో కూడిన నలుగురు సభ్యుల బోర్డు ఏర్పాటైందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రక్షణ శాఖ స్థలాలను హెచ్‌ఎండీఏకు అప్పగించడం, పనులు పూర్తయ్యే వరకు సహకరించడం తదితర పనులను ఈ బోర్డు పర్యవేక్షిస్తుందని తెలిపారు.

ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం

సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ మార్గాల్లో ట్రాఫిక్ వాహనదారులకు గుదిబండలాగా మారింది. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ మార్గం కానీ, హైదరాబాద్ నుంచి కరీంనగర్ మార్గంలో కానీ సికింద్రాబాద్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు చేరాలంటే గంటకు పైగా సమయం పడుతోంది. కంటోన్మెంట్ పరిధిలో ఉన్న రోడ్లన్నీ ఇరుకుగా ఉండడంతో ఏ ఒక్క వాహనం నిలిచిపోయినా ఇరువైపులా వాహనాలు ఆగే పరిస్థితి ఉన్నది. పైగా కంటోన్మెంట్‌లో విధించే ట్రాఫిక్ ఆంక్షలు కూడా స్థానికులు తీవ్ర ఇబ్బందిగా మారాయి. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం-రక్షణ శాఖ ఉన్నతాధికారుల మధ్య పదేళ్లకు పైగా సంప్రదింపులు, చర్చలు జరుగుతున్నాయి. ఎట్టకేలకు ఇవి ఫలించాయి. కేంద్రం ఇచ్చిన అనుమతులతో రాజధాని నుంచి ఉత్తర తెలంగాణ దిశగా అభివృద్ధి మరింత ఊపందుకోనుంది.

గృహజ్యోతి జీరో బిల్లు జారీ

- పలు జిల్లాల్లో మంత్రుల చేతుల మీదుగా అందజేత
- ఖమ్మంలో పాల్గొన్న భట్టి, వరంగల్‌లో సీతక్క, సురేఖ

హైదరాబాద్, వరంగల్ టౌన్, ముదిగొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'గృహజ్యోతి' పథకం కింద జీరో బిల్లుల జారీ లాంఛనంగా ప్రారంభమైంది. ఫిబ్రవరి నెల వాడకానికి సంబంధించిన బిల్లుల మంజూరును రాష్ట్రవ్యాప్తంగా డిస్కమ్‌లు ముమ్మరం చేశాయి. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గృహలక్ష్మి పథకం ప్రారంభించగా, శుక్రవారం జిల్లా కేంద్రాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఆయా డిస్కమ్‌ల పరిధిలోని ఉన్నతాధికారులు ఇల్లిల్లూ తిరుగుతూ బిల్లులు జారీ చేయడం గమనార్హం. దక్షిణ డిస్కమ్ పరిధిలో ప్రత్యేక దుస్తులు ధరించి, బిల్లులు అందజేశారు. కాగా, వినియోగదారుడు 76 యూనిట్లు వాడితే... సరాసరి నెలవారీ వినియోగం 101 యూనిట్లకు దాటిందని పేర్కొంటూ ఎనర్జీ చార్జీల కింద రూ.258.40, స్థిర చార్జీల రూపంలో రూ.17.80, వినియోగదారుల చార్జీగా రూ.90, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.4.56గా పేర్కొని.. మొత్తం బిల్లు రూ.371 అయిందంటూ గృహజ్యోతి సబ్సిడీతో జీరో బిల్లు జారీ చేశారు. వాడకం 200 యూనిట్లు దాటితే సాధారణంగా/గతంలో ఉన్న టారిఫ్ ఆధారంగానే బిల్లులు జారీ చేశారు. మరోవైపు 200 యూనిట్ల విద్యుత్తు లోపు వినియోగిస్తూ రేషన్/ఆహార భద్రత కార్డులు ఉన్నవారు, ఆధార్ కార్డును జత చేసి, ఎంపీడీవో లేదా మున్సిపల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కార్యాలయాలకు వెళ్లి గృహజ్యోతికి దరఖాస్తు పెట్టుకోవాలని, వాటిని 'ప్రజాపాలన' పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డిస్కమ్‌లు విజ్ఞప్తి చేశాయి. ఆ రశీదులతో సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ లేదా ఈఆర్‌వో కార్యాలయాలకు వెళ్లి.. 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ ప్రయోజనాన్ని పొందాలని పోస్టర్లు, స్టిక్కర్లు అతికించి, బ్యానర్లు కట్టారు. కాగా, గృహజ్యోతి పథకాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం ఖమ్మం జిల్లా ముదిగొండలో ప్రారంభించారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి మీటర్ రీడింగ్ స్కాన్ అనంతరం జీరో బిల్లును వినియోగదారుడు మాలె కృష్ణ భార్య సావిత్రికి అందజేశారు. రాష్ట్రంలో 39.9 లక్షల మందికి ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేద వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వరంగల్ 19వ డివిజన్‌లో అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్ ప్రావీణ్య, అధికారులతో కలిసి గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించి, జీరో బిల్లులు జారీ చేశారు.


ముదిగొండలో వినియోగదారుకి గృహజ్యోతి బిల్లు అందజేస్తున్న భట్టి

కేసీఆర్ మెడకు మేడిగడ్డ ఉచ్చు!

(మొదటిపేజీ తరువాయి)

సంతకాలు చేశారని, కేంద్ర నిపుణులు ఇచ్చే నివేదికల ఆధారంగా ఆయన అవినీతిని ప్రజల ముందు బట్టబయలు చేయాలని రేవంత్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఢిల్లీకి ఫోన్ చేసి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖలోని పలువురు కీలక అధికారులతో మాట్లాడినట్లు అధికార వర్గాలు తెలిపాయి. "నాకు రాజకీయాలు ప్రధానం కాదు. రూ.లక్షల కోట్లు వృథా చేసి నిర్మించిన ప్రాజెక్టుల్లో అక్రమాలను నిగ్గుతేల్చి బాధ్యులెవరో తేల్చడం ముఖ్యం. మీరే నిపుణులను నియమించి సాధ్యమైనంత త్వరగా అక్రమాలకు కారకులైన వారిని శిక్షించాలని, ప్రాజెక్టులను వేగంగా నిర్మించాలన్నదే నా లక్ష్యం" అని ఆ అధికారులతో రేవంత్ అన్నట్లు తెలిసింది. దీంతో.. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ నిర్మాణాల్లో లోపాలను సమగ్రంగా పరిశీలించేందుకు కేంద్రం నియమించిన ఎన్‌డీఎస్‌ఏకు చెందిన ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీ మార్చి మొదటి వారంలోనే హైదరాబాద్‌కు వస్తుందని, సాధ్యమైనంత త్వరలో అక్రమాలకు కారణాలను, బాధ్యులను గుర్తిస్తుందని ఆ అధికారులు సీఎంకు చెప్పినట్లు సమాచారం.



గతంలో సమాచారం ఇవ్వని అధికారులు..

గతంలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మేడిగడ్డను సందర్శించి సాంకేతిక వివరాలను అడిగినప్పుడు.. కేసీఆర్ ప్రభుత్వంలోని నీటిపారుదల శాఖ అధికారులు సరైన సమాచారం ఇవ్వలేదని జలశక్తి మంత్రిత్వ శాఖ అధికారులు రేవంత్‌కు చెప్పినట్లు తెలిసింది. అయితే తాము మొత్తం సమాచారాన్ని ఇచ్చామంటూ అధికారులు బుకాయిస్తున్నారని రేవంత్ వారితో అన్నట్లు సమాచారం. దీంతో కేసీఆర్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు ఏయే సమాచారం ఇవ్వలేదో ఆ వివరాలను రేవంత్‌కు పంపించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బ్యారేజీ ఇన్‌స్ట్రుమెంటేషన్ డాటా, స్తంభాలు కూలిపోవడానికి ముందు బ్యారేజీపై ఒత్తిడికి సంబంధించి గమనించిన వివరాలు, నిర్మాణానికి సంబంధించి సెక్షనల్ డ్రాయింగ్స్, వర్షాకాలానికి ముందు, ఆ తర్వాత జరిగిన తనిఖీల వివరాలు, బ్యారేజీ డిజైన్ లెక్కలు, క్వాలిటీ కంట్రోల్ నివేదికలు, థర్డ్ పార్టీ పర్యవేక్షణ నివేదికలు, వర్షాకాలానికి ముందు, ఆ తర్వాత జరిగిన క్రాస్ సెక్షన్లు, కాంట్రాక్టు ఒప్పందంలో సంబంధిత క్లాజులు, ప్రతి బ్లాక్‌కు సంబంధించి పూర్తయిన నివేదికలు.. ఇవన్నీ పూర్తిగా సమర్పించకపోవడమో, సరిగా సమర్పించకపోవడమే జరిగిందని అధికారులు సీఎంకు తెలిపారు. ప్రతి బ్లాకూ పూర్తయినట్లు నివేదికలు ఇవ్వకుండా మొత్తం ప్రాజెక్టు పూర్తయినట్లు తప్పుడు సమాచారం ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, అసంపూర్తి సమాచారం ఇచ్చి తప్పుకొన్నారని చెప్పారు. వీటన్నింటినీ ఓపికగా విన్న సీఎం రేవంత్.. తన ముందే ఇంజనీర్లను డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణులు నిలదీయాలని, అప్పుడు వారు తప్పించుకోవడానికి వీలుండదని చెప్పినట్లు తెలిసింది. ఒకరిద్దరు అధికారులపై చర్య తీసుకుంటే సరిపోదని, 20 మందికి పైగా అధికారులపై చర్య తీసుకోవాల్సి ఉంటుందని ఒక అధికారి చెప్పినప్పుడు.. తప్పు చేసినట్లు తేలితే ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని రేవంత్ అన్నట్లు సమాచారం. కాగా, డ్యామ్ సేఫ్టీ అథారిటీకి మేడిగడ్డ లోపాలను తేల్చేందుకు నాలుగు నెలలు సమయం ఇచ్చినప్పటికీ నెల రోజుల్లోనే మధ్యంతర నివేదిక సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నారని అధికారులు చెప్పినట్లు తెలిసింది. అయితే తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలు జరగక ముందే మేడిగడ్డ దోషులను బహిర్గతం చేయాలని రేవంత్ భావిస్తున్నట్లు సమాచారం.

మూడు బ్యారేజీల్లో లోపాలపై అధ్యయనం

చంద్రశేఖర్ అయ్యర్ కమిటీ.. మేడిగడ్డను మాత్రమే కాకుండా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా సందర్శించాలని, హైడ్రాలిక్, నిర్మాణపరమైన, భూసాంకేతిక అంశాలను పరిశీలించి సంబంధిత వ్యక్తులతో, ఏజెన్సీలతో చర్చించాలని విధివిధానాల్లో చేర్చారు. బాధ్యులైన వారు తప్పించుకోకుండా ఉండేందుకే ఈ విధివిధానాలను పకడ్బందీగా రూపొందించారు. ప్రాజెక్టు డాటా, డ్రాయింగ్స్, డిజైన్ మెమొరాండా, పరీక్షలు, సైట్ దర్యాప్తు నివేదికలు, బ్యారేజీ తనిఖీ నివేదికలు, డిజైన్, నిర్మాణం, నాణ్యతా నియంత్రణకు సంబంధించి అన్ని నివేదికలు, సమాచారాన్ని పరిశీలించే అధికారం ఈ కమిటీకి ఉంటుంది. మూడు బ్యారేజీల డిజైన్లకు సంబంధించిన అధ్యయనాలను కూడా ఈ కమిటీ పరిశీలిస్తుంది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి గల కారణాలను మాత్రమే కాకుండా ఇతర రెండు బ్యారేజీల్లో ఉన్న లోపాలను కూడా అధ్యయనం చేస్తుంది. మూడు బ్యారేజీల్లో అవకతవకలను సరిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలను కూడా సూచిస్తుంది. అవసరమైతే మరో నిపుణుడిని కూడా సభ్యుడిగా చేర్చుకునే అధికారం కమిటీకి ఉంది.

ఫస్టునే జీతాలు పడ్డాయి

- ఉద్యోగులు, పెన్షనర్ల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారమే వేతనాలు, పెన్షన్ల జమ
- ఒకటో తేదీన ఇవ్వడం ఐదేళ్లలో ఇదే మొదటిసారి: ఉద్యోగ సంఘాలు
- కాంట్రాక్టు, గురుకుల టీచర్లకు అందని జీతం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సర్వీసు పెన్షనర్లకు సర్కారు సంతోషాన్ని కలిగించింది. నెల మొదటి రోజునే వేతనాలు, పెన్షన్లు అందజేసింది. ఫిబ్రవరి నెల వేతనాలు, పెన్షన్లను ఉద్యోగులు, పెన్షనర్ల బ్యాంకు ఖాతాల్లో శుక్రవారం జమ చేసింది. గత ఐదేళ్లలో ఒకటో తారీఖున వేతనాలు చెల్లించడం ఇదే మొదటిసారి అని ఉద్యోగ సంఘాలు వ్యాఖ్యానిస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా వేతనాలు ఆలస్యమయ్యేవి. దీనిపై ఉద్యోగులు, పెన్షనర్లలో వ్యతిరేకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే..ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని కాంగ్రెస్ పార్టీ భరోసా ఇచ్చింది. ఆ మేరకు డిసెంబరు, జనవరి నెలల వేతనాలను 4, 5 తారీఖుల వరకు చెల్లిస్తూ వచ్చింది. ఫిబ్రవరి నెల వేతనాలను ఒకటో తేదీనే చెల్లించేసింది. అన్ని జిల్లాల్లో వేతనాలు, పెన్షన్లు అందాయని ఉద్యోగ, పెన్షనర్ల సంఘాలు తెలిపాయి. అయితే, 010 హెడ్ కింద ఉన్న 3,69,200 మంది రెగ్యులర్ ఉద్యోగులకే శుక్రవారం వేతనాలు అందాయి. 2,88,000 మంది పెన్షనర్లకు పెన్షన్లు పడ్డాయి. ఈ 6,57,200 మంది ఉద్యోగులు, పెన్షనర్లు మినహా.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, గురుకుల ఉపాధ్యాయులు, లెక్చరర్లకు వేతనాలు అందలేదని తెలిసింది. వారికీ వేతనాలు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమాచారం.

హరీశ్.. ఇప్పుడేమంటావ్.!

మీ రెచ్చగొట్టుడు విద్యకు తెలంగాణలో కాలం చెల్లింది: మంత్రి కోమటిరెడ్డి

"మిస్టర్ హరీశ్‌రావు ఇప్పుడేమంటావ్.. అధికారంలో ఉన్నప్పుడు జీతాలివ్వలేదు.. అధికారం పోయాక జీతాలిస్తుంటే ఓర్చుకోవడంలేదు. రెచ్చగొట్టే మీ విద్యకు తెలంగాణలో కాలం చెల్లింది" అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలో మార్చి 1న 3,69,200 మంది ఉద్యోగులు జీతాలు, 2.88లక్షల మంది పింఛన్లు అందుకున్నారని.. వారి కుటుంబాల్లో తమ సర్కారు సంతోషం నింపిందని అన్నారు.

కాళేశ్వరం అప్పులు తండ్రీకొడుకులే కట్టాలి

నీళ్ల కోసం కాదు.. పైసల కోసమే ప్రాజెక్టులు.. ఆ రుణాలను కేసీఆర్, కేటీఆర్ నుంచి రికవరీ చేయాలి

- కేంద్రం పాపం కూడా ఉంది.. రూ.లక్ష కోట్ల రుణాలిచ్చారు
- డ్యామేజీలు చూసైనా బీఆర్‌ఎస్ క్షమాపణలు చెప్పాలి: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ కేసీఆరేనని, ఆయన డిజైన్‌తో కట్టిన ప్రాజెక్టు నిరర్థకంగా మారిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు. లెక్క ప్రకారమైతే కాళేశ్వరం ప్రాజెక్టు కింద తీసుకున్న అప్పును కేసీఆర్, కేటీఆర్‌లే కట్టాలన్నారు. వారి అక్రమ సంపాదనను రికవరీ చేసి, లోన్లు కట్టాలని వ్యాఖ్యానించారు. పదేళ్లలో నీళ్ల కోసం కాకుండా పైసల కోసమే ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం అవినీతిపై విజిలెన్స్, కాగ్ నివేదిక ఆధారంగా న్యాయపరమైన చర్యలుంటాయని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పదేళ్లలో తలసరి అప్పు పదింతలు పెరిగిందని ఆరోపించారు. 'కాఫర్‌డ్యామ్ కట్టండి. నీటిని ఎత్తిపోయండి' అంటూ కేటీఆర్ సిల్లీ సలహాలు ఇచ్చారని.. ఆయన సలహాలు తీసుకోబోమని చెప్పారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణులు ఇచ్చే సలహాలే తీసుకుంటామని తెలిపారు. యుద్ధప్రాతిపదికన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించి.. నెలరోజుల్లోనే నివేదిక ఇవ్వాలని కోరనున్నట్లు చెప్పారు. శనివారం ఢిల్లీ వెళ్లి కేంద్ర జలవనరుల శాఖ అధికారులను కలిసి, ఈ మేరకు నివేదిస్తామని వెల్లడించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇవ్వగానే దాని ఆధారంగా బ్యారేజీల పునరుద్ధరణ, మరమ్మతులు చేపడతామని స్పష్టం చేశారు. వానాకాలంలోపే మరమ్మతులన్నీ పూర్తిచేస్తామని ప్రకటించారు. గత అక్టోబరు 21న బ్యారేజీ కుంగిపోతే.. డిసెంబరు 7 దాకా(తాము బాధ్యతలు స్వీకరించేదాకా) కేసీఆర్ ఈ ఘటనపై మాట్లాడలేదని గుర్తుచేశారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్ల నష్టం చేసిన కేసీఆర్ ఇటీవల నల్లగొండ సభలో నీచంగా మాట్లాడారని ఆక్షేపించారు. గత ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీసిందని ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేంద్రప్రభుత్వ పాపం కూడా ఉందన్నారు. కేంద్రానికి చెందిన పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీల నుంచి రూ.లక్ష కోట్ల రుణాలు ప్రాజెక్టులకు ఇచ్చారని ఆరోపించారు. బ్యారేజీల డ్యామేజీలు చూసైనా బీఆర్‌ఎస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కయ్యే ఇదంతా జరిగిందని ఆరోపించారు.

ఆ డాక్యుమెంట్లు ఉంటే కదా ఇచ్చేది..!

బ్యారేజీలకు సంబంధించిన 20 పత్రాలు అడిగినా గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఇవ్వలేదని నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ వెదిరె శ్రీరాం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బ్యారేజీలు కడుతున్నప్పుడు గత ప్రభుత్వం స్ట్రక్చరల్ డ్రాయింగ్, జియోఫిజికల్ నివేదికలు తెప్పించుకోలేదని ఉత్తమ్ చెప్పారు. క్వాలిటీ కంట్రోల్ రిపోర్టులు, థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్‌లు, ప్రతి బ్లాకు పూర్తయినట్లు నివేదికలు కూడా లేవన్నారు. ఆ నివేదికలు లేనందువల్లే ఎన్‌డీఎస్‌ఏకు ఇవ్వలేదని, అవి లేవని కూడా కేంద్రానికి లేఖ రాశామని ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణ వచ్చిన కొత్తలో కొంతకాలం దాకా కేసీఆర్ బాగున్నాడని, అందుకే ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా ఇవ్వాలని కోరారని.. ఆ తర్వాత ప్రాణహిత-చేవెళ్ల కడితే కాంగ్రెస్‌కు క్రెడిట్ దక్కుతుందన్న కుట్రతో ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ చేశారని ఆరోపించారు.

నీటి లభ్యతపై తప్పుడు ప్రచారం

తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని ఎప్పుడూ కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) నివేదిక ఇవ్వలేదని, నేరపూరిత కుట్ర చేసి, నీళ్ల కోసం కాకుండా పైసల కోసమే కాళేశ్వరం తెరపైకి తెచ్చారని ఉత్తమ్ ఆక్షేపించారు. ఏటా మేడిగడ్డ ద్వారా 180 టీఎంసీల నీటిని ఎత్తిపోయాల్సి ఉండగా.. ఐదేళ్లలో 162 టీఎంసీలే ఎత్తి, సగం నీటిని సముద్రంలోకి వదిలేశారని మండిపడ్డారు.

రైతుల కోసం కమిషన్

(మొదటిపేజీ తరువాయి)


సచివాలయంలో సీఎం రేవంత్‌తో సమావేశమైన కేంద్ర వ్యవసాయ శాఖ అధికారులు

పంటలకు పెట్టుబడి సాయంగా అందించేదని సీఎం తెలిపారు. దీనిని ఎవరికి ఇవ్వాలనేదానిపై విస్తృత చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారులకు.. అవసరమైతే చెప్పినదానికంటే ఎక్కువ సాయం చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉందన్నారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, అన్ని పంటలూ విస్తరించేలా రైతులు సరికొత్త విధానాలను అనుసరించాలని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలోని పాఠశాలలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని సీఎం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా అన్నీ ఒకేచోట ఉండేలా దాదాపు 25 ఎకరాల్లో ఒకే ఇంటిగ్రేటెడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. తొలుత దీనిని పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ నెలకొల్పుతామని, దశలవారీగా అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తామని అన్నారు. దీంతో కుల, మత వివక్ష తొలగిపోతుందని, విద్యార్థుల్లోనూ పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. అదే సమయంలో గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా జరుగుతాయని అభిప్రాయపడ్డారు.

ఉద్యోగాల కల్పనలో నిబద్ధతతో ఉన్నాం..

నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులను తొలగించి పలు ఉద్యోగాలను భర్తీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రూప్-1, మెగా డీఎస్సీ నోటిఫికేషన్లు విడుదలయ్యాయని, యూపీఎస్సీ తరహాలో టీఎస్‌పీఎస్సీ ద్వారా నియామకాలు చేపడతామని అన్నారు. అధికారంలోకి వచ్చిన రోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌ను తెరిచామని, ప్రజాభవన్‌ను ప్రజలు సమస్యలు చెప్పుకొనేందుకు అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా పథకాలకు దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారెంటీలను అమలు చేశామని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, స్వరాజ్ అభియాన్ వ్యవస్థాపక సభ్యుడు యోగేంద్ర యాదవ్, టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, విశ్వేశ్వర్‌రావు, రమా మెల్కొటే, రియాజ్, పురుషోత్తం, గాదె ఇన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ కార్యక్రమాలకు హాజరు కండి!

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పర్యటించనున్న ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమాలకు హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రధానమంత్రి కార్యాలయం కోరింది. ఈ మేరకు పీఎంవో నుంచి రేవంత్‌కు ఆహ్వానం అందింది. ప్రధాని మోదీ ఈ నెల 4, 5 తేదీల్లో ఆదిలాబాద్, సంగారెడ్డిలో పర్యటించనున్నారని, ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పీఎంవో కోరింది. పీఎంవో ఆహ్వానం అందిన నేపథ్యంలో ప్రధాని మోదీకి సీఎం రేవంత్ స్వాగతం పలకనున్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలోకి తెలంగాణ

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)లో తెలంగాణ రాష్ట్రం తిరిగి చేరుతోంది. ఈ కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకం నుంచి నాలుగేళ్ల క్రితం కేసీఆర్ ప్రభుత్వం బయటకు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకమేదీ అమల్లో లేదు. ప్రకృతి విపత్తులు వచ్చినపుడు నాలుగేళ్లుగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించింది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సచివాలయంలో పీఎంఎఫ్‌బీవై సీఈవో, కేంద్ర సంయుక్త కార్యదర్శి రితేశ్ చౌహాన్‌తో జరిపిన భేటీలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకంలో చేరాలని నిర్ణయించారు. దీంతో వచ్చే పంటకాలం నుంచి రైతులకు ఈ పథకం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర సమగ్రాభివృద్ధిలో రైతు కేంద్రిత విధానాల అమలుకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రైతులకు దన్నుగా నిలుస్తూ సాగు రంగాన్ని బలోపేతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. సాగు రంగంలోని ప్రతికూలతల్ని తట్టుకుంటూ రైతులకు రక్షణగా నిలిచేందుకు ఫసల్ బీమా యోజన దోహదపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి పాల్గొన్నారు.

హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్!

- హెచ్‌ఎండీఏ పరిధిలోని 7 కార్పొరేషన్లు, 30 మున్సిపాలిటీల విలీనం!
- పాలకవర్గాల పదవీకాలం ముగియగానే విలీన ప్రక్రియ ప్రారంభం
- అధ్యయనం చేయాలని పురపాలక శాఖను ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను విలీనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నారు. తద్వారా ఈ ప్రాంతాన్నంతా ఏకరీతిన అభివృద్ధి చేయవచ్చని భావిస్తున్నారు. ఈ మేరకు ఇటీవల పురపాలకశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో సీఎం ఈ అంశంపై దృష్టి సారించారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో 30 మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఏడు కార్పొరేషన్లు (బోడుప్పల్, ఫీర్జాదిగూడ, జవహర్‌నగర్, బండ్లగూడ జాగీర్, నిజాంపేట, బడంగ్‌పేట, మీర్‌పేట్) ఉన్నాయి. వీటన్నింటినీ కలిపి హైదరాబాద్ గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇలా వీలుగాకపోతే తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ సిటీలుగా నాలుగు కార్పొరేషన్లు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. హెచ్‌ఎండీఏ పరిధిని అన్ని వైపులా ఔటర్ రింగ్‌రోడ్డు వరకు విస్తరించాలని సీఎం ఇటీవల అధికారులను ఆదేశించారు. ఇప్పుడున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయిన వెంటనే వాటికి ప్రత్యేక అధికారులను నియవించాలని, ఆ తరువాత ఈ విలీన ప్రక్రియను ప్రారంభించాలని పురపాలక శాఖ అధికారులతో సీఎం ఇటీవల సమాలోచనలు చేశారు. హెచ్‌ఎండీఏ పరిధి ప్రాతిపదికగా ఒకే గ్రేటర్ సిటీ కార్పొరేషన్‌గా చేయడం లేదా సిటీ మొత్తాన్ని నాలుగు కార్పొరేషన్లుగా చేయటం అనేది పరిశీలించాలని ఈ సందర్భంగా అధికారులను సీఎం ఆదేశించారు. దీనిపై న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవటంపైనా అధికారులు కసరత్తు జరుపుతున్నారు.

నిధుల పరంగా అసమతుల్యత

జీహెచ్‌ఎంసీతోపాటు కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నిధుల పంపిణీలో అసమతుల్యత ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని డివిజన్లలో లక్ష మందికిపైగా జనాభా ఉండగా కొన్ని కార్పొరేషన్లలోని డివిజన్లలో 30 వేలకు మించి లేరు. ఇటువంటప్పుడు మౌలిక వసతుల కల్పనకు కేటాయించే నిధులు, గ్రాంట్లను.. అన్నింటినీ ఒకే గాటన కట్టి అందజేస్తే కొన్ని ప్రాంతాలకు లాభం జరిగి కొన్ని ప్రాంతాలకు నష్టం వాటిల్లుతోందన్న అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్తగా ఏర్పాటు చేసే కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లను జనాభా ప్రాతిపదికను విభజన చేయాలని సీఎం అధికారులకు సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలో రెండేళ్ల కిందట మూడు మున్సిపల్ కార్పొరేషన్లను ప్రభుత్వం ఒకే కార్పొరేషన్‌గా విలీనం చేసింది. ఈ విలీన ప్రక్రియపైనా సీఎం అధికారులను ఆరా తీశారు. గ్రేటర్ హైదరాబాద్‌ను ఏకరీతిగా అభివృద్ధి చేసేందుకు విలీనం ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారు.

కాంగ్రెస్ ఓటు శాతం 39 నుంచి 44కు

- ముస్లింలు బీఆర్ఎస్‌ను వదిలి హస్తం వైపు చూస్తున్నారు
- తెలంగాణలోని ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో బలంగా బీజేపీ
- 'ఆంధ్రజ్యోతి'తో బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు

న్యూఢిల్లీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ఓటు శాతం 39 నుంచి 44 శాతానికి పెరుగుతోందని బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు అన్నారు. రాష్ట్రంలోని ముస్లింలు బీఆర్ఎస్‌కు దూరమై కాంగ్రెస్ వైపు సంఘటితం అవుతున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలోని ఎనిమిది పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ గట్టి పోటీ ఇవ్వగలదని, మిగిలిన స్థానాల్లో పార్టీ పుంజుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధిలో మురళీధర్ రావు శుక్రవారం మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఎన్ని సీట్లు గెలుస్తుందో ఇప్పుడే చెప్పలేమన్నారు. అభ్యర్థుల జాబితా ప్రకటించి, ప్రచారం ఊపందుకున్న తర్వాతే బీజేపీ విజయావకాశాల గురించి తాను కచ్చితంగా చెప్పగలనని పేర్కొన్నారు. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాత్రమే గట్టి పోటీ ఉందన్నారు. మరికొన్ని చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ అంటున్నాయని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, నాగర్ కర్నూలు, నల్లగొండ నియోజకవర్గాల్లో బీజేపీ బలోపేతం కావాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. బీజేపీ సిటింగ్ ఎంపీల పట్ల ప్రజావ్యతిరేకత ఎంత మేర ఉందో కూడా అంచనా వేయాల్సి ఉందన్నారు. రామ మందిర నిర్మాణం, మోదీకి ఉన్న ప్రజాఆకర్షణ తెలంగాణలో ఎంత మేర పని చేస్తాయనే అంశంపై చర్చ జరుగుతోందని చెప్పారు. హిందువులు తెలంగాణలో పూర్తిగా సంఘటితం అవుతారని చెప్పలేమని అన్నారు. ఇతర పార్టీల నేతలు బీజేపీలో చేరడం మంచిదే కానీ, వారి వల్ల స్థానిక నేతల్లో అసంతృప్తి పెరుగుతోందని, ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని చెప్పారు. చాలా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక వివాదాస్పదంగా మారడంతో పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. వారం రోజుల తర్వాత కానీ పూర్తి జాబితా ఖరారు కాదన్నారు. తాను మల్కాజిగిరి సీటును ఆశిస్తున్నానన్న విషయం అందరికీ తెలుసునని, ఆ సీటు తనకే దక్కుతుందనే విశ్వాసం ఉందని మురళీధర్ తెలిపారు.

యాదాద్రీశుడికి బంగారు కిరీటాలు

- బహూకరించిన హైదరాబాద్ భక్తులు


స్వామివారికి బహూకరించిన బంగారు కిరీటాలు

యాదగిరిగుట్ట, మార్చి 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి సుమారు 250 గ్రాముల బంగారంతో తయారు చేసిన రెండు కిరీటాలు, ఒక అభయహస్తం ఆభరణం కానుకగా వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన తడకమల్ల కృష్ణమూర్తి, లక్ష్మి.. యశ్వంత్‌కుమార్, భవాని దంపతులు.. శ్రీవల్లి, మహాలక్ష్మిలు వీటిని అందించారు. శుక్రవారం వీరు గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకుని ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద కానుకలను ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావులకు అందజేశారు. ఇక, కొండపైన ప్రధానాలయ తూర్పు రాజగోపురం ఎదుట టెంకాయ మొక్కు చెల్లించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారంవిప్ బీర్ల అయిలయ్య, దీనిని ప్రారంభించారు.

మొహిదొద్దీన్ అండ్ కో చెప్పినట్లే చేశాం!

- 'గొర్రెల' స్కాం గురించి తెలియదు..అధికారుల వాంగ్మూలం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పంపిణీ పథకం అవినీతి కేసులో అరెస్టయిన నలుగురు ప్రభుత్వ అధికారులను ఏసీబీ రెండో రోజూ ప్రశ్నించింది. శుక్రవారం ఏసీబీ అధికారులు వారి నుంచి పలు వివరాలను రాబట్టారు. ఒకే అంశానికి సంబంధించి నలుగుర్ని వేర్వేరుగా విచారించినప్పుడు కొన్నింటికి ఒకేరకమైన జవాబులు రాగా, మరికొన్నింటికి వేర్వేరుగా వచ్చినట్లు తెలిసింది. విషయం ఇంత పెద్దదని తమకు తెలియదని, కేవలం గొర్రెల కొనుగోలు ఏజెన్సీగా వ్యవహరించిన మొహిదొద్దీన్ అండ్ కో చెప్పినట్లుగానే చేశామని వారు పేర్కొన్నట్లు తెలిసింది. రూ.2.10కోట్ల మోసం జరిగినట్లు కేసు నమోదైన తర్వాత గానీ తమకు తెలియలేదని చెప్పినట్లు సమాచారం. కొందరు నేతలు కూడా తమతో మాట్లాడారని, ప్రభుత్వ పథకం కాబట్టి మిగతా విషయాలేవీ పట్టించుకోలేదని చెప్పినట్లు సమాచారం.

ముడుపులు ఇస్తేనే... జీతం విడుదల చేస్తా!

- తోటి ఉద్యోగిని లంచం అడిగి.. ఏసీబీకి చిక్కిన అధికారి

ఉప్పల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగికి పనిచేసి పెట్టడానికి కూడా లంచం ఆశించాడు విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ఓ ప్రబుద్ధుడు. ఒళ్లు మండిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సదరు ఉద్యోగి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ ఘటన శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. నాచారం ఏడీఈ(అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) కార్యాలయంలో ఆర్టిజెన్‌గా పనిచేస్తున్న భరత్ అనే వ్యక్తి 14 నెలల జీతం పెండింగ్ ఉండటంతో హబ్సిగూడ విద్యుత్‌శాఖ డివిజన్ కార్యాలయంలో జూనియర్ అకౌంట్స్ అధికారి విజయసింహారెడ్డిని సంప్రదించాడు. చాలా కాలంగా తన జీతం విడుదలలో జాప్యం జరుగుతోందని త్వరగా పరిష్కరించాలని కోరాడు. ఈ క్రమంలోనే నిలిచిపోయిన వేతనం విడుదల చేయడానికి విజయసింహారెడ్డి రూ. 35,000 లంచం అడగటంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కాగా, శుక్రవారం భరత్ నుంచి రూ. 35 వేల లంచం తీసుకుంటుండగా విజయసింహారెడ్డిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

9, 10 తేదీల్లో పౌర హక్కుల సంఘం సభలు

బర్కత్‌పుర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల సంఘం 50 వసంతాల సభలను ఈ నెల 9, 10 తేదీల్లో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ జి.హరగోపాల్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సభల వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ నెల 9న మహాసభను కేంద్ర సమాచార హక్కు మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ప్రారంభిస్తారని, నిర్బంధ చట్టాలు-న్యాయ వ్యవస్థ అంశంపై సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, పత్రికా స్వేచ్ఛ-నిర్బంధం అంశంపై ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్ ప్రసంగిస్తారని చెప్పారు. 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారొచ్చు

- ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి
- విచారణకు రాఘవ అన్నివిధాలా సహకరిస్తున్నాడన్న సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారేందుకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతినిచ్చింది. అప్రూవర్‌గా మారి క్షమాపణ పొందేందుకు కోర్టు అనుమతి కోరుతూ 306 సీఆర్‌పీసీ కింద రాఘవ సీబీఐ స్పెషల్ కోర్టును ఆశ్రయించాడు. రాఘవ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్.. రాఘవ అప్రూవర్‌గా మారేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాఘవ బెయిల్ పిటిషన్ స్పెషల్ కోర్టు ముందుకురాగా సీబీఐ ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. అలాగే లిక్కర్ కేసు ఎఫ్ఐఆర్‌లో రాఘవను నిందితుడిగా గానీ, అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఏ సంస్థల పేర్లను గానీ ప్రస్తావించలేదు. అంతేకాకుండా దర్యాప్తులో రాఘవ సహకరించారని, తమ సమన్లకు విధిగా హాజరయ్యారని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు. సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164(2) కింద నమోదు చేసిన వాంగ్మూలాల్లో కీలకమైన వాస్తవాలను వెల్లడించాడని పేర్కొంది. మరోవైపు ఈ కేసు వ్యవహారంలో సాక్షులను రాఘవ ప్రభావితం చేసినట్లు సీబీఐ గుర్తించలేదని కోర్టు అభిప్రాయపడింది.

5 నుంచి బీసీ 'విదేశీ విద్య' దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన బీసీ, ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ శాఖ కమిషనర్ బాల మాయాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 5 వరకు నెల రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ధరణి బూచితో భూమి స్వాహా

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. సర్వే నంబర్ '181/అ'లోని 2.12 ఎకరాలతో పాటు 189/ఆ, 189/ఉ, 189/ఊ, 189/రు, 189/ఈ2 లోని 5.35 ఎకరాల భూమిని జీపీఏ ద్వారా సర్వోత్తమ రెడ్డి, నీలారెడ్డి, మురళీకృష్ణ, నిత్యానంద అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేశారు. వీరంతా కలిసి ఈ లేఅవుట్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా అది 111జీవో పరిధిలోకి వస్తుందని.. అనుమతి ఇవ్వడం కుదరదని అధికారులు చెప్పారు. తర్వాత కొన్నాళ్లకు.. రియల్ ఎస్టేట్ ధరలు పెరగడంతో భూమిని సొసైటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెళ్తే .. అందులో కొంతభాగం భూదాన్ భూమిగా రికార్డుల్లో ఉన్నందున రిజిస్ట్రేషన్ కుదరదని చెప్పారు. దీంతో వారు.. 25-11-2006న ఓ తహసీల్దార్ ఆ భూమితో పాటు పక్కన ఉన్న మరికొన్ని భూములకు ఇచ్చిన పట్టా క్లియరెన్స్ ఉత్తర్వులను రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు చూపించారు. 2009లో సొసైటీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భూమి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారు. ఇదిలా ఉండగా.. ఈ సర్వే నంబర్లలోని భూములను 111జీవో పరిధి నుంచి మినహాయించాలంటూ కొందరు కోర్టుకెళ్లారు. అందులో తీర్పు అనుకూలంగా వస్తే తమకు కూడా ఉపశమనం కలుగుతుందని సొసైటీ సభ్యులు భావించారు. వారు అనుకున్నట్లే ఆ భూమి 111 జీవో పరిధిలోకి రాదని 2022 ఏప్రిల్‌లో హైకోర్టు ప్రకటించింది. అదే సమయంలో... అసలు 111జీవోనే రద్దుచేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. న్యాయస్థానం తీర్పు.. 111జీవో రద్దు నేపథ్యంలో ఆ భూముల ధరలు భారీగా పెరిగిపోయాయి. ఖాళీగా ఉన్న ఆ ఖరీదైన భూమిపై.. ఓ బడా వ్యక్తి కన్నుపడింది. వ్యవస్థలు తోడయ్యాయి. ధరణి భూతం తెరపైకి వచ్చింది. ఆ భూమిలో అధిక భాగం భూదాన భూమిగా ధరణిలో కనిపించింది. తమ కలలు నెరవేరుతున్నాయని సంబరపడ్డ సొసైటీ సభ్యులంతా.. ఈ పరిణామంతో అవాక్కయ్యారు. సొసైటీ అధ్యక్షుడు వేములపాటి ఉదయభాస్కర్, ఉపాధ్యక్షుడు బాల సుబ్రమణ్యంతో పాటు మేనేజింగ్ కమిటీ మెంబర్ కాటూరి వెంకట్.. దీనిపై ఆరా తీస్తామని సభ్యులకు చెప్పారు. కొన్నాళ్ల తర్వాత.. ఆ భూమి భూదాన్ భూమిగా రికార్డుల్లో ఉందని, దాన్ని మార్చడం కుదరదు కాబట్టి వచ్చిన రేటుకు తెగనమ్ముకుందామని అన్నారు. అందుకు కొందరు అంగీకరించలేదు. "దీనిపై కొట్లాడదాం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ సొసైటీ అధ్యక్షుడు.. "ఇప్పుడేమీ చేయలేం. ఎంతో కొంతకు తెగనమ్ముకోకపోతే మొత్తానికే నష్టపోతాం" అని వారికి నచ్చజెప్పారు. భూమిని కొనే పార్టీని కూడా తానే చూస్తానని.. అందరం కలిసి నిర్ణయం తీసుకుంటే వెంటనే డబ్బొచ్చే ఏర్పాటు కూడా చేస్తానని అన్నారు. ఇందుకు మెజారిటీ సభ్యులు అంగీకారం తెలిపి ఒక తీర్మానం కూడా చేశారు. అయితే.. నాలుగువారాల్లోగా ఈ ప్రక్రియ మొత్తం పూర్తి కావాలని, లేకుంటే తీర్మానం చెల్లదని కూడా అందులో రాసుకున్నారు. భూమి కొనేవారి వివరాలను సభ్యులకు కూడా తెలియజేయాలని.. వారితో బేరం కుదుర్చుకునే సమయంలో అందరినీ తీసుకెళ్లాలని కోరారు. కానీ, సొసైటీ అధ్యక్షుడు.. భూమి కొనేవారికి, సొసైటీ సభ్యులకు మధ్య ఎలాంటి సమావేశం నిర్వహించలేదు. ధర విషయం కూడా చర్చించలేదు. కొందరు సభ్యులకు అనుమానం వచ్చి నిలదీయడంతో.. గజానికి రూ.30 వేలు చొప్పున ఇప్పిస్తామని, అందులో గజానికి 25 వేల చొప్పున నగదు రూపంలో, మిగతా సొమ్మును చెక్ రూపంలో ఇస్తారని చెప్పుకొచ్చారు. దీనిపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ పక్క స్థలాలు గజం రూ.లక్ష నుంచి లక్షన్నర దాకా అమ్ముడవుతుండగా.. తమ భూమికి ఇంత తక్కువ ధర ఏమిటని ప్రశ్నించారు. దీనికి అధ్యక్షుడు.. "కొద్ది రోజులు ఆగితే ఈ ధర కూడా రాదు. మొత్తం భూమి ప్రభుత్వం చేతుల్లోకి వెళుతుంది" అని భయపెట్టారు. దీన్ని కొందరు సభ్యులు నమ్మారు. కానీ కొందరు సభ్యులకు అధ్యక్షుడిపై అనుమానం వచ్చి.. తమ భూమికి సంబంధించి క్రయవిక్రయాలు జరగకుండా చూడాలని రాష్ట్ర సహకార శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. తాము గతంలో భూమి అమ్మకం కోసం అధ్యక్షుడికి అధికారం ఇస్తూ ఇచ్చిన తీర్మానం గడువు ముగిసిందని.. అయినా కూడా ఆ పత్రాలతో సొసైటీ అధ్యక్షుడు, మరికొందరు కలిసి సొసైటీ భూమిని విక్రయిస్తున్నారని అందులో పేర్కొన్నారు. దీనిపై రఘునందన్‌రావు స్పందించి జిల్లా సహకార అధికారి (డీసీఓ) ధాత్రి దేవికి లేఖ రాశారు. ఆమె సొసైటీ సభ్యులందరినీ వేర్వేరుగా పిలిచి విచారించారు. ఈ భూముల విషయంలో ఏదో మతలబు జరుగుతోందని భావించి.. సొసైటీ భూమిని సభ్యులకు తప్ప బయట వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయరాదంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ కాపీలను స్థానిక తహసీల్దార్‌తో పాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు పంపారు. తరువాత దీనిపై పూర్తిస్థాయి నివేదిక కూడా ఉన్నతాధికారులకు పంపారు.



డీసీవో ఆదేశాలు పక్కనపెట్టి..

సొసైటీ సభ్యులకు కాకుండా మూడో వ్యక్తికి ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేయరాదని డీసీవో ఉత్తర్వులు జారీచేసిన కొన్ని గంటలకే ఈ భూమిని వేరేవారికి అమ్మడానికి రంగం సిద్ధమైంది. 2023 జనవరి 18న డీసీవో ఈ ఉత్తర్వులు స్థానిక తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సొసైటీ సభ్యులకు పంపగా.. మర్నాడు ఉదయం పదిన్నర గంటలకు సొసైటీ సభ్యులు ఆ ఉత్తర్వులతో గండిపేట తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ వారికి.. సొసైటీ అధ్యక్షుడు వీవీఎస్ ఉదయ భాస్కర్‌తో పాటు భూమి కొనుగోలు చేస్తున్న ప్రతిమ కన్‌స్ట్రక్షన్ అధినేత బోయినపల్లి శ్రీనివాసరావు (బోయినపల్లి వినోద్ సోదరుడు) కనిపించడంతో కంగుతిన్నారు. రిజిస్ట్రేషన్‌ను ఆపాలంటూ డీసీవో ఉత్తర్వులు చూపించారు. కానీ.. ఆ ఉత్తర్వులను డిప్యూటీ తహసీల్దార్ పట్టించుకోలేదు. స్లాట్ బుక్ అయినందున రిజిస్ట్రేషన్ ఆపలేనని చెప్పారు. ఫలితంగా సొసైటీకి చెందిన 8.07 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ చకచకా జరిగిపోయింది. అదేరోజు మ్యుటేషన్.. 20వ తేదీన నాలా కన్వర్షన్ కూడా జరిగిపోయింది. డీసీవో నుంచి వ్యతిరేక ఉత్తర్వులు వస్తున్నాయని ముందుగానే తెలుసుకున్న సొసైటీ అధ్యక్షుడు, శ్రీనివాసరావు.. 2023 జనవరి 18న సాయంత్రం 6:21 నిమిషాలకు రిజిస్ట్రేషన్ నిమిత్తం ధరణిలో స్లాట్ బుక్ చేయడం గమనార్హం. అంతేకాదు.. 2023 జనవరి 14వ తేదీన సైతం నిషేధిత జాబితాలో ఉన్న ఆ భూముల విక్రయానికి అనుకూలంగా 17వ తేదీన పాస్‌బుక్ విడుదలైంది. ఆ పాస్‌బుక్ సాయంతోనే 19వ తేదీన రిజిస్ట్రేషన్ జరిగిపోయింది. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే.. బోయినపల్లి శ్రీనివాసరావు.. సొసైటీ సభ్యులందరి అకౌంట్లలోకి గజానికి రూ.5,500 చొప్పున డబ్బు జమచేశారు. తనకు సహకరించిన వారికి మాత్రం మిగిలింది నగదుగా ఇచ్చి మిగతా వారికి మొండిచెయ్యి చూపారు. రిజిస్ట్రేషన్ అయ్యాక సొసైటీ చైర్మన్ ఉదయ భాస్కర్ కనిపించట్లేదని సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆయన ప్రస్తుతం అమెరికాలో ఉంటున్నట్లు సమాచారం.

భూదాన భూమి రికార్డుల్లో ఎలా మారింది?

భూమి సొసైటీ సభ్యుల చేతిలో ఉన్న సమయంలో అందులోని 189/ఆ, 189/ఉ, 189/ఊ, 189/రు, 189/ఈ2లలో గల 5.35 ఎకరాల భూమి భూదాన భూమిగా కనిపించింది. బోయినపల్లి శ్రీనివాసరావు ఈ భూమి వ్యవహారంలో దిగగానే.. భూదానభూమి కాస్తా ప్రైవేటుభూమిగా మారింది. రిజిస్ట్రేషన్ స్లాట్ బుక్ చేయడానికి కొద్ది రోజుల ముందే ఈ రికార్డు మారడం గమనార్హం. ఈ వ్యవహారంలో శ్రీనివాసరావు.. సొసైటీ సభ్యులను అడ్డుపెట్టుకుని చక్రం తిప్పారు. ఫలితంగా.. అభ్యంతరాలున్నా రిజిస్ట్రేషన్ చకచకా జరిగింది. మరో విచిత్రమేమిటంటే ఇందులోని 5.35 ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో గతంలోనే పెట్టారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి 22ఏలో ఉండడం గమనార్హం. అవి నిజంగా భూదాన్ భూములే అయ్యుంటే.. పాస్‌బుక్ ఎలా వస్తుంది? శ్రీనివాసరావుకు మాత్రం రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు? అని సొసైటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

కేసు పెట్టినా కొనసాగని విచారణ

తమకు జరిగిన అన్యాయంపై సొసైటీ సభ్యులు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తే కనీసం తీసుకునేందుకు కూడా అప్పటి పోలీసులు సహకరించలేదు. దీంతో సభ్యులు అప్పటి సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో.. కేసు నమోదు చేయాలంటూ ఆయన గచ్చిబౌలి పోలీసులను చేయాలని ఆదేశించారు. దీంతో 2023 జూలై 7న పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ శ్రీనివాసరావు అధికార పార్టీకి దగ్గర వ్యక్తి కావడంతో కేసు విచారణకు పోలీసులు సాహసించలేదు. అలాగే.. తమకు జరిగిన అన్యాయంపై కొందరు సభ్యులు ఏప్రిల్ 2023లో హైకోర్టును ఆశ్రయించగా.. తీర్పు వచ్చే వరకూ అక్కడ ఎలాంటి నిర్మాణాలూ చేపట్టరాదని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కానీ వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు.

అక్కడే హెలీప్యాడ్ నిర్మాణం కూడా!

ఈ భూములను చట్ట విరుద్ధంగా కొనుగోలు చేసిన బోయినపల్లి శ్రీనివాసరావు.. వాటి చుట్టూ పకడ్బందీగా నిర్మాణాలు చేపట్టారు. చుట్టూ ఉన్న ప్రహరీగోడ మీద ముళ్ల కంచె వేసి.. లోపలికి ఎవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. అంతేకాదు అందులో హెలీప్యాడ్ నిర్మాణం చేపట్టారు. పక్కనే చిన్న భవనాన్ని నిర్మించడం కూడా మొదలు పెట్టారు. ఈ విషయాన్ని సొసైటీ సభ్యులు కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో దాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. కాగా.. అక్కడ హెలీప్యాడ్‌ను తాను ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చానని శ్రీనివాసరావు కోర్టుకు తెలిపారు. కానీ ఆ సంస్థకు కూడా శ్రీనివాస్‌రావే యజమాని కావడం గమనార్హం. అసలక్కడి నుంచి కమర్షియల్ సర్వీసులకు అనుమతి ఉందా? లేదా? తెలుసుకునేందుకు సొసైటీ సభ్యులు డీజీసీఏను ఆర్టీవో ద్వారా సమాచారం కోరగా.. తాము ఆ ప్రాంతం నుంచి ఎలాంటి సర్వీసులకూ అనుమతి ఇవ్వలేదని డీజీసీఏ సమాధానం ఇవ్వడం గమనార్హం.

8 స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఖరారు !

- నలుగురు సిటింగ్ ఎంపీలకు లైన్‌క్లియర్
- చేవెళ్ల టికెట్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే..
- నేడు అధికారిక ప్రకటన వెలువడే అవకాశం

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలకు బీజేపీ అభ్యర్థుల ఎంపిక దాదాపుగా పూర్తయింది. పార్టీ తరపున గత ఎన్నికల్లో గెలిచిన నలుగురు సిటింగ్‌లతో పాటు మరో నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కివచ్చిందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి-సికింద్రాబాద్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్-కరీంనగర్, ధర్మపురి అర్వింద్ - నిజామాబాద్, సోయం బాపురావు - ఆదిలాబాద్ నుంచి మరోసారి బరిలోకి దిగనున్నారని బీజేపీ వర్గాలు చెప్పాయి. అలాగే, చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భువనగిరి నుంచి బూర నర్సయ్యగౌడ్‌కు టికెట్లు దాదాపుగా ఖాయమయ్యాయి. హైదరాబాద్ స్థానం నుంచి మాధవీలతకు టికెటు ఖాయమని అంటున్నారు. నాగర్‌కర్నూలు నుంచి సిటింగ్ ఎంపీ పి.రాములు తనయుడు భరత్ పోటీచేయనున్నారు. జహీరాబాద్ టికెట్ అంశం ఆసక్తికరంగా మారింది. శుక్రవారం బీజేపీలోకి చేరిన సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్, ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు, బీజేపీ సీనియర్ నేత మేడపాటి ప్రకాశ్ రెడ్డి తదితరులు ఈ టికెట్ రేసులో ఉన్నారు. నిన్నటివరకు ఆదిలాబాద్ టికెట్టు అంశం పెండింగ్‌లో ఉండగా, గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశం, సోయం బాపురావు వైపే మొగ్గుచూపినట్లు వివరించాయి. తెలంగాణ నుంచి ఎనిమిది మంది అభ్యర్థుల తొలి జాబితా శనివారం వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. పోటీ ఎక్కువగా ఉండడంతో మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, నల్లగొండ, మెదక్, ఖమ్మం అభ్యర్థులను మలిజాబితాలో ప్రకటించనున్నారు. మెదక్ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మహబూబ్‌నగర్ టికెట్ విషయంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గసభ్యులు ఏపీ జితేందర్‌రెడ్డి మధ్య పోటీ ఉంది. మల్కాజ్‌గిరి టికెట్ కోసం సీనియర్ నేత మురళీధర్‌రావు, ఈటల రాజేందర్, చాడ సురేశ్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్, కూన శ్రీశైలం గౌడ్, రాంచందర్‌రావు, కొంరయ్య పోటీ పడుతున్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ ఎంపీల క్యూ...

బీఆర్ఎస్ సిటింగ్ ఎంపీలు బీజేపీలోకి క్యూ కడుతున్నారు. నాగర్‌కర్నూలు ఎంపీ పి.రాములు గురువారం బీజేపీలో చేరగా, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ శుక్రవారం బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాషాయ కండువా కప్పుకున్నారు. మరో బీఆర్ఎస్ ఎంపీ కూడా బీజేపీ ముఖ్యనేతలతో చర్చిస్తున్నారు. బీఆర్ఎస్ మాజీ మంత్రి ఒకరు, తన తనయుడికి టికెట్ కోసం బీజేపీ ముఖ్యులతో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, గురువారం రాత్రి కొంతమంది నాయకులు నిర్వహించిన సమావేశంతో తనకు సంబంధం లేదని రాంచందర్‌రావు తెలిపారు.

ట్రైబ్యునల్‌తో మీకేంటి సంబంధం

- కేంద్ర ప్రభుత్వం వద్దే ఏపీ తేల్చుకోవాలి
- జలాల పంపిణీకి ట్రైబ్యునల్ వేయాలన్న ఏపీ వినతిపై తెలంగాణ అభ్యంతరం
- తెలంగాణ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోండి: ఏపీ
- వాడీవేడిగా గోదావరి బోర్డు సమావేశం



హైదరాబాద్ జలసౌధలో జరిగిన సమావేశంలో గోదావరి బోర్డు అధికారులు

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ జలాల పంపిణీ కోసం ట్రైబ్యునల్ వేయాలనే ఏపీ విజ్ఞప్తిని బోర్డు సమావేశంలో పెట్టడాన్ని తెలంగాణ తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతరాష్ట్ర నదీజలాల వివాద చట్టం ప్రకారం ఈ అంశాన్ని కేంద్రం వద్దే ఏపీ తేల్చుకోవాల్సి ఉంటుందని, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్-85 ప్రకారం బోర్డుకు దక్కిన అధికారాలకే పరిమితం కావాలని తెలంగాణ స్పష్టం చేసింది. ఫలితంగా తెలంగాణ అభ్యంతరాలతో ఈ అంశాన్ని చర్చించబోమని బోర్డు చైర్మన్ ముకేశ్ కుమార్ సిన్హా ప్రకటించారు. శుక్రవారం బోర్డు సమావేశం చైర్మన్ ఎంకే సిన్హా అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. సమావేశానికి తెలంగాణ నుంచి ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, నీటిపారుదల శాఖ కార్యదర్శి తరపున సంయుక్త కార్యదర్శి భీంప్రసాద్, ఈఎన్‌సీ(కరీంనగర్) శంకర్, సీఈ శంకర్‌నాయక్, అంతరాష్ట్ర ఎస్ఈలు కోటేశ్వరరావు, శ్రీధర్‌రావు దేశ్‌పాండే, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్‌తో పాటు ఏపీ నుంచి నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శితో పాటు సీఈ (హైడ్రాలజీ, అంతరాష్ట్ర) కుమార్, ఈఈ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్డు సమావేశం ఎజెండాలో కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం జారీ చేసిన టీవోఆర్(టర్మ్ అండ్ రిఫరెన్స్)ను చేర్చగా... ట్రైబ్యునల్ పరిధిలో ఉన్న అంశాన్ని చర్చించడాన్ని తెలంగాణ అభ్యంతరం తెలిపింది. తెలుగు రాష్ట్రాల్లో భారీగా టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలనే ప్రతిపాదనను తెలంగాణ వ్యతిరేకించింది. అంతరాష్ట్ర సరిహద్దులోనే టెలిమెట్రీ కేంద్రాలు పెట్టాలని, జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు(ఎన్‌హెచ్‌పీ) కింద ఏర్పాటు చేయాలని కోరింది. ఇక తెలంగాణ.. ఇందిరమ్మ ఫ్లడ్‌ఫ్లో కెనాల్, ఎస్ఆర్ఎస్‌పీ-2 విస్తరణ, శ్రీపాద ఎల్లంపల్లి సాగర్ ఎత్తిపోతలు, కుప్టిలను అక్రమంగా నిర్మిస్తోందని, వీటితో పాటు కాళేశ్వరం అదనపు టీఎంసీ నిర్మాణాన్నీ అడ్డుకోవాలని ఏపీ డిమాండ్ చేసింది. ఆ నాలుగు ప్రాజెక్టుల్లో మూడింటికి టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ (టీఏసీ) ఆమోదం లభించిందని, కుప్టి డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే అందిస్తామని తెలంగాణ గుర్తు చేసింది. ఏపీలోని గోదావరిలో అనుమతి లేని ప్రాజెక్టుల డీపీఆర్‌ల సంగతి ఏమిటి? అని ఈ సందర్భంగా గోదావరి బోర్డు ఏపీని ప్రశ్నించింది. ఇక గోదావరి బోర్డుకు అదనంగా సిబ్బందిని సమకూర్చాలన్న ప్రతిపాదనను ఇరు రాష్ట్రాలు మూకుమ్మడిగా వ్యతిరేకించాయి. ప్రాజెక్టులు అప్పగించనపుడు అదనంగా సిబ్బంది అవసరమే లేదని స్పష్టం చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బోర్డుకు రూ.16 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలుపాలని ప్రతిపాదించగా... 2023-24 ఆర్థిక సంవత్సరంలో వ్యయం రూ.8 కోట్లకు మించదని, రూ.10 కోట్లు సరిపోతుందని తెలుగు రాష్ట్రాలు గుర్తు చేశాయి. పంటసాగు వివరాలను శాటిలైట్ ఇమేజీ సహకారంతో తీయాలనే బోర్డు ప్రతిపాదనలను తెలుగు రాష్ట్రాలు తోసిపుచ్చాయి. ఈ-ఆఫీస్ ఖర్చు విషయంలో ఆడిట్‌లో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అధికారులు బోర్డును కోరారు.

పదేళ్ల దేశ అభివృద్ధిపై చర్చిద్దామా..?

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు కిషన్‌రెడ్డి సవాల్
- తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస పాలన
- ఈ సర్కారులోనూ రేషన్‌కార్డులు ఇవ్వరా?: సంజయ్


కమలాపూర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

హైదరాబాద్‌సిటీ/కమలాపూర్(ఎల్కతుర్తి), మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మోదీ పాలనకు ముందు దేశం ఎలా ఉండేది..? ఇప్పుడెలా ఉంది..? గమనించాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రజలను కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అనేక రకాలుగా మాట్లాడుతున్నాయని. పదేళ్ల క్రితం దేశం సరిగ్గా ఇదే రోజు దేశం ఎలా ఉందో చర్చిద్దామా?అని సవాల్ విసిరారు. సికింద్రాబాద్, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగిన విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీపై యుద్ధం చేస్తానంటున్న కేసీఆర్.. ముందుగా కుటుంబ పాలన మీద చేయాలని సూచించారు. తెలంగాణలో పథకాలను కాంగ్రెస్ ఎలా అమలు చేస్తుందో చెప్పాలన్నారు. దివ్యాంగులకు పెన్షన్, రిజర్వేషన్ పెంచిన ఘనత మోదీకే దక్కుతుందని అన్నారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ రాక్షస పాలన సాగుతోంద ఎంపీ బండి సంజయ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సంజయ్ యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులు జారీ చేయకుండానే.. రేషన్ కార్డులు ఉన్న వారికే 6 గ్యారెంటీలను అందిస్తామని చెప్పడం సరికాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కనిపిస్తున్నా.. కేసీఆర్‌పై కేసులు పెట్టడం లేదన్నారు.

కేసీఆర్ కంటే రేవంత్ బెటర్: కొండా

మాజీ సీఎం కేసీఆర్ కంటే సీఎం రేవంత్‌రెడ్డి బెటర్ అని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రేవంత్, గౌరవప్రదంగా వ్యవహరిస్తున్నారని, కేంద్రంతో మెరుగైన సంబంధాలు కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై కేసీఆర్ కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతోందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకునేందుకు రేవంత్ సిద్ధంగా ఉన్నా.. కాంగ్రెస్ అధిష్ఠానం అనుమతి ఇవ్వడం లేదని చెప్పారు.

రూ.15 వేల కోట్ల పనులకు మోదీ శ్రీకారం..

హైదరాబాద్: ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా రూ.15,718 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 4న ఆదిలాబాద్ పర్యటన సందర్భంగా రూ.6,697కోట్ల విలువైన అభివృద్ధి పనులకు.. 5న సంగారెడ్డి పర్యటనలో రూ.9,021కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉంటాయని కిషన్‌రెడ్డి తెలిపారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
నవ్య స్మార్ట్
శనివారం • 2 మార్చి 2024

వెకేషన్ నుంచి ఫుడ్ వరకు ప్లానింగ్ చేసే
మైక్రోసాఫ్ట్ కోపైలెట్ జీపీటీ



చాట్ జీపీటీ గురించి అందరికీ తెలిసిందే. కొద్ది కాలంలోనే అది ఎంత పాపులర్ అయిందో మనకు తెలుసు. కొన్ని సంవత్సరాల్లో ఇది గూగుల్‌ను రిప్లేస్ చేసినా ఆశ్చర్య లేదు. చాట్ జీపీటీ తరహాలో మైక్రోసాఫ్ట్ కోపైలెట్ జీపీటీని తీసుకుని వస్తోంది. ఇది ఫుడ్ ప్రిపరేషన్ మొదలుకుని టూర్‌లు ప్లాన్ చేసుకోడానికి సహకరిస్తుంది.

మైక్రోసాఫ్ట్ తెచ్చే ఈ కోపైలెట్ జీపీటీ చాలా విషయాల్లో సహకరిస్తుంది. మైక్రోసాఫ్ట్ కొద్దికాలంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. రాబోయే సెలవులు గడపడం నుంచి డిజైన్ క్రియేషన్, కొత్త వంటకాలు, ప్రత్యేకంగా వర్కౌట్ ప్లాన్ వరకు వివిధ టాస్క్‌లను నెరవేర్చుకునేందుకు ఈ కోపైలెట్ ఉపయోగపడుతుంది. అలాగే జీపీటీ బిల్డర్స్‌కు అవకాశం ఉంది. దీంతో యూజర్లు తమ అవసరాలకు అనుగుణంగా జీపీటీలను రూపొందించుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇది ఎక్స్‌పెరిమెంట్ దశలో ఉంది. మైక్రోసాఫ్ట్ కోపైలెట్ - డిఫాల్ట్ అసిస్టెంట్ యాప్‌గా ఆండ్రాయిడ్‌లో ఉంటుంది. గూగుల్ అసిస్టెంట్ మాదిరిగా యాక్సెస్ పొందవచ్చు. పవర్ బటన్‌ను లాంగ్ ప్రెస్ లేదా స్క్రీన్‌పై డయాగ్నల్‌గా స్వైప్ చేయడం ద్వారా తీసుకోవచ్చు.

మాట్లాడలేని వాళ్ళకు గొంతు 'విష్'



సర్వరోగ నివారిణిగా సాంకేతికతను ముమ్మరంగా వినియోగించుకునే రోజులివి. సుదూరంగా ఉన్న రోగులను సైతం ఆదుకునే మార్గాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో డచ్ స్టార్టప్ ఒకటి గొంతుపోయిన వ్యక్తుల పాలిట కల్పవృక్షంగా మారింది. వారి కోసం ప్రత్యేకించి విష్ పేరిట ఒక యాప్‌ను రూపొందించింది. బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో సదరు యాప్‌ను ప్రదర్శించింది. తగ్గిపోయిన వాయిస్, బలహీనపడిన ఓకల్‌కార్డ్(స్వరతంత్రి)ని సహజమైన వాయిస్‌గా ఈ యాప్ మారుస్తుంది. అనారోగ్యం, వయసు మీరడం తదితరాల్లో ఏదైనా కావచ్చు - సహజమైన గొంతును కోల్పోయిన వ్యక్తులకు ఇది బాసటగా నిలుస్తుంది. ఆడియో టు ఆడియో ఆధారిత ఏఐ ఇది. సంప్రదాయ పద్ధతిలో అంటే స్పీచ్ టు టెక్స్ట్‌కు బదులు రియల్‌టైమ్ వాయిస్ పెంపునకు ఇది దోహదపడుతుంది. లెటెన్సీని తగ్గిస్తుంది. సంభాషణ ఫ్లో ఆగకుండా కాపాడుతుంది. దీనికోసం ముందుగా సదరువ్యక్తి వాయిస్‌ని రికార్డు చేయాలి. అప్పుడు మాత్రమే దాన్ని విస్తరించవచ్చు. యాప్‌లో ఉండే ఈ ఆప్షన్‌తో బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌ని తొలగించడమే కాదు, సహజ గొంతును పెంచవచ్చు. ముందుగా సెట్ చేసుకున్న వాయిస్‌ను కూడా పొందవచ్చు. అదో అదనపు వెసులుబాటు. రమారమి ఇరవై డాలర్లు నెలకు చెల్లించి గొంతు మూగపోయిన వ్యక్తులు ప్రయోజనం పొందవచ్చు.



టోల్ కట్టకుండా సేఫ్ ట్రావెల్!



ప్రయాణం అంటే పెట్రోల్‌కు తోడు టోల్ టాక్సులతో కలిపి ఖర్చు తడిసి మోపెడు అవుతోందన్న ఆవేదనను చాలామంది వ్యక్తం చేస్తుంటారు.. ఇందుకు తరుణోపాయం గూగుల్ మ్యాప్స్‌లోనే ఉంది. గూగుల్ మ్యాప్స్‌లోనే మరింత సెర్చ్‌తోనే ఇది సాధ్యమవుతుంది. జస్ట్ కొద్దిపాటి టిప్స్‌తో టోల్ ట్యాక్స్‌లను తప్పించుకోవచ్చు. తద్వారా ఆ ఖర్చు తగ్గించుకోవచ్చు. బడ్జెట్ ఫ్రెండ్లీ డ్రైవ్ చేసుకోవచ్చు. అందులో భాగంగా....

- గూగుల్ మ్యాప్స్ యాప్‌లో స్టార్టింగ్, డెస్టినేషన్ లొకేషన్‌లను తెలియజేయాలి.
- ఐఫోన్‌లో త్రీడాట్ మెనూని టాప్ చేయాలి. ఆండ్రాయిడ్ యూజర్లు త్రీ వెర్టికల్ డాట్స్‌ను టాప్ చేయాలి.
- మెనూ నుంచి ఆప్షన్స్‌ని ఎంపిక చేయాలి. సెట్టింగ్స్‌లో అవాయిడ్ టోల్స్, అవాయిడ్ మోటార్ వేస్ అని రెండే ఉంటాయి. వాటిని టోగెల్ చేయాలి.
- గూగుల్ మ్యాప్స్ యూజర్ ప్రాధాన్యాలను గుర్తిస్తుంది. ఆటోమేటిక్ ప్లానింగ్ చేసేస్తోంది. టోల్స్, హైవేస్ లేకుండా చూస్తుంది. ఇది వద్దనుకుంటే ఇందాకటి స్టెప్స్‌ని రిపీట్ చేయాలి.
- నిజానికి మోటారు సైకిలిస్టులు, వ్యక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ రూట్స్‌లో వేగంగా వెళ్ళకూడదు. ప్రధాన రహదారులు కానందున రోడ్స్ ఎలా ఉంటాయన్నది కూడా చెప్పలేం. ప్రధాన రహదారుల మాదిరిగా విశాలంగా డివైడర్స్ తదితరాలతో ఉండకపోవచ్చు. ఖర్చు మాత్రం గణనీయంగా తగ్గుతుంది. ఇక ఎంపిక యూజర్ అభీష్టాన్ని బట్టి ఉంటుందని వేరే చెప్పాల్సిన పనిలేదు.

హ్యాండ్‌రిటెన్ యానొటేషన్ ఫీచర్



గూగుల్ డాక్స్ - ఒక మలుపుతిప్పే ఫీచర్‌ను పరిచయం చేస్తోంది. యూజర్లు ఇకపై డాక్యుమెంట్స్‌పైనే చేత్తో రాయడంలో భాగంగానే యానొటేషన్ అంటే అదనపు నోట్స్, కామెంట్ లేదా ఆదేశం ఇచ్చే అవకాశాన్ని కల్పిస్తోంది.

చేతిరాత అంటే చేతి వేళ్ళే కాకుండా స్టయిలస్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. గూగుల్ వర్క్‌స్పేస్ కస్టమర్స్‌కు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. సబ్‌స్క్రయిబర్లు, పర్సనల్ గూగుల్ అకౌంట్స్ ఉన్న వ్యక్తులు కూడా ఈ ఫీచర్‌తో ప్రయోజనం పొందవచ్చు. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ని ఆండ్రాయిడ్ డివైజ్‌లకు పరిమితం చేశారు. రేపిడ్ రిలీజ్ యూజర్లకు దీన్ని ఫిబ్రవరి 27న రిలీజ్ చేశారు. మార్చి 11లోగా గూగుల్ స్టాండర్డ్ రిలీజ్‌కు చేరుకోవాలి. అలా చేస్తే స్టాండర్డ్ పెన్, హైలైటర్ కలర్స్ తదితరాలను ఆఫర్ చేసింది. ఈ ఫీచర్‌ని ఎడ్యుకేటర్లు కూడా ఉపయోగించుకోవచ్చు. విద్యార్థులు రాసే వ్యాసాలపై ఫీడ్‌బ్యాక్ అందించడం సహా క్రియేటివిటీకి సంబంధించిన పలు ప్రొఫెషనల్ పనుల్లో దీన్ని వాడుకోవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్‌లో స్నాప్‌చాట్ ఫీచర్స్!



స్నాప్‌చాట్‌లో ప్రస్తుతం ఉన్న మంచి ఫీచర్లను ఇన్‌స్టాగ్రామ్ సైతం అందించే యత్నాల్లో ఉంది. అందులో ఫ్రెండ్స్ మ్యాప్ ఫీచర్ ఒకటి. దీంతో ఫ్రెండ్స్ షేర్ చేసిన కంటెంట్‌ను లొకేషన్ ట్యాగ్స్‌తో కలిపి చూడవచ్చు. నోట్స్‌లో గ్రూప్ చాట్ సంభాషణలు, స్టోరీలకు ఏఐ స్టిక్కర్లు, కెరోసల్ పోస్టులు తదితరాలు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండనున్నాయి. మొబైల్ డెవలపర్ ఒకరు ఎక్స్‌లో ఈ మేరకు పోస్టు ఒకటి పెట్టారు. మ్యాప్ ఫీచర్ రాబోతున్నట్టు తనే వెల్లడించారు. స్నాప్‌చాట్‌లో యూజర్లకు స్నాప్ మ్యాప్ ఉంటుంది. లొకేషన్ సహా తమ స్నేహితుల యాక్టివిటీస్‌ని తెలుసుకోగలుగుతారు. సరిగ్గా అదే పద్ధతిలో ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఉండొచ్చని చెబుతున్నారు. లొకేషన్ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయి ఉంటుందని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోందని సదరు లీకర్ కథనం

అయిదు మోడల్స్‌తో ఐఫోన్ 16?



యాపిల్ ఈసారి స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌ను ఒక కుదుపునకు గురిచేసే ఎత్తుగడలో ఉందన్న పుకార్లు వినిపిస్తున్నాయి. ఎకాఎకిన అయిదు మోడల్స్‌తో ఐఫోన్ 16 సిరీస్ విడుదల కానుందని సమాచారం. వివరాల్లోకి వెళితే...

- **ఐఫోన్ 16 ఎస్‌ఈ, ఐఫోన్ 16 ప్లస్ ఎస్‌ఈ:** ఇవి బడ్జెట్ ఫోన్లు. సింగిల్ పిల్ షేప్‌తో రేర్ కెమెరా లేఔట్, డైనమిక్ ఐలండ్ టెక్నాలజీ, స్టాండర్డ్ 60హెచ్‌జెడ్ డిస్‌ప్లే, కాంపాక్ట్ బ్యాటరీ కాన్ఫిగరేషన్స్ వీటి సొంతం.
- **ఐఫోన్ 16:** మిడిల్ రేంజ్ మార్కెట్‌ను ఉద్దేశించి దీన్ని రూపొందించారు. 120హెచ్‌జెడ్ స్క్రీన్ డిస్‌ప్లే, డ్యూయల్ రేర్ కెమెరా సెటప్, ఎన్‌హ్యాన్స్‌డ్ ఫొటోగ్రఫీ, గరిష్టీకరించిన బ్యాటరీ పర్ఫార్మెన్స్‌తో వస్తోంది.
- **ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్రొమాక్స్:** కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో వచ్చే ప్రీమియమ్ ఫోన్లు ఇవి. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, వెర్టికల్ అరేంజ్‌మెంట్స్‌తో అడ్వాన్స్‌డ్ ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, స్లీక్ పిల్ షేప్డ్ కెమెరా బంప్స్ ఉంటాయి.

మొత్తమ్మీద వీటి రేట్లు 700 డాలర్ల నుంచి 1100 డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వేరియంట్, వెర్షన్, మోడల్‌ను బట్టి ధరలో మార్పులు ఉంటాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ఇవి రావచ్చని అనుకొంటున్నారు.

ఎక్స్‌లోడర్
ఆండ్రాయిడ్ తాజా మాల్వేర్



ఆండ్రాయిడ్ డివైజ్‌లకు తాజాగా మరో మాల్వేర్ ముప్పు పొంచి ఉంది. క్రోమ్ బ్రౌజర్‌తో అదృశ్య శక్తిగా చొచ్చుకువస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆండ్రాయిడ్ డివైజ్‌లను అల్లకల్లోలం చేసే పరిస్థితులు నెలకొన్నాయని నివేదికలు వెలువడుతున్నాయి. ఆండ్రాయిడ్ ఎక్స్‌లోడర్ మాల్వేర్ పూర్తి మోసపూరిత విధానాలను అనుసరిస్తోంది. దీనిలో భాగంగా మోసపూరిత వెబ్‌సైట్ లింకులతో ఎస్‌ఎంఎస్ మెసేజెస్ అందుతాయి. వాటిపై క్లిక్ చేయగానే డివైజ్‌ల యాక్సెస్ హ్యాకర్లకు లభిస్తుంది. అక్కడి నుంచి తస్కరణ ఆరంభమవుతుంది. క్రోమ్ బ్రౌజర్ అంటూ మాల్వేర్ ఉన్న ఏపీకే ఫైల్స్ వాటి ఇన్‌స్టలేషన్‌కు వీలుకల్పిస్తాయి. చివరాఖరుకు అనాథరైజ్డ్ యాక్సెస్‌తో నేపథ్యంలో ఉంటూ అనుచిత కార్యకలాపాలకు ఈ మాల్వేర్ వీలుకల్పిస్తుంది. అనధికారికంగా యాక్సెస్ పొంది అనుచిత చర్యలకు పాల్పడటానికి దోహదపడుతుంది. పాస్‌వర్డ్స్, ఫొటోలు, కాంటాక్ట్ వివరాలు తదితరాలన్నింటినీ తస్కరించే అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు ప్లే ప్రొటెక్ట్‌ను ఆసరా చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

వాట్సాప్ 'సెర్చ్ బై డేట్'



వాట్సాప్ తాజాగా 'సెర్చ్ బై డేట్' ఫీచర్‌ను ప్రకటించింది. ఇది అందుబాటులోకి వస్తే, తేదీ ప్రకారం మెసేజ్‌లను కనుగొనవచ్చు. అంటే ఇంతకుమునుపు షేర్ చేసిన మెసేజ్‌ను ఈ ఫీచర్‌తో మళ్ళీ పొందవచ్చు. ఇది వ్యక్తిగతం అలాగే గ్రూప్ చాట్స్‌కు కూడా వర్తిస్తుంది. ఈ మేరకు జుకర్‌బర్గ్ ఒక వీడియోను తన వాట్సాప్ అధికారిక చానల్‌లో పోస్ట్ చేశారు. ఆండ్రాయిడ్ డివైజ్‌లకు తోడు ఐఓఎస్, మేక్, వాట్సాప్ వెబ్‌లో ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులో ఉందని 'టెక్‌క్రంచ్' తెలిపింది. మీడియా టైప్ అంటే లింక్స్, మీడియా, డాక్యుమెంట్స్, నేరుగా జరిపిన సంభాషణల ఆధారంగా సెర్చ్ చేసుకోవచ్చు. డేట్ గుర్తుంటే నేవిగేషన్ చాలా సులువు అవుతుంది. కుడివైపు టాప్‌లో మూడు డాట్స్‌ని టాప్ చేయాలి. అక్కడ సెర్చ్‌ను కనుగొనాలి. దానికి కుడిపక్కన క్యాలండర్ ఐకాన్ ఉంటుంది. అందులో డేట్ ఎంపిక చేసుకుంటే ఆ రోజు షేర్ చేసిన లింకులు, మీడియా, డాక్యుమెంట్స్‌కు తోడు సంభాషణలు కనిపిస్తాయి. ఇవి కాకుండా చాట్ ఫిల్టర్స్, ఫేవరైట్స్ వంటి ఫీచర్లపై కూడా వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం.

5ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో టెట్రాప్రిజిమ్ కెమెరా



ఐఫోన్ 16లో - 5ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో టెట్రాప్రిజిమ్ కెమెరా ఉంటుందని మరో వార్త. 'ట్రెండ్‌ఫోర్స్' రిపోర్ట్‌లో ఉన్న విషయమిది. పెరిస్కోపిక్ లెన్స్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో యాపిల్ దీన్ని ఐఫోన్ 16 సిరీస్‌లో పరిచయం చేస్తోంది. టెట్రాప్రిజమ్ అంటే నాలుగు ప్రిజమ్స్(పట్టకాలు). పెరిస్కోప్ మాదిరిగా అంటే అందులో సింగిల్ ప్రిజమ్ ఉంటుంది. కాంతిని 90 డిగ్రీలకు వంచుతుంది. అది నాలుగు రెట్లు అంటే డీఎస్ఎల్‌ఆర్ కెమెరాలో 120ఎంఎం లెన్స్‌కు సమానమని అర్థం చేసుకోవాలి. అలా లాంగర్ పాథ్ క్రియేషన్‌కు ఇది ఉపయోగపడుతుంది. దీంతోపాటు స్క్రీన్ సైజును 6.3 ఇంచీలకు పెంచుతోందని పేర్కొంది. ఐఫోన్ 15 ప్రొ మోడల్ స్క్రీన్ 6.1 ఇంచీలు మాత్రమే. ఫలితంగా ఇంటర్నల్ స్పేస్ పెరిగి, టెట్రాప్రిజమ్ కెమెరాను ఉంచడానికి వీలవుతోందని వివరించింది. మొత్తమ్మీద ఈ పుకార్లు, వేర్వేరు కథనాలు కలిపి ఐఫోన్ 16పై అంచనాలను పెంచేస్తున్నాయంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదని చెప్పవచ్చు.

టెలికం ఆపరేటర్లకు తలనొప్పి స్మిషింగ్



స్మిషింగ్ - టెలికం ఆపరేటర్లకు నిజంగానే తలనొప్పిగా మారింది. ఎస్‌ఎంఎస్, ఫిషింగ్‌ని కలిపి స్మిషింగ్ అంటారు. ఫేక్ మొబైల్ టెక్స్ట్ మెసేజ్‌లతో సైబర్ క్రిమినల్స్ చెలరేగిపోతుంటారు. ఆ మెసేజ్‌లు తద్వారా లింకులతో దిగుమతి అయ్యే మాల్వేర్ - యూజర్ల సెన్సిటివ్ సమాచారం సహా డబ్బుల తస్కరణకు ఉపయోగించుకుంటారు. అసలు విషయానికి వస్తే, రోజుకు సగటున మూడు నుంచి నాలుగు లక్షలు మేర ఎస్‌ఎంఎస్ అటాక్స్ ఉంటున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గుర్తు తెలియని సోర్సుల నుంచి ఈ దాడి జరుగుతోంది. కొవిడ్ సమయంలో ఆరంభమైన ఈ దాడి రోజురోజుకు తీవ్రమౌతోంది. మొబైల్ ఎకోసిస్టమ్ ఫోరమ్(ఎంఈఎఫ్) పది దేశాల్లో నిర్వహించిన అధ్యయనంలో 39 శాతం మంది వినియోగదారులు - ఈ స్మిషింగ్ బారిన పడుతున్నారని తేలింది. బార్సిలోనాలో ఇటీవల జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. నిజానికి ఇదో సీరియస్ వ్యవహారమని తైవానీస్ సైబర్ సెక్యూరిటీ సంస్థ పిన్‌ట్రస్ట్ హెడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క అమెరికాలోనే 2022లో ఈ స్మిషింగ్‌తో 330 మిలియన్ డాలర్ల మొత్తాన్ని దోచారని ఫెడరల్ ట్రేడ్ కమిషన్ పేర్కొంది. ఈ విషయంలో కొన్ని దేశాలు సీరియస్‌గానే వ్యవహరిస్తున్నాయి. అయితే యూజర్ల అప్రమత్తతే దీనికి విరుగుడని పలువురు నిపుణులు పేర్కొనడం గమనార్హం.

మొబైల్ ఫోన్ పిల్లలతో జాగ్రత్త సుమా!

నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వకతప్పదు. అదేవిధంగా ఏవి చూస్తారో, మరి వేటికి అడిక్ట్ అవుతారో అన్న భయం కూడా తల్లిదండ్రులకు ఉంటుంది. అలాగని ఇవ్వబోమని భీష్మించుకుని కూర్చోవడం తగదు. ఈ నేపథ్యంలో పేరెంట్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే...



- ఇప్పటి డివైజుల్లో పేరెంటల్ కంట్రోల్ ఫీచర్స్ చాలానే ఉన్నాయి. కొన్ని యాప్స్, వెబ్‌సైట్స్ అలాగే పిల్లలకు అవసరం లేని కంటెంట్‌ను వాటితో చాలా సులువుగా నియంత్రించవచ్చు.
- కంటెంట్ ఫిల్టర్లు మరొకటి. పూర్తిగా బ్లాక్ చేయడం ఒక విధానం. యాక్సెస్‌ను పరిమితం చేయడం మరొకటి. నిజానికి ఈ ఫిల్టర్లు ప్రొటెక్షన్‌కు సంబంధించి అదనపు లేయర్‌గా ఉపయోగపడతాయి.
- వెబ్ బ్రౌజర్స్‌పై సేఫ్ సెర్చ్ సెట్టింగ్స్‌ను యాక్టివేట్ చేయవచ్చు. పిల్లల వయసుకు తగ్గట్టుగా మాత్రమే సెర్చ్ ఇంజన్ పనిచేసేలా ఫిల్టర్ పెట్టవచ్చు. వారికి తగ్గ లేదా అవసరమైన మెటీరియల్ మాత్రమే అందుబాటులోకి వచ్చేలా చూడవచ్చు.
- యాప్ పర్మిషన్స్ నిర్వహణ, సమీక్ష కూడా చాలా అవసరం. సెన్సిటివ్ డేటా విషయంలో కంట్రోల్ ఉంచాలి. అంటే కాంటాక్ట్ నుంచి అత్యంత ముఖ్యమైన సమాచారం విషయంలో పిల్లల ప్రైవసీకి ఆటంకం కలుగకుండా చూడాలి.
- స్క్రీన్‌టైమ్ లిమిట్ మరొకటి. వయసు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని పిల్లలు వీక్షించే సమయాన్ని కంట్రోల్ చేయాలి. ఆ పరిమితి దాటకుండా చూడాలి. వారి కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

వీటికి తోడు పిల్లల విషయంలో మరికొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలి.

- ఇంటర్నెట్ సేఫ్టీపై పిల్లలతో కూలంకుషంగా, ఓపెన్‌గా మాట్లాడాలి.
- ఆన్‌లైన్ రిస్కులపై అవగాహన కలిగించాలి.
- పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను మానిటర్ చేయాలి.
- ఇతరుల ప్రైవసీని గౌరవించడం, ఆన్‌లైన్ మర్యాదలను తెలియజేయాలి. డిజిటల్ సిటిజన్‌షిప్ విషయం బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరాన్ని పక్కాగా చెప్పాలి.
- చెప్పడానికి ముందు ఆచరించాలన్న విషయాన్ని కూడా తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి.

ట్రూకాలర్ నుంచి కాల్ రికార్డింగ్...!



ట్రూకాలర్ - కాల్ రికార్డింగ్స్‌కు తోడు ఏఐ పవర్డ్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫీచర్లను ఇండియాకు కూడా తీసుకువచ్చింది. ఇంతకు మునుపు ఇది అమెరికాకు పరిమితం. ఏడాది లోపే వివిధ ప్రాంతాలకు ఈ రెంటినీ విస్తరించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఇద్దరికీ ఈ ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి ప్రీమియమ్ ఫీచర్లు. యాప్ పెయిడ్ యూజర్లు మాత్రమే వీటిని వినియోగించగలరు. యాప్ పరిధిలోనే కాల్స్‌ను నేరుగా రికార్డ్ చేస్తుంది. మూడో పార్టీ ప్రమేయాన్ని అనుమతించదు. అదేవిధంగా అందుకున్న కాల్‌కు సంబంధించి ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయం కూడా ఉంటుంది. కాల్ ఒకసారి పూర్తి కాగానే ట్రాన్స్‌క్రిప్షన్ అందుబాటులోకి వస్తుంది. ఈ యాప్ ఇంతకుమునుపే ఈ సదుపాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది. అయితే గూగుల్ పెట్టిన ఆంక్షలతో ఆపేసింది.

అలాగే ఐఫోన్‌లో ఆంక్షలు ఎక్కువ. అందువల్ల ట్రూకాలర్ యూజర్లు సెర్చ్ పేజీలోకి వెళ్ళి 'రికార్డ్ ఎ కాల్'ని టాప్ చేయాలి. తదుపరి స్పెషల్ నంబర్ ఒకటి ఇస్తుంది. దాంతో ఈ బెనిఫిట్‌ను ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్‌లో ఈ సదుపాయం సూటిగా ఉంటుంది. ట్రూకాలర్ దీని కోసం డెడికేటెడ్ బటన్ ఒకటి ఉంచింది. దాంతో పని కానిచ్చేయవచ్చు. ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయం ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీలో మాత్రమే లభ్యమవుతుంది.

గూగుల్ పిక్సెల్ 8 సిరీస్, పాత జనరేషన్‌లో సపోర్ట్ చేసే గూగుల్ మోడల్స్, గెలాక్సీ ఏఐని సపోర్ట్ చేసే శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లలో ఇది ఇన్‌బిల్ట్ ఫీచర్. అలా లేనివాళ్ళు రేటు భరించి ట్రూకాలర్ నుంచి పొందవచ్చు. ఇది పెయిడ్ ఫీచర్. ఇండియాలోని సబ్‌స్క్రయిబర్లు నెలకు రూ.75 అదే ఏడాదికి రూ.529 ఈ రెంటికీ చెల్లించాల్సి ఉంటుంది.



కాల్ హిస్టరీ కావాలంటే...!



అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. సమస్త పనులకు మొబైల్ ఉపయోగించే వ్యక్తులకు కాల్ చరిత్ర అవసరం ఎప్పుడైనా పడవచ్చు. అలాంటి సందర్భాల్లో, ఆరు నెలల హిస్టరీ కావాలంటే ఎయిర్‌టెల్, జియో యూజర్లు సులువుగా పొందవచ్చు. ఎయిర్‌టెల్ యూజర్లు ఎస్‌ఎంఎస్ లేదా ఎయిర్‌టెల్ వెబ్‌సైట్ నుంచి వివరాలు తీసుకోవచ్చు. జియో యూజర్లకు ఈ విషయంలో మైజియో యాప్ ఉపయోగపడుతుంది.

ఎయిర్‌టెల్ యూజర్లకు రెండు విధాలుగా గడచిన ఆరు నెలల కాల్ హిస్టరీని పొందవచ్చు. మొదటిది ఎస్‌ఎంఎస్ విధానం. మెసేజ్ యాప్‌ని ఓపెన్ చేసి రిసీవర్ దగ్గర 121ని ఎంటర్ చేయాలి. "EPREBILL" అని టైప్ చేయాలి. ఎప్పటి నుంచి మరెప్పటివరకు కావాలో వివరాలను పొందుపర్చాలి. ఈమెయిల్ ఐడీని కూడా ఎంటర్ చేసి ఉపయోగిస్తున్న ఎయిర్‌టెల్ మొబైల్ నంబర్ నుంచి పంపాలి. రెండో పద్ధతిలో ఎయిర్‌టెల్ కస్టమర్ సర్వీసును సంప్రదించవచ్చు. ఎయిర్‌టెల్ కస్టమర్ కేర్ నంబర్‌ని కాంటాక్ట్ చేయాలి లేదంటే ఎయిర్‌టెల్ స్టోర్‌కి వ్యక్తిగతంగా వెళ్ళాలి. దీనికి కొంత మొత్తం ఫీజుగా వసూలు చేయవచ్చు. వెబ్‌సైట్‌లో అంటే అక్కడ మొబైల్ నంబర్, పాస్‌వర్డ్‌తో ఎంటర్ కావాలి. 'యూజింగ్ డీటైల్స్' సెక్షన్‌లోకి వెళ్ళాలి. వ్యూకాల్ రికార్డ్స్ ఆప్షన్‌ని పట్టుకోవాలి. అక్కడ కోరుకున్న తేదీ - రేంజ్ వివరాలు ఎంచుకుని సబ్మిట్‌పై క్లిక్ చేయాలి. వెంటనే స్క్రీన్‌పై ఆ వివరాలు ప్రత్యక్షమవుతాయి. జియో నంబర్స్ విషయానికి వస్తే, మైజియో యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్ళి జియో నంబర్ని లింక్ చేసుకోవాలి. మూడు హారిజాంటల్ లైన్స్‌పై క్లిక్ చేయాలి. మై స్టేట్‌మెంట్ ఆప్షన్స్‌పై టాప్ చేయాలి. కాల్ రికార్డ్సు ఏ మేరకు అవసరమో తేదీ సహా వివరాలను ఎంటర్ చేయాలి. వ్యూపై టాప్ చేస్తే చాలు, కాల్ రికార్డ్స్ ప్రత్యక్షమవుతాయి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 2 మార్చి 2024

ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలు

గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న - ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. రాత పరీక్ష ద్వారా ఆరో తరగతిలో అడ్మిషన్స్ ఇస్తారు. అలాగే ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 28 గురుకులాల్లో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. బోధన, వసతి ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులు దరఖాస్తు ఫారంలో తాము ఎంచుకొన్న గురుకులాల ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా సూచించాలి.

సీట్లు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల వారీగా కేటాయించిన గురుకులాల్లో ఆరోతరగతిలో మొత్తం 1680 సీట్లు ఉన్నాయి. ప్రతి గురుకులంలో 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను బాలికలకు ప్రత్యేకించారు.

- ఏడోతరగతిలో బాలురకు 17, బాలికలకు 19; ఎనిమిదోతరగతిలో బాలురకు 32, బాలికలకు 8; తొమ్మిదోతరగతిలో బాలురకు 35, బాలికలకు 11 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయి.

అర్హత: ఆరోతరగతిలో చేరాలంటే విద్యార్థులు గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదోతరగతి చదివి ఉండాలి. ఇంటిదగ్గరే చదువుకున్న విద్యార్థులు కూడా అర్హులే. వీరికి తల్లిదండ్రులు/సంరక్షకులు డిక్లరేషన్‌ను సమర్పించాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో చేరే విద్యార్థులు వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు ఉత్తీర్ణులై ఉండాలి.


- ఆరోతరగతిలో చేరే విద్యార్థుల వయసు 2024 మార్చి 31 నాటికి పదేళ్ల నిండి 13 ఏళ్లలోపు ఉండాలి. ఏడోతరగతికి పదకొండేళ్ల నిండి 14 ఏళ్లలోపు, ఎనిమిదోతరగతికి పన్నెండేళ్ల నిండి 15 ఏళ్లలోపు, తొమ్మిదోతరగతికి 13 ఏళ్ల నిండి 16 ఏళ్లలోపు ఉండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000లు మించకూడదు.

రాత పరీక్ష: ఆరోతరగతికి నిర్వహించే పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ నుంచి 50; అర్థమెటిక్, తెలుగు అంశాల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు నిర్వహించే పరీక్షలు 200 మార్కులకు ఉంటాయి. వీటిలో ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 30; సోషల్ సైన్స్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **రాత పరీక్ష తేదీ:** ఏప్రిల్ 13
- **మెరిట్ జాబితా విడుదల:** ఏప్రిల్ 25
- **ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** aptwgurukulam.ap.gov.



ఆర్ఐఎంసీలో ప్రవేశానికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్



డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదోతరగతి(2025 జనవరి టర్మ్) ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జనవరి 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జనవరి 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200, జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు విధానం:** విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి టీఎస్‌పీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **చిరునామా:** తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నాంపల్లి, హైదరాబాద్ - 500001
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **రాత పరీక్ష తేదీ:** జూన్ 1
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.rimc.gov.in, tspsc.gov.in

సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఆర్‌జీఐపీటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- పెట్రోలియం అండ్ ఎనర్జీ ఇంజనీరింగ్ విభాగంలో 'సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్' ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరు వారాలు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సంస్థకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్ ఆధ్వర్యంలో రీసెర్చ్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ రెండో సంవత్సరం లేదా మూడో సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు; ఎమ్మెస్సీ మొదటి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ప్రోగ్రామ్ తేదీలు:** మే 27 నుంచి జూలై 12 వరకు
- **వెబ్‌సైట్:** www.rgipt.ac.in



నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆర్‌కేఎల్)-సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. మే 16 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమౌతుంది. ఏ విధమైన ఫెలోషిప్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ఇవ్వరు. వసతి ఉచితం. ల్యాబొరేటరీ, లైబ్రరీ, ఇంటర్నెట్, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, టెక్నికల్ క్వాలిఫికేషన్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫెరిక్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఈ/బీటెక్ అభ్యర్థులు; ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఆర్క్/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్/డ్యూయెల్ డిగ్రీ అభ్యర్థులు; రెండో సెమిస్టర్ పరీక్షలు రాసిన ఎమ్మెస్సీ/ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్/ఎంబీఏ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది పరీక్షలు రాసినవారు, ఇప్పటికే డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం
- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ వ్యవధి:** మే 16 నుంచి జూలై 15 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** nitrkl.ac.in

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్‌పీ పీజీ డిప్లొమా



బిట్స్ పిలానీ - వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్‌పీ) కింద పీజీ డిప్లొమా ఇన్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ ప్రోగ్రామ్‌ని ఆఫర్ చేస్తోంది. కెరీర్‌కు బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సు చేయవచ్చు. వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఇంజనీర్ల కోసం దీన్ని రూపొందించారు. మాన్యుఫాక్చరింగ్‌లో డిజైన్, ఇంప్లిమెంటేషన్, మేనేజ్‌మెంట్ వ్యవహారాలపై ఇదంతా ఉంటుంది. మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ, బిగ్ డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర టాపిక్స్ ఈ కోర్సులో ఉంటాయి. మార్చి 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

మరిన్ని వివరాలకు: https://bitspilaniwilp.ac.in/pgd/post-graduatediplomainsmartmanufacturing.php చూడవచ్చు.

జాబ్ కార్నర్

ఎన్ఐఏబీలో ఇంజనీర్, క్లర్క్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ)... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: **1 పోస్టు**
2. క్లర్కులు: **2 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ(సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, టైప్‌రైటింగ్ నైపుణ్యాలు ఉండాలి.

వయోపరిమితి: సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు; క్లర్క్ పోస్టులకు 25 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.200. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 22

వెబ్‌సైట్: https://www.niab.res.in/

ఎన్ఐడీలో టెక్నికల్ అసిస్టెంట్‌లు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

1. డిజైన్ అసిస్టెంట్: **1 పోస్టు**
2. టెక్నికల్ అసిస్టెంట్: **2 పోస్టులు**
3. సీనియర్ అసిస్టెంట్‌లు: **2 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు 30 ఏళ్లు; సీనియర్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.25,500 - రూ.81,100; సీనియర్ అసిస్టెంట్‌కు రూ.29,200 - రూ.92,300.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: www.nid.edu/home

ఏపీలో లైబ్రేరియన్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... ఏపీ మెడికల్ అండ్ హెల్త్ సబార్డినేట్ సర్వీసులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

అర్హత: మొదటి లేదా ద్వితీయ శ్రేణిలో ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంకాం, ఎఎంఎల్ఐఎస్సీ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.48,440 - రూ.1,37,220

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.370. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.250

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 27 నుంచి ఏప్రిల్ 16 వరకు

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/


ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వెబ్‌సైట్: https://esic.gov.in/



బెల్‌లో ట్రైనీ ఇంజనీర్లు

రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగుళూరు కాంప్లెక్స్ తాత్కాలిక ప్రాతిపదికన దేశవ్యాప్తంగా హెచ్ఎల్ఎస్ అండ్ ఎస్‌సీబీ ఎన్‌బీయూ ప్రాజెక్టులో భాగంగా 517 ట్రైనీ ఇంజనీర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

కేటగిరీ రిజర్వేషన్: అన్‌రిజర్వ్‌డ్ - 210, ఓబీసీ-139, ఈడబ్ల్యూఎస్-52, ఎస్సీ-77, ఎస్టీ-39.

బెల్ జోన్ల వారీ ఖాళీలు: సెంట్రల్- 58, ఈస్ట్- 86, వెస్ట్ - 139, నార్త్-78, నార్త్ ఈస్ట్-15, సౌత్-132.

అర్హత: బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్/ టెలీ కమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు అవసరం. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఉత్తీర్ణత చాలు.

గరిష్ఠ వయసు: బీఈ/ బీటెక్ అభ్యర్థులకు 28 ఏళ్లు. ఎంఈ/ ఎంటెక్ అభ్యర్థులకు 30 ఏళ్లు మించకూడదు.

జీతభత్యాలు: నెలకు రూ.30,000 నుంచి రూ.40,000

ఎంపిక ప్రక్రియ: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.150, 18 శాతం జీఎస్‌టీ(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది).

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: మార్చి 13

వెబ్‌సైట్: www.bel-india.in/


మీకు తెలుసా?

- జుట్టు ఎక్కువగా ఉండి, కొమ్ములుండే ఈ జంతువును 'వైల్డ్ యాక్' అని పిలుస్తారు.
- రెండు మీటర్లుండే ఎత్తు, 3.8 మీటర్ల పొడవు.. ఈ జంతువు బరువు 800 కేజీల బరువు ఉంటుంది.
- హిమాలయాలు, టిబెట్ ప్రాంతాల్లో ఇవి జీవిస్తాయి.
- ఒంటరిగా ఉంటాయి. ఒక్కోసారి గుంపులో ఉంటాయి. ఒక్కో గుంపులో కనీసం 25 జంతువులు ఉంటాయి.
- సంవత్సరానికి ఒక్క బిడ్డనే కంటుంది ఇది.
- మగ జంతువును 'బుల్' అని.. ఆడ జంతువును 'కౌ' అని పిలుస్తారు.
- ఇవి సవాల్ విసరటంలో ముందుంటాయి. ఇవి కొట్లాడుకోవటం ప్రారంభిస్తే కనీసం రెండు రోజులు పలు దఫాలుగా మాట్లాడతాయి.



- ఇవి కేవలం 10 వేల జంతువులే ఉన్నాయి.
- వైల్డ్ యాక్స్ పిల్లలను పెంచుకుని వాటిని పెద్దయ్యాక బరువును మోయటానికి ఉపయోగిస్తారు.
- హిమాలయాల్లో ఇరవై వేల మీటర్ల ఎత్తులో కూడా ఇవి బతకగలవు.
- ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశంలో వీటి ఫొటోలతో స్టాంపులు కూడా వేశారు.
- 17 వ శతాబ్దంలో సైబీరియా ప్రాంతంలో వీటి శిలాజాలు ఉన్నాయి. అయితే ఇవి ఐదువేల సంవత్సరాల కిందటి నుంచి ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

దారి కనుక్కోండి



5 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 244

		3			7	1	8	
				9				6
		8		3				7
	3		9		6			
	9		2	8	3		5	
			1		5		6	
6				2		7		
5				1				
	8	9	7			2		

సుడోకు - 243 సమాధానం

1	4	7	6	8	3	2	5	9
3	9	5	7	1	2	4	8	6
2	8	6	9	5	4	1	3	7
9	5	3	8	6	1	7	2	4
6	7	4	3	2	9	5	1	8
8	2	1	4	7	5	9	6	3
7	3	2	1	4	8	6	9	5
5	6	9	2	3	7	8	4	1
4	1	8	5	9	6	3	7	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.